ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada,Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-4-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 77 పేజీలు: 10+4 వెల: 6.50


**దేశం కోసం మోడీ కృషి భేష్: ట్రంప్** 5లో

**రాజ్యసభ డిప్యూటీగా హరివంశ్ హ్యాట్రిక్**

# వీగిన 'సవరణ'బిల్లు

## మూడింట రెండువంతుల మెజారిటీ సాధించలేకపోయిన 131 రాజ్యాంగ సవరణ బిల్లు

**మహిళా బిల్లు, యుటి చట్ట సవరణ బిల్లు ఉపసంహారణ**

### మూడు బిల్లులను తీవ్రస్థాయిలో వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర విపక్షాలు



### బిల్లును ఓడించి తీరుతామని ప్రకటించిన విపక్షనేత రాహుల్

సుదీర్ఘంగా సాగిన చర్చ అనంతరం జరిగిన ఓటింగ్

2023 మహిళా రిజర్వేషన్ అమలులోకి వచ్చినట్లు ఓటింగ్‌కు ముందే నాటకీయంగా నోటిఫికేషన్ జారీ

### లోక్‌సభ నేటికి వాయిదా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయంగా వ్యతిరేకంగా 230 మంది ఓటువేసారు. ఎవ్వరూ గైర్హాజరు కాలేదు. మొత్తం 528 మంది హాజరయినట్లు లోక్‌సభ పట్టీలో ప్రకటించారు. పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ల బిల్లులకోసం రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం వచ్చింది. 131వ రాజ్యాంగ సవరణను లోక్‌సభ తీవ్రంగా వ్యతిరేకించింది. మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో బిల్లు వీగిపోయింది. బిల్లు ఆమోదం పొందాలంటే 352 ఓట్లు అవసరం అవుతాయి. రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోవడంతో ఇతరత్రా ప్రవేశపెట్టదలిచిన పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా ప్రసంగం తర్వాత ఓటింగ్ ప్రారంభించారు. బిల్లు ఆమోదం పొందేందుకు సరిపడే ఓట్లు రాలేదు. విపక్షాలు ఈ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఎంతమాత్రం సహకరించలేదు. ఈ బిల్లును ఓడించి తీరుతామని అంతకుముందే కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రకటించారు. ఈ బిల్లుతో కేంద్రం దక్షిణాది, ఈశాన్యరాష్ట్రాల హక్కుల్ని హరిస్తోందన్నారు. 850కి లోక్‌సభ సీట్లను పెంచాలనుకున్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవ >>2

| | |
|---|---|
| హాజరైన ఎంపీలు: | 528 |
| అనుకూలం: | 298 |
| వ్యతిరేకం: | 230 |
| బిల్లుకు అవసరం: | 352 |



**మహిళా బిల్లు వైఫల్యానికి బిజెపిదే బాధ్యత: కెటిఆర్** 2లో



## తెరచుకున్న హార్ముజ్

లెబనాన్‌పై సీజ్‌ఫైర్ ఉన్నంతవరకు..

ఇరాన్ విదేశాంగశాఖ వెల్లడి

**టెహ్రాన్, ఏప్రిల్ 17:** అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హర్మ్యూజ్‌ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల >>2



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వినతిపత్రం అందజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### 30 ఎల్ఎంటి బాయిల్డ్ రైస్
# సేకరించండి

యాసంగి ధాన్యం మిల్లింగ్‌కు అనుకూలం

బకాయిలు రూ.1,468 కోట్లు విడుదల చేయండి


**కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరిన సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటి) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని కేంద్ర మంత్రికి తెలిపారు. ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో >>2

**దేశ చరిత్రలో ఇది మరపురాని రోజు**

ప్రజాస్వామ్య శక్తులు ఏకమై జాతీయ విపత్తును నివారించాయి: సిఎం రేవంత్ 2లో



శుక్రవారం న్యూఢిల్లీలో ఏపి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌తో భేటీ అయిన సిఎంరేవంత్‌రెడ్డి

# ఎంపి తేజస్వి సూర్యపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్

## బిజెపి కార్యాలయాన్ని ముట్టడించిన బిఆర్ఎస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్17:** బిజెపి యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ, ఏపీ విభజనను భారత-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ వ్యాఖ్యలు చేయడానికి నిరసనగా బీజేపీ ఎంపీపై ఢిల్లీలో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వందలాది మంది బలిదానాలు,దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాగా, కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించింది. పార్లమెంట్ సాక్షి గా తెలంగాణ విభజనను పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు.

తెలంగాణ అమరవీరుల త్యాగాలను, తెలంగాణ ప్రజల మనోభావాలను బీజేపీ ఎంపీ కించపరిచాడని అన్నారు. తన వ్యాఖ్యలకు గాను బీజేపీ ఎంపీ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ కార్యాలయం ఎదుట తేజస్వీ సూర్య చిత్రపటాన్ని దగ్ధం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతల హంగామా నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు బీఆర్ఎస్వీ నేతలను అదుపులోకి తీసుకున్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

# సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు సిఎం రేవంత్ రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్17:** భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎంపీలు వేంనరేందర్ రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్‌నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# డీలిమిటేషన్ అంశాన్ని ముడిపెట్టడంవల్లే బిల్లు వీగిపోయింది

## మహిళా బిల్లు వైఫల్యానికి బిజెపిదే బాధ్యత : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్17:** మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బిజెపి పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సి న రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బిఆర్ ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, డీలిమిటేషన్ పేరుతో కావాలనే చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసింది బిజెపి అని ఆయన ధ్వజమెత్తారు. మహిళా సాధికారతపై బిజెపికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని నేటి పరిణామాలతో తేలిపోయిందని ఎద్దేవా చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. 'ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదు. కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షి ణాది రాష్ట్రాల గొంతు కోయాలని బిజెపి చూసింది'అని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా రిజర్వేషన్ల పేరుతో బిజెపి ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బిజెపి చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బిజెపి తన నిజాయితీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టి, రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.దేశంలోని అనేక పార్టీలు డిలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని..ప్రస్తుత విధానంలో దక్షిణ భారత దేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బిజెపి గుర్తించాలన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశం పైన విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలన్నారు. డీలిమిటేషన్ అంశం పైన మొండిగా ముందుకు పోవడం కుదరదనే విషయం ఈరోజు లోక్సభలో జరిగిన పరిణామాలను బట్టి బిజెపి గుణపాఠం నేర్చుకోవాలని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా హక్కు అని కేటీఆర్ గుర్తుచేశారు. జమ్మూ కాశ్మీర్, అస్సాం రాష్ట్రాల్లో దేశవ్యాప్త డీలిమిటేషన్ తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిరక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో , దేశవ్యాప్త డీలిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

# దేశచరిత్రలో ఇది మరపురాని రోజు

## ప్రజాస్వామ్య శక్తులు ఏకమై జాతీయ విపత్తును నివారించాయి: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్17:** లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిట్వీట్ చేశారు. భారత దేశ చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే మరుపురాని రోజు.. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ గారు, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్ష నాయకులు అంతా ఏకమై ఒక జాతీయ విపత్తును నివారించిన సందర్భం.. నల్ల బిల్లులను ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ ఐకమత్యంతో, సాహసంతో నిలిచిన మిత్రపక్షాల నాయకులు ఎం.కే. స్టాలిన్, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, లాలు ప్రసాద్ యాదవ్, హేమంత్ సోరెన్, ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, అరవింద్ కేజ్రీవాల్, అలాగే కమ్యూనిస్ట్ పార్టీల నాయకులందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# 30 ఎల్ఎంటి బాయిల్డ్ రైస్ సేకరించండి

>> సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్రమంత్రికి సిఎం తెలిపారు. తెలంగాణలో పండే యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటి బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బాయిల్డ్ రైస్ సరఫరా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ చేసిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. అదేవిధంగా 2014-15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సిఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషక లోప నివారణకు పంపిణీ చేసే పోషకాహార బియ్యాన్ని (ఎఫ్ఆర్‌కె) పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్‌లకు నిలిపివేశారని, తిరిగి ప్రారంభించాలని విన్నవించారు. ఈ సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎపి జితేందర్‌రెడ్డి, సెక్రటరి కోఆర్డినేషన్ అద్వైత్‌సింగ్, కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

### రాజ్యాంగంపై జరిగిన దాడిని తిప్పికొట్టాం: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** లోక్‌సభలో పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులకోసం ప్రవేశపెట్టిన రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోవడం దేశ ప్రజల విజయమని లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో బిల్లు వీగిపోయిన తర్వాత పార్లమెంటు ఆవరణలో ఆయన మాట్లాడారు. బిల్లును ఓడించామని, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. ఇండియా కూటమి దానిని ఆపింది.

# వీగిన 'సవరణ' బిల్లు

>> దంతో తాత్కాలికంగా బ్రేక్‌పడింది. నిజానికి రాజ్యాంగసవరణ బిల్లుతోపాటే పునర్విభజన బిల్లు 2026, కేంద్ర పాలితప్రాంతాల చట్టాలు సవరణ 2026 బిల్లులనుప్రవేశపెట్టింది. అయితే రాజ్యాంగసవరణ బిల్లు వీగిపోవడంతో ఇతర బిల్లులను విత్‌డ్రాచేసుకోవాల్సి వచ్చింది. లోక్‌సభలోప్రస్తుతం ఉన్న 543 నియోజకవర్గాలను 2029 పార్లమెంటు ఎన్నికల నాటికి 850కి పెంచే ప్రక్రియతో పునర్విభజన బిల్లును తెచ్చింది. మహిళలకు వచ్చే ఎన్నికలనుంచే 33శాతం రిజర్వేషన్ అమలుకు ఈ పెరిగిన నియోజకవర్గాలతో భర్తీచేయాలన్నది ఎన్డీయే ప్రభుత్వ యోచనగా ఉంది. ఇందుకోసం 2011 జనాభా లెక్కలప్రకారం పునర్విభజన కూడా నిర్వహించారు. అయితే కీలకమైన రాజ్యాంగసవరణ 131వ బిల్లు వీగిపోవడంతో ఎన్డీయే పక్షం లోక్‌సభలో నిస్తేజంగా కూలబడింది. బిల్లుపై ఓటింగ్ వివరాలుప్రకటించిన తర్వాత శనివారానికి లోక్‌సభ వాయిదాపడింది. రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు.

ఓటింగ్‌లోపే న్యాయశాఖ నోటిఫికేషన్

ఇదిలా ఉంటే బిల్లులపై పార్లమెంటులో తీవ్రస్థాయిలో వాగ్వాదాలు నడుస్తున్న క్రమంలోనే కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. అర్థరాత్రినుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి వచ్చినట్లుగా వెల్లడించింది. మహిళా రిజర్వేషన్ చట్టం 2023 అర్థరాత్రినుంచి అమలులోకి వచ్చిందని న్యాయమంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసింద.ఇరాజ్యాంగం 106వ సవరణ చట్టం 2023లోని నిబంధనలు ఈనెల 16వ తేదీనుంచి అమలులోకి వస్తుందని నోటిఫికేషన్‌లో వెల్లడించింది. న్యాయశాఖ విడుదలచేసిన నోటిఫికేషన్‌పైనే ఇపుడు సర్వత్రా చర్చ నడుస్తోంది. ఓటింగ్ నిర్వహించకుండానే నోటిఫికేషన్ ఎందుకు జారీచేసారని విపక్షాలు ధ్వజమెత్తాయి. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకుఓటింగ్ జరిగితే అంతకుముందేమహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టం 2023ను గురువారంనుంచే అమలులోకి వచ్చిందని న్యాయశాఖ నోటిఫికేషన్ జారీచేయడంపైసర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. అయితేనియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తర్వాతనే రిజర్వేషన్లు అమలవుతాయని తర్వాత వివరణ ఇచ్చే ప్రయత్నంచేసింది. అయితేనోటిఫికేషన్ ఉపసంహారించుకున్నట్లు ఎక్కడా అధికారిక ప్రకటన రాలేదు.

# ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనల్లో మార్పులు

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్17:** తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ విమానాశ్రయాల పరిసర ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్ నాయిస్ జోన్ నిబంధనలలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి విమానాశ్రయాల పరిసరాల్లో భవన నిర్మాణాలపై ఉన్న ఆంక్షలను సవరిస్తూ తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. తెలంగాణ బిల్డింగ్ రూల్స్-2012లో మార్పులు చేస్తూ జీవోఎంఎస్ నంబర్ 168 ద్వారా సవరణలను ప్రకటించింది. విమానాల రాకపోకల వల్ల కలిగే శబ్ద కాలుష్యం దృష్ట్యా, గతంలో నిర్మాణాలపై కఠినమైన నియంత్రణలు ఉండేవి. అయితే, మారుతున్న పట్టణాభివృద్ధి అవసరాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. నాయిస్ జోన్ ప్రభావిత ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులపై ప్రభుత్వం ఇప్పుడు మరింత స్పష్టతనిచ్చింది. నాయిస్ జోన్ కిందకు వచ్చే ప్రాంతాల్లో భవనాల ఎత్తు, రకానికి సంబంధించి గతంలో ఉన్న కొన్ని అడ్డంకులను తొలగించారు.

# ప్రధానిమోడీ ఓ మెజీషియన్! లోక్‌సభలో రాహుల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ప్రధాని నరేంద్ర మోదీని ఓ ఇంద్రజాలకుడితో పోల్చారు రాహుల్ గాంధీ. శుక్రవారం లోక్‌సభలో ఆయన రాజ్యాంగ సవరణ బిల్లులపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బాలాకోట్ దాడులు డీమానిటైజేషన్ ఆపరేషన్ సింధూర్ ఇంద్రజాలకుడు మోడీ అని రాహుల్ విమర్శలు చేశారు. దీంతో బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిమాండ్ చేశారు. మోడీపై చేసిన వ్యాఖ్యలు ఖండించదగ్గవని ఆయన అన్నారు. రాహుల్ తన ప్రసంగంలో పదేపదే మెజీషియన్ అన్న పదాన్ని వాడారు. ప్రధాని మోడీని ఉద్దేశించేందుకు ఆయన ఆ పదాన్ని వాడారు. అయితే స్పీకర్ ఓం బిర్లా ఆయనకు వార్నింగ్ ఇచ్చారు. ఇలాగే మాట్లాడితే అవకాశం ఇవ్వనున్నారు. దీంతో ఆ పదాన్ని వాడబోనని రాహుల్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో మహిళా సాధికారత సంబంధం లేని అంశమని రాహుల్ అన్నారు. ఇది కేవలం దేశ ఎన్నికల మ్యాప్‌ను మార్చే అంశమన్నారు. కుల గణనను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దళితులు, ఓబీసీలకు ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.

# కాళేశ్వరంపై స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

## కమిటికి కన్వీనర్‌గా నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణుడు, రిటైర్డ్ ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కీలక బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు భారీ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా పనుల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటిని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణుడు, రిటైర్డ్ ఆర్మీ అధికారి కల్నల్ పరిక్షి త్ మెహ్రా కన్వీనర్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడం ఈ కమిటీ పని. వారానికి రెండుసార్లు సమావేశమై పురోగతిని ఈ కమిటీ సమీక్షించనుంది. ప్రతీరోజూ జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

వర్షాకాలం ప్రారంభం కాకముందే కీలకమైన పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. బ్యారేజీల పునాదుల పటిష్టతను తెలుసుకోవడానికి మే 30వ లోపు జియోటెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యుఎస్), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతు పనులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి మేడిగడ్డను పాక్షి కంగానైనా వినియోగంలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష ్యంగా కనిపిస్తోంది. కాళేశ్వరం బ్యారెజిలకు వీలైనంత తొందరగా మరమ్మతు పనులను పూర్తి చేసి నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచించిన విధంగా బ్యారేజేల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి అవసరమైన పరీక్షలు నిర్వహించి పునరుద్ధరించడం ప్రధాన లక్ష ్యంగా ఈ కమిటీ పనిచేయనుంది. జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలను తొందరగా పూర్తి చేస్తే దానికి అనుగుణంగా మరమ్మతు పనులు ప్రారంభం కానున్నాయి. బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ఇంజినీర్లు, అధికారులతోపాటు ఆయా రంగాల్లో నిపుణులను కూడా కోఆర్డినేషన్ కమిటీలో సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

# నియోజకవర్గాల సమతుల్యతకోసమే డీలిమిటేషన్ బిల్లు

## లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** రాజ్యాంగ బద్ధంగా నియోజకవర్గాల్లో సమతుల్యతను పాటించే లక్ష్యంతోనే నియోజకవర్గాల పునర్విభజన అమలుచేయాలనినిర్ణయించామని, అలాగే వచ్చే పార్లమెంటు ఎన్నికలనుంచే చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే లక్ష్యంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపాదిస్తున్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్‌షా పార్లమెంటుకు స్పష్టంచేసారు. సభలో సుమారు 133 మందికిపైగాసభ్యులు ప్రసంగించిన తర్వాత ఓటింగ్‌కు ముందు శుక్రవారం లోక్‌సభలో అమిత్‌షా రాజ్యాంగసవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంత చట్టాల సవరణ బిల్లు, పునర్విభజన బిల్లులపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌ల ప్రధాన ఉద్దేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా లోక్‌సభకు వివరించారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉందని చెప్పారు. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం అమిత్‌షా లోక్‌సభలో సమాధానమిస్తూ, నియోజకవర్గాల్లోని జనాభాలో భారీ వ్యత్యాసం కారణంగా ఒక్కో ఎంపీ లక్షలాది మంది ఓటర్ల సమస్యలను వినడటం కష్టంగా మారిందన్నారు. ఒక చోట 39 మంది లక్షల మంది ఓటర్లుంటే, మరో చోట 60 వేల మంది ఓటర్లున్నారని, ఇలా నియోజకవర్గాల్లో జనాభా వ్యత్యాసాలున్నాయని చెప్పారు. పునర్విభజన ద్వారా నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఎంపీ లాడ్స్‌ను కూడా సమర్థవంతగా వినియోగించుకునే వీలుంటుందని చెప్పారు. పునర్విభజనతో ఎస్సీ, ఎస్టీ సీట్లు పెరుగుతాయన్నారు.

### వారం - వర్జ్యం

18-04-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, అశ్విని కార్తె
పాడ్యమి మ.2.09
అశ్వని ఉ.9.41
వర్జ్యం : ఉ.6.04-ఉ.7.31
సా.6.17-రా.7.42
దు.తె.5.50-ఉ.7.28
రాహుకాలం - ఉ.9.00-10.30

### వారాఫలం

**మేషం:** మీ శక్తి సామర్థ్యములు, ప్రతిభ, ఆకస్మికముగా చాలామందికి గుర్తుకు వస్తాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహము.

**వృషభం:** మంచి అవకాశములను గురించి గతములో చేసిన ప్రయత్నములు ఇప్పుడు అక్కరకువస్తాయి. బంధుమిత్రుల కలయిక.

**మిథునం:** వృత్తి, ఉద్యోగములలో స్థితి చెప్పుకోదగిన స్థాయిలో మెరుగవుతుంది. కోర్టు వ్యవహారములకు అనుకూలము.

**కర్కాటకం:** గృహనిర్మాణ సంబంధమైన విషయములు స్వల్ప మార్పులను చోటు చేసుకుంటాయి. నూతనవిద్యావకాశాలు.

**సింహం:** కుటుంబములోనివారి ఆరోగ్య విషయమై ప్రత్యేక శ్రద్ధ, ఖర్చులను సూచించు చున్నది. సంతాన విషయంలో జాగ్రత్త.

**కన్య :** బంధువులతో చర్చించిన అభివృద్ధి కార్యక్రమములు ఆచరణలోనికి వస్తాయి. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**తుల :** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గు చూపేకన్నా స్థిరాస్తుల కొనుగోళ్ళపైన పెట్టుబడిని మదుపుచేయుట మంచిది.

**వృశ్చికం:** దైవ కార్యములను, శుభ కార్యములను నిర్విఘ్నముగా పూర్తిచేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఆధునిక సాంప్రదాయ పద్ధతులను వ్యతిరేకిస్తారు. సనాతన సాంప్రదాయ విషయముల మీద ఆసక్తి కలుగుతుంది.

**మకరం :** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. మీ వారికి మీ సాయం చేయవలసి వస్తుంది.

**కుంభం:** ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం లభిస్తుంది. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు.

**మీనం:** ఉద్యోగ పారిశ్రామిక రంగాలలో కొన్ని చిక్కులు ఎదురవుతాయి. మీ కృషి ఫలిస్తుంది. సోదరుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### కాంగ్రెస్ పాపం పండుతుంది

#### నేడు సిఎం నివాసం వద్ద బిజెపి నిరసన : రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఏప్రిల్17:** పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లును కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షమైన ఇండి కూటమి వ్యతిరేకించి, బిల్లు వీగిపోయేలా చేయడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజు అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు మండిపడ్డారు. ఒక సామాన్య వెనుకబడిన తరగతి కుటుంబం నుంచి వచ్చి, టీ అమ్ముకుంటూ ప్రధాని స్థాయికి ఎదిగిన నరేంద్ర మోదీ. సామాన్య మహిళలకు చట్టసభల్లో రాజ్యాధికారం దక్కాలని ఈ చారిత్రాత్మక బిల్లును తెచ్చారు. కానీ కాంగ్రెస్ పార్టీకి సామాన్య మహిళలు అధికారంలోకి రావడం ఇష్టం లేకనే ఈ బిల్లును అడ్డుకుంది. కాంగ్రెస్ అంటేనే వారసత్వ రాజకీయాలు. కాంగ్రెస్ పార్టీలో కేవలం గాంధీ కుటుంబం నుంచి వచ్చే మహిళలకు మాత్రమే (ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ) అధికారం ఉండాలి తప్ప, సామాన్య పేద ఇంటి ఆడబిడ్డలు నాయకులు కాకూడదనే కుట్ర ఇవాళ బయటపడింది.

# తెరచుకున్న హార్ముజ్

>> వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం అధికారికంగా వెల్లడించారు."లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హార్ముజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణి జ్యంలో హార్ముజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇదొక శుభవార్త అని చెప్పవచ్చు.

# గల్ఫ్‌లోని భారీ యుద్ధనౌకల్లో సైనికులకు ఆహార కొరత

**టెహ్రాన్, ఏప్రిల్ 17:** ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యంగా చెప్పుకునే అమెరికా ప్రస్తుతం తన సైనికులకు కడుపునిండా తిండి పెట్టలేని పరిస్థితుల్లో చిక్కుకుందన్న ప్రచారం వెల్లువలా సాగుతోంది. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్, హిందూ మహాసముద్రంలో మోహరించిన యూఎస్ఎస్ అబ్రహం లింకన్, యూఎస్ఎస్ ట్రిపోలీ వంటి భారీ యుద్ధనౌకల్లో ఆహార సంక్షోభం తలెత్తిందని, సరిపడా ఆహారం అందక వేలాది మంది సైనికులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. ఈ నౌకల్లోని సైనికులకు అరకొరగా భోజనం అందుతోందని, ట్రేలు దాదాపు ఖాళీగా ఉంటున్నాయని నివేదికలు వస్తున్నాయి. తాజా పండ్లు, కూరగాయల సరఫరా నిలిచిపోవడంతో, కేవలం ఉడికించిన క్యారెట్లు, ప్రాసెస్ చేసిన మాంసంతోనే వారు సరిపెట్టుకోవాల్సి వస్తోంది. దుస్థితికి సంబంధించిన ఫోటోలు బయటకు రావడంతో సైనికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనవ్యక్తం చేస్తున్నారు.

# ఏరోస్పేస్ వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

## ప్రస్తుత సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో ఎకో సిస్టం అభివృద్ధి: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 17:** భవిష్యత్తు ఏరోస్పేస్ రంగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆర్అండ్‌డి, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్ ఈ మూడింటిని అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రాబోయే రోజుల్లో ఏరోస్పేస్‌లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శుక్రవారం ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఛేంజింగ్ సినారియో ఇన్ ఏరోస్పేస్, ఆర్అండ్‌డి, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్ అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఏరోస్పేస్ అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు యూఎస్, రష్యా, ఐరోపా దేశాలదే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి ధీటుగా గ్లోబల్ సప్లై చైన్‌లో మన దేశం కూడా కీరోల్ ప్లే చేస్తుందన్నారు. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు మన దేశంలోనే ఉన్నారన్నారు. కానీ మెకిన్సే నివేదిక ప్రకారం.. ల్యాబ్‌ల్లో జరిగే పరిశోధనల్లో 30 శాతం కూడా కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిశోధనల్ని ఉత్పత్తులుగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు.

# పవన్ ఖేరాకు ఎదురుదెబ్బ

## స్టే తొలగించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** అసోం సిఎం హిమంత బిశ్వశర్మ సతీమణిపై విమర్శలు చేసినందుకు అసోంలో నమోదైన కేసుకు సంబంధించి కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్‌ఖేరాకు సుప్రీంకోర్టులోనూ చుక్కెదురయ్యింది. ఇదే కేసులో పవన్ ఖేరాకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించడం తెలిసిందే. దీనిపై పవన్ ఖేరా తరపు న్యాయవాదులు శుక్రవారం ఉదయం సుప్రీం కోర్టులో వాదనలు వినిపించగా వీటిని ధర్మాసనం పట్టించుకోలేదు. అస్సాంలో ప్రస్తుతం న్యాయస్థానాలకు సెలవులు వున్నందున ముందస్తు బెయిల్‌పై విధించిన స్టేను తొలగించాలని, ఆయన ఉగ్రవాది కాదని, ఈ విషయంలో దయ చూపాలని న్యాయవాదులు కోరినా సుప్రీం కోర్టు అంగీకరించలేదు. దీనిపై అస్సాం కోర్టులోనే విచారణ జరగాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఇదే సమయంలో ఖేరా అస్సాం కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేయవచ్చని సుప్రీం కోర్టు పేర్కొంది. ఖేరాకు సంబంధించిన పిటిషన్లను వేగంగా విచారించాలని అస్సాం కోర్టులను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ సందర్భంగా అస్సాం పోలీసుల తరపున సుప్రీం కోర్టులో న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఖేరా నేరం చేశాడని, తెలంగాణ హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందేందుకు తప్పుడు పత్రాలు ఇచ్చాడని తెలిపారు. వీటిపైనా అస్సాం కోర్టులోనే విచారణ సాగాలని సుప్రీం కోర్టు తెలిపింది.

**ఖేరా లొంగిపోవడం మంచిది:**
**అసోం సిఎం హిమంత వెల్లడి**

కాగా ఖేరా వెంటనే గువహటికి వచ్చి లొంగిపోవడం మంచిదని అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ గువహటిలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఈ కేసులో పోలీసులు స్పందించకముందే ఖేరా లొంగిపోవడం బాగుంటుందని ఆయన అన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె విరమణ

## కార్మిక సంఘాలతో చర్చలకు ఎప్పుడూ సిద్ధమే

## ట్రాన్స్‌కో సిఎండి దృష్టికి సమస్యలు తీసుకెళ్లండి

## ఆర్టిజన్ల జెఎసితో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణలో పది రోజులుగా విద్యుత్ ఆర్టిజన్లు చేస్తున్న సమ్మెకు తెరపడింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కార్మికులకు సమ్మె విరమిస్తున్నట్లు విద్యుత్ ఆర్టిజన్ల జేఏసి ప్రకటించింది. ట్రాన్స్‌కో సిఎండి తో ఆర్టిజన్ల సమస్యల పై చర్చించేందుకు ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని జేఏసీ నిర్ణయించింది. ఆర్టిజన్ల జేఏసీ నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం డిప్యూటీ సీఎంతో భేటీ అయ్యారు. ఇందులో ఆర్టిజన్ల సమస్యలు, వారి డిమాండ్లపై చర్చించారు. వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు డిప్యూటీ సీఎం అనుమతించించారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై సిఎండితో చర్చించాలని, వాటి పరిష్కారానికి ఆయన కృషి చేస్తారని తెలిపారు. ప్రజలను మెప్పించే పనులు చేయాలని సూచించారు.



సమ్మెపై బ్యాన్ ఉండటమే కాకుండా, ప్రధానంగా వేసవి సీజను కావడంతో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుందని, ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరికాదని కాదన్నారు. కార్మికుల సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరిం చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రభుత్వం ఆలోచన చేస్తుందని చెప్పారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు సిద్దంగా ఉందని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. ఈ చర్చల్లో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ఆర్టిజన్ల నేతలు పాల్గొన్నారు.

# కర్ణాటకలో ఘోర ప్రమాదం.. ప్రైవేటు బస్సును ఢీకొన్న కారు

## రెండు వాహనాలకు మంటలు

## కారులోని ఆరుగురు సజీవదహనం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో గురువారం ఉదయం ప్రైవేటు బస్సును కారు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు సజీవ దహనం అయ్యారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా వున్నాయి. యాద్గిర్ జిల్లా శాంతాపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి 151ఎ వద్ద ఓ ప్రైవేటు బస్సును ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో కారుతో పాటు బస్సు ముందరి భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు నిమిషాల వ్యవధిలో మంటల్లో చిక్కుకోగా అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో ఆరుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. మంటల్లో చిక్కుకున్న బస్సులోని 20 మంది ప్రయాణికులు వెనుక భాగంలోని అద్దాలను పగులగొట్టుకుని కిందకు దూకడంతో అందరు తృటిలో తప్పించుకున్నారు. కాగా కారులో సజీవ దహనం అయిన వారిని రాయచూర్ జిల్లా సిర్వార్‌కు చెందిన కృష్ణ నాయక్ (52), ఆయన భార్య అనంతకళ (45), వారి బంధువులు శరణప్ప (36), అతని భార్య నిసర్గ (30), వీరి మూడేళ్ల కుమారుడు సిద్ధార్థతో పాటు సమీప బంధువు శశికళ (30)గా గుర్తించారు. గాయపడ్డ చిన్నారులు అద్విక (5), శ్రీనిధి (2)లు శరణప్ప కుమార్తెలుగా గుర్తించారు. ఈ చిన్నారుల పరిస్థితి విషమంగా వుందని పోలీసులు తెలిపారు. వీరిని యాద్గిర్‌లోని మెడికల్ సైన్స్ ఆసుపత్రికి తరలించారు. కారు ముందరి భాగంలోని ఒక టైర్ ఒక్కసారిగా పగిలిపోవడంతో డ్రైవర్ దానిపై నియంత్రణ కోల్పోయి ఎదురుగా వేగంగా వస్తున్న బస్సును ఢీ కొట్టినడం వల్ల ప్రమాదం జరిగిందని, ఇదే సమయంలో ఇంజన్‌లో మంటలు చెలరేగాయని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ప్రమాదానికి కారణమైన కారు యాద్గిర్ జిల్లాలోని సుర్‌పూర్‌లోని వేణుగోపాల స్వామి దేవాలయం నుంచి రాయచూర్‌లోని సిర్వార్‌కు వెళుతుండగా బస్సు బెంగళూరు నుంచి కలబురిగికి వెళుతోంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఈ ఘటన కారణంగా కొన్ని గంటల పాటు శాంతాపూర్ వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు భారీ క్రేన్లతో మంటల్లో కాలిపోయిన కారు, బస్సును తొలగించాక ట్రాఫిక్ రాకపోకలు సాఫీగా సాగాయి.



యాద్గిర్ జిల్లా శాంతాపూర్ వద్ద ప్రైవేటు బస్సును కారు ఢీకొన్న తరువాత మంటల్లో చిక్కుకున్న రెండు వాహనాలు.

# సింగర్ మంగ్లి ఫిర్యాదుతో

## న్యాయవాది సుబ్బారావుపై రెండు కేసులు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** న్యాయవాది సుబ్బా రావుపై పంజాగుట్ట పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సింగర్ మంగ్లీతోపాటు ఆమె సోదరుడు మరి కొందరిపై న్యాయవాది సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగ్లీతోపాటు మరో నలుగురిపై ఈ నెల 7న పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. మంగ్లీ తదితరులపై కేసు నమోదైన విషయాన్ని 'ప్రభాతవార్త' వెలుగులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. దీంతో సంచలనంగా మారిన ఈ వ్యవహారంలో న్యాయవాది సుబ్బారావు తనపై బెదిరింపులకు పాల్పడ్డాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు న్యాయవాది సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. దీనికితోడు ఫిర్యాదులు స్వీకరించే ప్రాంతంలోకి మద్యం సేవించి రావడంతోపాటు ఠాణాలో సమావేశాలు నిర్వహించి న్యూసెన్స్‌కు పాల్పడటంతో పోలీసు అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబ్బారావుపై మరో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. న్యాయవాది సుబ్బారావు కోరిక మేరకే తాము శ్వాసవిశ్లేషణ పరీక్షలు నిర్వహించామని అన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పంజాగుట్ట ఠాణాలో పోలీసులు వ్యవహరించిన తీరుపై న్యాయవాది సుబ్బారావు కోర్టును ఆశ్రయించగా ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలంటూ కోర్టు ఆదేశించింది.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్

**HMDA చట్టం 2008 యొక్క 15(3) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన**
**(ప్రభుత్వ మెమో నం. e3585669/Plg.I(1)/2026, తేది: 15.04.2026)**

HMDA చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008) యొక్క సెక్షన్ 15 యొక్క ఉప-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ G.O.Ms.No.363, MA & UD), తేది 21.08.2010 ప్రకారం ప్రభుత్వంచే ప్రకటింపబడి (పాత సర్కిల్ నం.III) GHMC సర్కిల్ నం. IV పూర్వపు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఏరియా (HMDA కోర్ ఏరియా) యొక్క సవరించబడిన అభివృద్ధి ప్లాన్ (మాస్టర్ ప్లాన్)లో ప్రకటించబడిన దానిలో సూచించబడిన భూమి వినియోగానికి ఈ క్రింది ముసాయిదా మార్పు చేయటానికి ప్రతిపాదించడమైనది.

G.O.Ms.No.363 MA & UD, తేది: 21.08.2010 ప్రకారం ప్రభుత్వంచే ప్రకటింపబడి (పాత సర్కిల్ నం.III) GHMC సర్కిల్ నం. IV, పూర్వపు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఏరియా (HMDA కోర్ ఏరియా) యొక్క సవరించబడిన అభివృద్ధి ప్లాన్ (మాస్టర్ ప్లాన్) ప్రకారం పారిశ్రామిక వినియోగ జోన్‌గా ప్రస్తుతం గుర్తింపబడిన 15310.8 చ.మీ. యొక్క విస్తీర్ణానికి హైదరాబాద్ జిల్లా, సికింద్రాబాద్ జోన్, హిమాయత్‌నగర్ (M), హిమాయత్‌నగర్ (V) వద్ద ఇ.నం. 1-8-675, ప్లాట్ నం.4లో (బహిరంగ భూమి) స్థలం అది ఇప్పుడు నివాసిత వినియోగానికి నిర్దేశింపబడటానికి ప్రతిపాదించబడింది.

పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.

సదరు ప్రతిపాదనలకు ఏ వ్యక్తి లేదా సంస్థ నుండైనా అభ్యంతరాలు/సూచనలు పరిగణింపబడతాయి. వారు అభ్యంతరాలు/సూచనలను లిఖితపూర్వకంగా ఈ ప్రకటన ప్రచురింపబడిన తేదీ నుండి (15) పదిహేను రోజులలోపుగా HMDA, MCకు గానీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ, MA & UD విభాగం, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి గానీ దాఖలు చేయవలెను.

సం/- ప్లానింగ్ ఆఫీసర్ (KS), HMDA

DIPR.No.940-PP/CL/Advt/1/2026-27, తేది: 17.04.2026


# మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించడం శోచనీయం

## బిజెపి సీనియర్ నేత ఆకుల విజయ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో కాంగ్రెస్‌తోపాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇవ్వకపోవడం శోచనీయమని బిజెపి సీనియర్ నేత, మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు ఆకుల విజయ పేర్కొన్నారు. దేశాన్ని పరిపాలించే సామర్థ్యం మహిళలకు ఉందని చరిత్రలో ఎందరో నిరూపించారని గుర్తు చేశారు. ఈ విషయమై శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా రిజర్వేషన్ ను కేవలం నినాదంగా మార్చి దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు తమ పబ్బం గడుపుకుంటు న్నాయని మండిపడ్డారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.

# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో అబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ కల్లు దుకాణం యజమాని నుంచి రెండు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డాడు. వివరాలు ఇలావున్నాయి. బిచుకుందా అబ్కారీ ఇన్‌స్పెక్టర్ దీను సత్యనారాయణ తన సర్కిల్ పరిధిలో గల గ్రామంలో లైసెన్స్ కల్లు దుకాణాన్ని మరో చోటుకు మార్చేందుకు, పట్టణ ప్రాంతాలలో అనధికారికంగా దుకాణాలను నడిపేందుకు దాని నిర్వాహకుడిని ఐదు లక్షల రూపాయల లంచం అడిగాడు. చివరకు ఇద్దరి మధ్య రెండు లక్షల రూపాయలకు బేరం కుదిరింది. దీనిపై బాధితుడు ఎసిబికి ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలో దిగి ఎసిబి అధికారులు రంగంలో దిగారు. శుక్రవారం ఉదయం బిచుకుందలో తాను అద్దెకు వుంటున్న ఇంట్లో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ బాధితుడి నుంచి రెండు లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. అనంతరం అతని ఇంట్లో సోదా చేయగా లెక్కలో లేని 45,760 రూపాయలు పట్టుబడ్డాయి. ఈ నగదును కూడా ఎసిబి అధికారులు జప్తు చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను అరెస్టు చేసి మొత్తం రెండు లక్షల 45,760 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు.



అబ్కారీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

# ఇప్పుడు పాదయాత్ర చేస్తానంటే ఎవరు నమ్ముతారు?

## పదేళ్లుగా కెటిఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదు?: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు కేటీఆర్‌పై విమర్శల దాడిని ఉధృతం చేశారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో పలు సామాజిక సంఘాల నేతలతో భేటీ అయిన ఆమె, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రాజకీయంగా అత్యంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఎందుకు ప్రజల్లోకి పోలేదు? ఇప్పుడు పాదయాత్రలు చేస్తానంటే ఎవరు నమ్ముతారు?' అని ఆమె ప్రశ్నించారు. కేటీఆర్ పాదయాత్ర ప్రస్తావనను ఎద్దేవా చేస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల్లోకి వెళ్లడం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. సామాజిక తెలంగాణే లక్ష్యంగా తాను కొత్త రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టానని, అందుకే తనకు అనేక కష్టాలు వచ్చాయని కవిత పేర్కొన్నారు. 'అందరికీ అధికారం అందాలని నేను మాట్లాడటం మొదలుపెట్టాకే నాకు సమస్యలు ఎదురయ్యాయి. బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేసినా, సామాజిక తెలంగాణ సాధించే వరకు నా పోరాటం ఆగదు' అని ఆమె స్పష్టం చేశారు. తన కొత్త పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ వంటి బహుజన సంఘాలు మద్దతు తెలపడం తనకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. వీరన్న అనుచరులు తనతో కలవడమంటే ఇక తమను ఆపే శక్తే లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లు బయటపెడతానని బాంబు పేల్చారు. గ్రహగతులు అనుకూలించాలని, ఏదైనా శని అడ్డు ఉంటే తొలగిపోవాలని వారణాసిలో పూజలు చేసినట్లు కూడా ఆమె వెల్లడించారు.

# రికార్డుల నుంచి తేజస్వి వ్యాఖ్యల తొలగింపునకు

## కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చిన కర్నాటక ఎంపి తేజస్వీ సూర్య మాటలు పార్లమెంట్ రికార్డులనుంచి తొలిగించడానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తేజస్వీ వాఖ్యలు సరిగాలేవని ఒప్పుకొన్నారని ఐతే తెలంగాణ ప్రజలు వారిని అసహ్యించుకోవద్దంటే ఆ వ్యాఖ్యలు తొలిగించాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటుపై బిజెపి నాయకులు ఇక ముందు ఏలాంటి వివాదస్పద వ్యాఖ్యలు చేయకుండా కట్టడి చేయాలని అదే విధంగా తొలిగించడానికి కార్యచరణ తీసుకోవాలని కోరారు.




# తేజస్విసూర్య వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపిల ఆందోళన

**హైదారబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ ఎంపిలు పార్లమెంట్ ప్రాంగణంలో శుక్రవారం మకర్‌ద్వార్ వద్ద ఆందోళన చేపట్టారు. తెలంగాణ ఏర్పాటును భారత, పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బిజెపి ఎంపి లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుపడుతూ నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమాన పరచవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య తెలంగాణ పట్ల ఏం అవగాహన లేకుండా మాట్లాడారని దుయ్యబట్టారు. తెలంగాణలో ఆత్మ బలిదానాలు చేసుకున్న 1,600 మంది అమర వీరులను అవమానించారని ఆవేదన చెందారు. తెలంగాణ ప్రజలకు తేజస్విసూర్య బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా, పాకిస్థాన్‌తో పోల్చిన తేజస్విసూర్య వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. తేజస్విసూర్య వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి సమర్థిస్తూ లోక్‌సభలో మాట్లాడారని కిషన్‌రెడ్డి తీరును తెలంగాణ ప్రజలు గమనించాలనీ ఆయన అన్నారు. బిఆర్ఎస్ అవయవదానం చేసి బిజెపికి చెందిన ఎనిమిది మందిని లోక్‌సభ పంపించిందని ఆయన అన్నారు.


బిజెపి ఎంపి తేజస్వీసూర్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైబ్రిడ్ విధానాన్ని తెలంగాణ ఏర్పాటును తూలనాడినా బిఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండటం తగదని అన్నారు. మిమ్మల్ని లోక్‌సభకు రానివ్వనిది తెలంగాణ ప్రజలు అని బిఆర్ఎస్ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. బిజెపిని గెలిపించి బిఆర్ఎస్ బుద్ధి తక్కువ పని చేసిందని ఆయన అన్నారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలను రికార్డుల నుంచి లోక్‌సభ స్పీకర్ డిలీట్ చేయాలని కోరారు.



# పోలీసుల ముందు హాజరైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు

## జూబ్లీహిల్స్ ఠాణాలో కొనసాగుతున్న విచారణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రోడ్ నంబరు-45లో 2022లో జరిగిన ప్రమాదసంఘటన వ్యవహారంలో నిందితుడిగా ఉన్న బోధన్ మాజీఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్ శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసుల ముందు హాజరయ్యాడు. 2022 మార్చి 17న జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో చంటిబిడ్డతో రోడ్డు దాటుతున్న కాజల్ చౌహాన్‌ను థార్ వాహనం (టీఎస్16 4ఆర్‌టి/ఆర్9589) ఢీకొట్టింది. ఈ సంఘటనలో మహారాష్ట్రకు చెంది ఫుట్ పాత్ మీద పడుకొని రోడ్డుపై బుగ్గలు విక్రయించే కాజల్ రెండున్నరేళ్ల కుమారుడు రణవీర్ చౌహాన్ మృతి చెందగా, ఆమె తోటికోడలు సారిక చౌహాన్, అడబిడ్డ సుష్మ చౌహాన్‌లకు గాయలయ్యాయి. ఈ సంఘటనపై కాజల్‌చౌహాన్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సంఘటన అనంతరం కారులో ఉన్న వ్యక్తులు పరారయ్యారు. వాహనం నంబరు, వాహనంపై ఉన్న స్టిక్కరు ఆధారంగా వాహనం బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు చెందిన వాహనంగా గుర్తించారు. కారులో అఫ్రాన్, రాహెల్, మహమ్మద్ మాజ్ ముగ్గురు కారులో ఉన్నట్లు గుర్తించారు. అయితే తొలుత కారును నడుపు తున్నది అఫ్రాన్‌గా పోలీసుల ముందు అంగీకరించాడు. దీంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రమాద సంఘటన తరువాత షకీల్ కుమారుడు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. కేసును లోతుగా పరిశీలించిన పోలీసులు కారు నడిపింది రాహెల్‌గా గుర్తించారు. ఇదే సమయంలో రాహెల్ పంజాగుట్టలోనూ మరో ప్రమాద వ్యవహారంలో నిందితుడిగా సైతం ఉన్నాడు. ఈ క్రమంలోనే రాహెల్ కోర్టును ఆశ్రయించగా పోలీసుల విచారణకు హాజరు కావాలంటూ సూచించింది. దీంతో రాహెల్ శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీసుల ముందు విచారణకు హాజరయ్యాడు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాహెల్‌ను శుక్రవారం ఉదయం నుంచి పొద్దుపోయే వరకు విచారించారు. ప్రమాదం జరిగిన రోజున వాహనం నడిపింది ఎవరు? వాహనంలో అతనితో ఉన్నది ఎవరు?, ప్రమాదం తరువాత తప్పించుకోవడానికి కారణాలు, కేసులో ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై విచారస్తున్నారు. శనివారం సైతం విచారణకు హాజరుకావాలని ఇప్పటికే రాహెల్‌ను ఆదేశించారు. తమకు స్పష్టమైన వివరాలు, నిజాలు తేలేవరకు విచారణ కొనసాగుతుందని పోలీసులు చెబుతున్నారు.



పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాహెల్

వార్త

సవ్య వచనాలు విని ప్రయోజనం లేదు. వాటిని నిత్యకృత్యంలో ఎంతవరకు ఆచరణలోకి తెస్తున్నామనేదే ముఖ్యం.

- వివేకానంద

# ఎంతెంత దూరం!

'ఎంతెంత దూరం .. క్రోసుడు క్రోసుడుదూరం' అన్న మాటలు వింటుంటే ఇదేదో కాల యాపన వ్యవహారంలా అనిపిస్తుంది. ఈ బాణీ నడిచిన దూరమెంతో తెలియకుండా మరో అడుగు ముందుకు వేయడం, వేయించడం కన్పిస్తుంది. కానీ ఎంత సేపటికీ గమ్యానికి చేరుకోలేం. అలాంటి మాయ మోహిత వ్యవహారమే పశ్చిమాసియా యుద్ధ తంత్రానికి ఆయువుపట్టులా ఉంది.ట్రంప్ మాటలు ప్రపంచానికి కొత్త కాకపోయినా కాళ్లలాక్కొచ్చి ఎలాగైనా ఈ యుద్ధాలను ఆపాలన్న తపన ఆయనలో కనపడడంతో కొంతలో కొంత మంచే జరుగుతుందని ఆశించాలి. కానీఎటూ తేల్చకపోవడమే విస్మయం. ఇజ్రాయెల్ దాడితో 'లెబనాన్‌లోని నబాటియాలో పొగ దట్టంగా అలుముకొంది'. 'ఈ వార్తపక్కనే' 'లెబనాన్‌లో శాంతి వీచికలు వీస్తున్నాయని', పదిరోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మరెందుకోసమో అర్థం కావడం లేదు. ఇరాన్ అమెరికా ఇజ్రాయెల్‌ల యుద్ధానికి మధ్య కూడా ఇలాంటి గడువులే ఉన్నాయని అనేక సార్లు కాల్పులు విరమణ పరిష్కారం లభించిందని పలుమార్లు ప్రస్తావించుకున్న విషయం విదితమే. చర్చలు విజయవంతంగా సాగుతున్నాయని పదేపదే వల్లె వేయడం మళ్లీ షరామామూలే. ఇరు ప్రాంతాల మధ్య కాల్పుల హోరు, దాడుల జోరు. విధ్వంసరచన అన్నీ ఆగకుండా జరిగిపోతున్నాయి. అమెరికాకు సామ్రాజ్యాధికారం దాహం తీరకున్నా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ మీద 'కసి' తీరేటట్లు లేకపోయినా, ఇరాన్ ప్రతిఘటన దాడులు ఓ కొలిక్కి రాకపోయినా పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేవి కావు. ఒకవేళ ఆగాలనుకున్నా అవి కోల్డ్‌స్టోరేజీలో ఉన్నట్లే అనుకోవాలి. ఇరాన్ అణుబాంబు తయారు చేయకూడదన్న షరతుపై అమెరికా పూర్తిగా పట్టుపడుతోంది. ఈ యుద్ధంలోకి ఎవరు ఎవరిని లాగినా జరిగిన నష్టం పూడ్చలేనిది. మాటలతో సరిపెట్టుకోలేనిది. అయితే చెప్పుకోదగింది ఏమిటంటే ఇంతకాలం ఇరాన్ అమెరికా ఇజ్రాయెల్‌ల మధ్య సాగుతున్న యుద్ధం ఏమాత్రం అమెరికన్లు ఇష్టపడటం లేదు. ఖాళీగా కూర్చొన్న అమెరికన్ పాలనాధిపతిని రెచ్చగొట్టి ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు ఇరాన్ మీద తన 'కసి'కి సమాధానమివ్వాలనుకోవడమే 'అతి'. తానెంతో మొనగాడ్నని ట్రంప్ భావించి ఇరాన్‌ను చిన్న చూపు చూడడం మరో తప్పిదం. ఇరాన్ ప్రతిఘటన ఇంతలా ఉంటుందని ఎవరూ ఊహించని పరిణామం అమెరికన్ల అహంకారాన్ని వదిల్చినట్లుంది. ఈ యుద్ధం మనకవసరమా?అనే ఆలోచనలోపడ్డారు ఇప్పుడు. అమెరికా పరిస్థితి శ్లేష్మంలో పడ్డ ఈగ మాదిరిగా విలవిల్లాడిపోతోంది. పైకి మాత్రం ట్రంప్ బీరాలుపలుకుతున్నారు. లోపల్లోపల ఎలా కుమిలిపోతున్నారో అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌కే ఎరుక. ఇజ్రాయెల్ దేశాధినేత నెతన్యాహుకు తాను ఎత్తిన కత్తిదించడానికి ఇష్టపడడంలేదు. కానీ ట్రంప్ మేకపోతు గాంభీర్యాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా చూడడమే నెతాన్యాహు లక్ష్యం. ఇప్పటికే ఇరాన్‌తో యుద్ధం కారణంగానే ప్రపంచంలో చమురు, ఆర్థిక సంక్షోభాలకు అమెరికాయేనని ప్రతి ఒక్కరికీ తెలిసిపోయింది. 'గల్ఫ్ మిధ్య, నాటో మిధ్య' అనే స్థాయికి ట్రంప్ చేరిపోయారు. గల్ఫ్ దేశాలు అమెరికా మీద ఆశపెట్టుకొని ఇరాన్ మీద పూర్తిస్థాయిలోగొడవకు దిగింది. ఇరాన్ వ్యూహాత్మక దాడులతో తీవ్రంగా నష్టపోయిందీ గల్ఫ్ దేశాలే. అమెరికా కాదు.మళ్లీ ఇప్పట్లో కోలుకోలేనంత ప్రపంచవ్యాప్తంగా చమురు, గ్యాస్ నిక్షేపాలు తరిగిపోతున్నాయి. అవి ఏదేశానికీ సక్రమంగా అందడం లేదు. రవాణా ఖర్చులుపెరిగిపోయాయి. వినియోగదారులను వాటిని సక్రమంగా అందించే విషయంలో కూడా సరైన నిర్ణయాలను తీసుకోలేక భారత్ బోల్తా పడిందనే చెప్పాలి. ఎందుకంటే ఆహార తయారీకి వంట గ్యాస్అవసరం. అది దొరకని పరిస్థితుల్లో ఇప్పటికీ ఎన్నో ఆహార తయారీ కేంద్రాలు వినియోగదారులకు అందుబాటులో లేవు. ఉన్నా వారి అవసరాలు తీరడంలేదు. ప్రతి వినిమయ వస్తువు ఆకాశానికెగిరిపోయింది.ఆర్థికవ్యవస్థసమూలంగా విచ్ఛిన్నమయ్యాక ఏ కూటములూ పరిస్థితిని అదుపు చేయలేకపోతున్నాయి. యుద్ధకాంక్ష అదుపులోకి రానిదే ఎవరూ ఏమీ చేయలేరు. తలపట్టుకుకూర్చోవడం తప్ప.అయితే ఇరాన్ యుద్ధం ఎంతకాలం సాగుతుందనే అంశంపై భారత్ వృద్ధి ఆధారపడి ఉంటుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యాఖ్యానిస్తున్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థికవ్యవస్థగా మారడం ఖాయమేనన్న అంచనా ఆయనది.ఇంధన అవసరాలకోసం 80-90శాతందిగుమతిపైనే ఆధార పడడం ఒక లోటుగా వివరిస్తున్నారు.దీనిని ఎదుర్కొనే సవాళ్ల పరిష్కారాలను కేంద్రప్రభుత్వం అన్వేషించాల్సి న అవసరముందని ఆయన సలహాఇచ్చారు. ఎన్ని మార్గాలున్నా వినియోగదారుల ప్రయోజనాల రక్షణ బాధ్యత ముఖ్యమని పేర్కొన్నారు.ట్రంప్ తీరులోఆందోళనకర పరిస్థితులను గురించి ఆయన ఏకరువు పెట్టారు. ప్రపంచం యావత్తూ ఈవిషయంపై ఏకాభిప్రాయంలోనే ఉంది. ఇన్నాళ్లు ముడిచమురు చైనా,రష్యాల నుంచి దిగుమతి చేసుకోడాన్ని ప్రోత్సహించిన ట్రంప్ మళ్లీ ఆంక్షలు విధించారు. కాసేప ట్లో మళ్లీ ఆ ఆంక్షలను ఎత్తివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. సంక్షోభాలు ఎన్ని ఎదురైనా, ఎన్ని విపత్తులనైనా సృష్టించి ఎకసక్కెం చేయడం ఆయనరీతి. మళ్లీ మళ్లీ చర్చలు విఫలమవడం ఏమోకానీ, తాజాగా ఇరాన్ ఓడ రేవుల్ని దిగ్బంధించనున్నట్లు ప్రకటించారు. యుద్ధ ఛాయలు కనపడుతున్న అన్ని ప్రాంతాల్లోనూ శాంతివీచికలు వీచే రోజు కోసం ఎదురుచూడాల్సిందే.



నౌకకు అండగా నిలిచే నీళ్లే ఒక్కోసారి నౌకను తలకిందులు కూడా చేయగలవు.

తిరుక్కురళ్



బలహీనులు ప్రతిబంధకాన్ని అధిగమించలేరు. సాహసులు ప్రతిబంధకానికి ఎదురొడ్డి విజయం సాధిస్తారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్

# అన్నదాతలకు 'అకాల' కష్టాలు

ఎందుకోఏమోకానీ రైతు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేక పగబట్టి, పిచ్చిబట్టి, పంతంబూని ప్రకృతి దెబ్బమీద దెబ్బ కొడుతున్నట్లుగాఉంది. లేకపోతే జనవరి, ఫిబ్రవరి నుండే వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభం కావడమేమిటి? ఫిబ్రవరిలో పడిన వర్షాలు పూత దశలో ఉన్న పండ్ల తోటలకు అపార నష్టం కలిగించాయి. ఇప్పుడు, అప్పుడు అని కాదు. ఎప్పుడు పడితే అప్పుడు అకాల వర్షాలు రైతులపై విరుచుకుపడుతున్నాయి.

దామెర్ల సాయిబాబ

మానవుడు ఎంత సాంకేతిక పరిజ్ఞానం సంపాదించినా, ఇతర రంగాల్లో మరెంత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నాడు. లేకుంటే ఏమిటి తీవ్రమైన ఎండలతో అల్లాడుతూ గుక్కెడు నీటి కోసం ఎదురుచూస్తూ ఎండ వేడిమిని తట్టుకోలేక పదుల సంఖ్యలో ప్రజలు పరలోకానికి పయనం కడుతుంటే మరోపక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. పిడుగుల శబ్దాలకు గజగజలాడుతున్నారు. దేశవ్యాప్తంగా యేటా వందలాది మంది ఈ పిడుగుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఏప్రిల్ మూడోవారంలోనే ఉన్నా తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు కొన్ని జిల్లాల్లో నలభైమూడు డిగ్రీలు దాటింది. నంద్యాలలో నిన్న గురువారం ఏకంగా నలభైఐదు డిగ్రీలు దాటినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని వాతావరణ శాస్త్రజ్ఞులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉపద్రవాలు సంభవించినప్పుడు వ్యవసాయ రంగానికి అపార నష్టం జరుగుతుంది. ఎందుకోఏమోకానీ రైతు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేక పగబట్టి, పిచ్చిబట్టి, పంతంబూని ప్రకృతి దెబ్బమీద దెబ్బ కొడుతున్నట్లుగా ఉంది. లేకపోతే జనవరి, ఫిబ్రవరి నుండే వర్షాలు, ఈదురుగాలులు ప్రారంభం కావడమేమిటి? ఫిబ్రవరిలో పడిన వర్షాలు పూత దశలోఉన్న పండ్ల తోటలకు అపార నష్టం కలిగించాయి. ఇప్పుడు, అప్పుడు అని కాదు. ఎప్పుడు పడితే అప్పుడు అకాల వర్షాలు రైతులపై విరుచుకుపడుతున్నాయి. కలియుగం అంటే ఇదే కాబోలు. మనుషులతోపాటు కాలం కూడా మారిపోతున్నదేమోననిపిస్తున్నది. రుతువును బట్టి కాలాలు, వాటికి అనుగుణంగాసాగు చేయాల్సి న పంటలను దృష్టిలో ఉంచుకొని విధి విధానాలు రూపొందించుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న ప్రణాళికలు, పథకాలు, వీటికి తగినట్లుగానే తయారు చేస్తారు. రైతులు తమ అనుభవాలను బట్టి ఏయే పంటలు ఎప్పుడు వేయాలో ముందే ప్రణాళిక వేసుకుంటారు. ఈ ప్రణాళికలన్నీ ఆయా రుతువులను బట్టి రూపొందించుకుంటారు. ఒకరకంగా చెప్పాలంటే రైతుల జీవన విధానం రుతుపవనాలపైనే ఆధారపడి ఉంది. ఇక సుడిగుండాలు, వాయుగుండాలు, తుఫాన్లు ఏర్పడడం కొత్త కాదు. వాటి వల్ల వర్షాలు కురవడం, జనజీవనాన్ని అతలాకుతలం చేయడం వంటివి రైతులకు కొత్తేమీ కాదు. కానీ ఇదంతా ఖరీఫ్ సీజన్‌లో జరుగుతుండటం సర్వసాధారణం. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి కూడా వేసవి చివరిలో రోహిణికార్తె ముందో,వెనకో వనగండ్ల వానలు, గాలిదుమారాలు వచ్చి పంటలకు నష్టం జరగడం విన్నాం, కన్నాం. అందుకే పంటలు మే రెండువారానికి ఇంటికి చేర్చుకునే విధంగా రైతులు ప్రణాళికలు తయారు చేసుకుంటారు. ఇటు వ్యవసాయ శాఖ కానీ, అటు నీటి పారుదల శాఖ కానీ అందుకు అనుగుణంగానే కార్యాచరణ రూపొందిస్తాయి. కానీ ఇప్పుడు అకాల వర్షాలు ఎప్పుడు పడితే అప్పుడు దాడి చేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న ఈ అకాల వర్షాలతో ఒక్క తెలంగాణలోనే ముఖ్యంగా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, తదితర జిల్లాల్లో ముప్పైఒక్కవేల ఎకరాల పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. మే నెల రెండు, మూడు వారాల వరకు వరికోతలు పూర్తికావు. తెలంగాణలోనే యాభైమూడు లక్షల ఎకరాలకుపైగా ఈసారి సాగు చేశారు. వరుణదేవుడు ఎప్పుడు, ఎక్కడ విరుచుకుపడతాడేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.వరి పరిస్థితి అలా వుంటే మొక్కజొన్న రైతుల పరిస్థితి మరో రకంగా ఉంది. దాదాపు కోతలు పూర్తయ్యాయి. తెలంగాణలో పదకొండు లక్షల ఎకరాలకు పైగా సాగు చేశారు. ఇరవైమూడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికార వర్గాలే అంచనా వేస్తున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం కేవలం తాము ప్రకటించిన మద్దతు

ఒక్క మాట

ధరకు ఎనిమిది వేల క్వింటాళ్లు మాత్రమే కొనాలని ఆదేశించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. రైతులు పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకోడానికి పడుతున్నఇబ్బందులు అన్నీఇన్నీకావు. రోడ్లపైనే ఎండబోసుకొని కొనేవారి కోసం ఎదురుచూస్తున్నారు. రాత్రి,పగలు కాపలా ఉండాల్సి వస్తున్నది. ఆ బాధలు భరించలేక పదహారు నుంచి పద్దెనిమిది వందల వరకు తెగనమ్ముకొని వెళ్లిపోతున్నారు. ఇకపోతే మామిడి పంట యేడాది అంతా కష్టపడితే ఒకే ఒక పంట వస్తుంది. గత రెండేళ్లుగా మామిడికి ఆదినుంచి దెబ్బ మీద దెబ్బ తగులుతున్నది. మిరప పంటకు వచ్చిన తామర పురుగు, తేనెబంక, గత రెండేళ్లుగా మామిడిని ఒడిసిపడుతున్నది. పూత దశలోనే డెబ్బైశాతం పైగా పూత రాలిపోతున్నది. తేనెబంకకు ఎన్ని మందులు కొట్టినా వదలడంలేదు. దీంతో డెబ్బైశాతం పూత, పిందెలు రాలిపోతే ఆ తర్వాత వరుసగా పడుతున్న వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో పడిన వడగండ్లు మామిడి రైతులను కోలుకోకుండా చేస్తున్నాయి. హార్టికల్చర్ నిపుణుల అంచనా ప్రకారం మన దేశంలో ఎక్కడా లేని విధంగా పదిహేను వందల రకాలకు పైగా మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ప్రపంచంలో మామిడి ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. మొత్తం ఉత్పత్తిలో యాభై శాతంపైగా భారత్‌లోనే పండుతున్నది. అందులోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నాయి. మొత్తం పండే పంటలో ఇరవై శాతంపైగా ఈ మూడు రాష్ట్రాల నుంచే దిగుబడులు వస్తున్నాయి. అందులోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మామిడికి ప్రత్యేక గుర్తింపు ఉంది. మొన్న కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ ప్రకటించడంతో మామిడి పంటలను అమ్ముకోలేక రోడ్లపై పారబోయాల్సి న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాత రెట్టింపు ఉత్సాహం తో పెట్టుబడి పెట్టిసాగు చేస్తే ఒక పక్క చీడపీడలు, మరొక పక్క అకాల వర్షాలు, వడగండ్లు కోలుకోకుండా చేశాయి. మామిడి రైతులకు బీమా సౌకర్యంకూడా అంతంత మాత్రం గానే ఉంది. ఇప్పటికే కొందరు మామిడి రైతులు తమ తోటలను నరికివేస్తున్నారు. ఇలాగే పరిస్థితి కొనసాగితే మామిడికి తిలోదకాలు ఇవ్వాల్సి న పరిస్థితులు ఇంకెంతో దూరంలో లేవని చెప్పొచ్చు. కోట్లాది మంది రైతు కుటుం బాలు జీవనోపాధికి సంబంధించిన సమాచారం అందివ్వడం లో వాతావరణ పరిశీలన కేంద్రాలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదేమోననిపిస్తున్నది. రైతులను తప్పుతోవ పట్టించడానికి తప్పుడు సమాచారం అందిస్తున్నారని చెప్పడం లేదు కానీ, కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా రైతులకు సరైన సమాచారం సకాలంలో ఇవ్వడంలో విఫల మవుతున్నారనే మాట రుజువు అయింది. అందుకే వాతావరణ శాఖ అంచనాల మీద రానురాను నమ్మకాలు సన్నగిల్లుతున్నాయి. ఎంతో అనుభవజ్ఞులైన నిపుణులు, మరెంతో సాంకేతిక పరిజ్ఞానం ఉందని చెప్పుకుంటూ సరైన సమాచా రం ఇవ్వలేకపోతున్నారనేది సామాన్యులను వేధిస్తున్న ప్రశ్న. భారత వాతావరణ పరిశోధనకు సుదీర్ఘ చరిత్ర ఉంది. కోల్‌కత్తా నగరాన్ని వరదలు ముంచెత్తి తీవ్ర నష్టం కలిగించడంతో వీటి నివారణకు ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్‌లు, వరదలు, రుతుపవనాలు వంటి సమాచారం ముందుగా సేకరించి అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను హెచ్చరించడానికి 1875లో కోల్‌కత్తా కేంద్రంగా వాతావరణ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది అంచలంచెలుగా పెరిగి దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించింది. అందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. పెరుగుతున్న అవసరాలు, మారిన పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను సమకూర్చడంలో పాలకులు శ్రద్ధ చూపడం లేదనే శాస్త్రజ్ఞుల ఆవేదన పాలకులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితులు దాపురిస్తున్నాయని ఎంతో కాలంగా విమర్శలున్నాయి. కొన్ని దేశాల్లో వాతావరణానికి సంబంధించి ఎంతో కచ్చితమైన సమాచారం వాస్తవానికి దగ్గరగా ఉంటున్నది. అక్కడ వారు వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానం కారణమని చెబుతున్నారు. సముద్రాల్లో వచ్చే మార్పును ఎంతో ముందుగా పసిగట్టి వివరాలు అందిస్తున్నారు. ఇలాంటివి ఎన్నో అభివృద్ధి చెందిన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారాన్ని అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని పెంచుకుంటూ ఆయా దేశాలు పురోగమిస్తుంటే మనదేశం కాలంచెల్లిన పరిజ్ఞానంతో కాలం గడపడం ఏమాత్రం సమంజసం కాదు. ఇటు శాస్త్రం కానీ, అటు సాంకేతిక పరిజ్ఞానం కానీ అందుకోలేని విధంగా ప్రకృతి తన గమనాన్ని మార్చుకుంటున్నది. పర్యావరణానికి మానవుడు చేస్తున్న చేటు కారణంగా ఈ పరిస్థితులు వస్తున్నాయనే వాదనను తోసిపుచ్చలేం. ఏదిఏమైనా వ్యవసాయానికి మూలాధారమైన వాతావరణ పరిశోధన, పరిశీలనపై పాలకులు దృష్టిపెట్టాలి. వర్ష గమనాన్ని కచ్చితంగా అంచనా వేయగలిగే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలి. ●

# డిజిటల్ సంకెళ్లతో మొద్దుబారుతున్న మెదళ్లు

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

డిజిటల్ యుగం మన జీవితాన్ని వేగవంతం చేసింది. సమాచారాన్ని క్షణాల్లో అందించే స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు మన రోజువారీ జీవనశైలిలో అంతర్భాగమయ్యాయి. అయితే ఈ సౌకర్యాల వెనుక ఒక నిశ్శబ్ద ప్రమాదం దాగి ఉంది. అదే 'డిజిటల్ సంకెళ్లు'. ముఖ్యంగా పిల్లలు యువతలో ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ఈ సంకెళ్లు మెదడును క్రమంగా మొద్దుబార్చుతున్నాయనే ఆందోళనపెరుగుతోంది. మొదటగా, ఫోకస్ సామర్థ్యంపై ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో పిల్లలు ఒక పనిపై ఎక్కువసేపు దృష్టి పెట్టగలిగేవారు. కానీ ఇప్పుడు వీడియోలు, గేమ్స్, సోషల్ మీడియా వల్ల మెదడు వేగంగా మారే సమాచారం కోసం అలవాటు పడుతోంది. ఫలితంగా, చదువులో కేంద్రీకరణ తగ్గిపోతుంది. ఒకే విషయంపై ఆలోచించడం కష్టంగా మారుతుంది. ఇది దీర్ఘకాలంలో విద్యా నాణ్యతను ప్రభావితం చేస్తుంది.అలాగే మెమరీ ఆలోచనా శక్తిపై ప్రభావం. చిన్న విషయాల కోసం కూడా గూగుల్ లేదా యాప్‌లపై ఆధారపడటం వల్ల మెదడు స్వయంగా ఆలోచించే అలవాటు కోల్పోతుంది. సమస్యలను విశ్లేషించి పరిష్కారం కనుగొనే నైపుణ్యం తగ్గిపోతుంది. దీనివల్ల సృజనాత్మకత క్షీణిస్తుంది. మెదడు పని తీరులో నెమ్మదితనం ఏర్పడి, 'మొద్దుబారిన స్థితి'కి చేరుతుంది. అలాగే రాత్రిళ్లు ఎక్కువసేపు ఫోన్లు వాడటం,గేమ్స్ ఆడటం, వీడియోలుచూడటం వల్ల నిద్రపట్టే సమయం ఆలస్యమవుతుంది. స్క్రీన్‌లనుంచి వచ్చే నీలికాంతి మెదడును విశ్రాంతి స్థితికి తీసుకురావడాన్ని అడ్డుకుంటుంది. నిద్రలేమి కారణంగా మెదడు పునరుత్పత్తి ప్రక్రియ దెబ్బతింటుంది. ఇది మరుసటి రోజు పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. డిజిటల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడిపే పిల్లలు, యువత వాస్తవ జీవిత సంబంధాలను తగ్గిస్తున్నారు. ఫేస్‌టుఫేస్ కమ్యూనికేషన్ లోపించడం వల్ల భావ వ్యక్తీకరణలో సమస్యలు వస్తాయి. చిన్న విష యాలకే ఒత్తిడి, ఆందోళన పెరుగుతుంది. సోషల్ మీడియాలో పోలికలు కారణంగాఆత్మవిశ్వాసం తగ్గుతుంది. ఇదే సమయంలో, డిజిటల్ వినియోగం పూర్తిగా చెడుగా చెప్పలేం. సరైన నియంత్రణలో ఉంటేఇది విజ్ఞానం,నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఆన్‌లైన్ కోర్సులు, విద్యా వీడియోలు, సృజనాత్మక యాప్‌లు మెదడును ఉత్తేజితం చేయగలవు. అవసరానికి మించి ఉపయోగించడంవల్లే ఈ డిజిటల్ సంకెళ్లు మెదడును బంధిస్తున్నాయి. ఈపరిస్థితిని మార్చడానికి కొన్ని కీలకచర్యలు అవసరం. తల్లి దండ్రులు పిల్లల స్క్రీన్ టైమ్‌పై పర్యవేక్షణ చేయాలి. రోజువారీ వినియోగానికి పరిమితులువిధించాలి. చదువు, ఆటలు, శారీరక వ్యాయామం,కుటుంబ సమయానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు కూడా డిజిటల్ అవగాహనపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. ముఖ్యంగా పిల్లలకు డిజి టల్ వినియోగంలో సమతౌల్యం అవసరమని నేర్పించాలి. డిజిటల్ పరికరాలు మన అభివృద్ధికి సాధనాలు మాత్రమే, కానీ అవి మన మెదడును నియంత్రించే స్థాయికి చేరితే అది ప్రమాదకరం. ●

# ప్రజావాక్కు

## రాష్ట్రాల మధ్య తేడాలొద్దు

డీలిమిటేషన్ వలన దక్షిణాది రాష్ట్రాలకుఅన్యాయం జరుగుతుంది. దీన్ని ఎదుర్కోక పోతే దక్షిణాదికి చాలా నష్టం కలుగుతుంది. జనాభా ప్రాతిపదికన ఎంపీల స్థానాలను పెంచితే , ఉత్తరాదిన మూడు నాలుగు రాష్ట్రాల ఎంపీలే మోడీకి సరిపోతుంది. దక్షణాది రాష్ట్రాలతో అవసరమే ఉండదు. ఉత్తరాది వాళ్లు కుటుంబనియంత్రణను పాటించనందున , ఆ రాష్ట్రాల జనాభా బాగా పెరిగిపోయారు. ఇప్పుడు జనాభా ప్రాతిపదికన ఎంపీల సీట్లు పెంచటం అంటూ జరిగితే దక్షిణాదిన పార్లమెంటు సీట్లు ఉత్తరాదికంటే చాలాతగ్గుతాయి.ఉత్తరప్రదేశ్ ,బీహార్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలలోఎంపీలసీట్లు పెరుగుతాయి. అప్పు డు ఆ నాలుగైదు రాష్ట్రాల ఎంపీల సంఖ్య ప్రధానిని ఎన్నుకునేందుకు సరిపోతాయి. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి వందరూపాయలు టాక్స్‌కడితే40మాత్రమే మనకు తిరిగి వస్తుంది. కానీ బీహార్ వాళ్ళు వంద టాక్స్ కడితే 1000 రూపాయలు ఇస్తుంది కేంద్రం. ఈ తేడా పోవాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ కలిగిన వ్యక్తి. విత్తనం వేసిన వెంటనే ఫలాలుఆశించకూడదు.వాటిఫలితాలు అనుభవించే రోజు ఆయన పేరు చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుంది. ఈ మధ్యలోఆదాయం పెట్టుబడుల రూపంలో వచ్చి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడిఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలోకి దూసుకు వెళ్లడానికి ఒకఅవకాశం అవుతుంది.మంచి విద్యావంతులు నైపుణ్యం వ్యక్తులు దీనికిఅవసరం. ఇలాంటి విద్యావంతులను నైపుణ్యమనివ్యక్తులను తయారు చేయడానికి పాఠశాల నుండి విశ్వవిద్యాలయంస్థాయివరకు విద్యార్థినీ విద్యార్థులకు అత్యంత అధునాతన టెక్నాలజికల్ విద్యతో పాటు విలువలు కూడా అవసరం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఫీజులు నియంత్రించాలి

రోజురోజుకు ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల వసూళ్లు తారస్థాయికి చేరుతున్నాయి. ఎల్కేజీ, యూకేజీల పేరిట ప్రైవేట్ పాఠశాలల యజమానులుభారీగా ఫీజులు దండుకుంటున్నారు. అధిక ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఇబ్బందులుపడుతున్నారు.అధికారులుఎక్కడికక్కడ ప్రత్యేక తనిఖీలు చేపడితేనే ఫీజులను నియంత్రించగలం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## ఆకాశంలో సగం అవకాశం అప్పుడే ఇవ్వం

శాసన వ్యవస్థలో మహిళలకు మూడోవంతు సీట్లను కేటాయించే చట్టంపై చర్చలకు మూడురోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలుమొదలయ్యాయి.మూడుదశాబ్దాలుగా పార్లమెంట్ గుమ్మంఎక్కిదిగి చివరకు 2024లో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం ఖరారైంది. అయితే ఆ చట్టం ప్రకారం 2034 లోపు సీట్ల కేటాయింపులు జరపడం కష్టం కాబట్టి,దాన్ని సవరిస్తూ 2029 ఎన్నికల నుండే అమలుచేసేలా సవరణ చేసుకుందామని ప్రభుత్వం కోరింది. అయితే అలా కోరడంలో అధికారపక్షం తాలూకా రాజకీయముంది. ఆ కోరికను మన్నించకపోవడంలో ప్రతిపక్షం తాలూకా రాజకీయముంది. వెరసి ఒక గంభీరమైన,ప్రగతిశీల సామాజికఅంశంతేలిగ్గా త్వరితంగా అమల్లోకిరాలేక, రాజకీయజంజాటంలో చిక్కుకుంది. 2024 లో చట్టంచేసినప్పుడు అదివెంటనే అమలవుతుంది అనకుండా వచ్చే డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత అమల్లోకి వస్తుంది అని అఖిల పక్షాలూ ఒప్పుకున్నాయి.2026 వరకూ ఆ ప్రక్రియపై ఫ్రీజ్‌ఉంది కనుక 2027 జనాభా లెక్కల ననుసరించి నియోజక వర్గాల పునర్విభజన చేపడితే అది తేలేసరికి ఎన్నికల క్యాలెండర్ ప్రకారం 2034 తర్వాతే తెములుతుంది.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## ఉచితాలకు పునాది తమిళనాడు

తమిళనాడు ఎన్నికలు ఉచిత హామీల పునాదిగా జరుగుతున్నాయా అనే అనుమానం రాకమానదు. ఈ ఉచితాల వల్ల ప్రయోజనం లేకపోగా ప్రజల నెత్తిన గుదిబండ కాబోతున్నాయి. ఇప్పటికే అప్పుల ఉబిలో కురుకొని పోతున్న రాష్ట్రాలు ఇంకా గుణపాఠం నేర్వకపోగ అధికారం కోసంఎన్ని అడ్డదారులు అయినా తొక్కుతామని అంటున్నాయి. ఎన్నికల హామీలు ప్రజల జీవితాలలో గుణాత్మక మార్పులు తీసుకొచ్చే విధంగా ఉండాలి. కానీ ఉచితాల మోజులో ప్రజాప్రతినిధులు ఒకరికి మించి మరొకరు హామీలు గుప్పిస్తున్నాయి.

- భారత అవినాష్, జనగామ

## క్రూరత్వాన్ని బయటపెడుతున్న రాష్ట్రాలు


మధ్యప్రాచ్యంలో ఇటీవల పెరిగిన ఉద్రిక్తతలు ప్రపంచ రాజకీయాల్లో కొత్తప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇరాన్‌తో అణుఒప్పందం కుదిరే దశకు కొన్ని రోజుల ముందు ఈ దాడులుప్రారంభమయ్యాయన్న వార్తలు పరిస్థితిని మరిం త సంక్లిష్టం చేశాయి. ఆ దశలోనే యుద్ధ యంత్రాంగం సిద్ధమైందని ఉపగ్రహ చిత్రాలు సూచిస్తున్నట్లు అంతర్జాతీయ నివేదికలు పేర్కొన్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

# దక్షిణాదిన రగులుతున్న రాజకీయ చిచ్చు

జుర్రు నారాయణ యాదవ్

ఒక దేశం లేదా రాష్ట్రంలో జనాభా మార్పులకు అనుగుణంగా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించే ప్రక్రియను 'డీలిమిటేషన్' అంటారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం, ప్రతి పది ఏళ్లకోసారి జరిగే జనగణన తర్వాత కేంద్ర ప్రభుత్వం 'డీలిమిటేషన్ కమిషన్'ను ఏర్పాటు చేస్తుంది. భారతదేశంలో ఇప్పటివరకు 1952లో, 1963లో,1973 లో,2002 లో మొత్తం 4 సార్లు డీలిమిటేషన్ కమిషన్లు ఏర్పాటయ్యాయి. 1976 నుండి జనాభా నియంత్రణ చర్యల కారణంగా నియోజకవర్గాల సంఖ్యపై పరిమితి విధించారు. తదుపరి పునర్విభజన 2026 తర్వాత జరిగే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు గత ఐదు దశాబ్దాలుగా జనాభా నియంత్రణలో అద్భుతమైన పురోగతిని సాధించాయి. 1971లో దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24.7ఉండగా, 2011 నాటికి అది 21 శాతంకు తగ్గింది. దీనికి విరుద్ధంగా, ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ జనాభా వాటా 39.4 నుండి 42.4శాతానికి పెరిగింది. ఈ వ్యత్యాసం కారణంగానే, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రించిన తమకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళన ఈ రాష్ట్రాల్లో వ్యక్తమవుతోంది. 2011/2027 జనాభా అంచనాల ప్రకారం సీట్ల సంఖ్యను పెంచితే ఉత్తరాది రాష్ట్రాల వాటా పెరిగిదక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 80నుండి 143 సీట్లకు, బీహార్‌లో 40 నుండి 79 సీట్లకు, తమిళనాడులో 39 నుండి 49 సీట్లకు,తెలంగాణలో 17నుండి 26 సీట్లకు. ఆంధ్రప్రదేశ్‌లో 25 నుండి 38 సీట్లకు పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ దక్షిణాది రాష్ట్రాలలో కూడా సీట్లు పెరిగినట్లు కనిపించిన పెరుగుదల రేటు మాత్రం తక్కువగా ఉంటుంది. దక్షిణాది వాటా ప్రస్తుతం పార్లమెంటులో సుమారు 24శాతం ఉండగా, పునర్విభజన తర్వాత అది 18-20శాతానికి తగ్గిపోవచ్చు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల నిర్ణయాత్మక శక్తి తగ్గిపోతుంది. ఉత్తరాదిలోని కేవలం రెండు, మూడు పెద్ద రాష్ట్రాలు కలిస్తేనే కేంద్రంలో అధికారాన్ని నిర్ణయించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని దక్షిణాది రాష్ట్రాలు వాదిస్తున్నాయి. డీలిమిటేషన్ ప్రక్రియ రాజకీయ ప్రాతినిధ్యాన్ని మాత్రమే కాకుండా, నిధుల కేటాయింపును కూడా ప్రభావితం చేస్తుంది.భారత ఆర్థికసంఘం నిధులను పంచేటప్పుడు జనాభాను ప్రధాన ప్రాతిపదికగా తీసుకుంటుంది. దీనివల్ల జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు వచ్చే కేంద్రం వాటా తగ్గుతుంది.గణాంకాల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి చెల్లిస్తున్న ప్రతి రూపాయి పన్నులో తిరిగి పొందుతున్నది చాలాతక్కువ. కర్ణాటక చెల్లించిన ప్రతి రూ.100కి తిరిగి వచ్చేది సుమారు రూ.15 మాత్రమే. తమిళనాడుకు తిరిగి వచ్చేది సుమారు రూ.29. తెలంగాణకు రూ.43,ఆంధ్రప్రదేశ్‌కు రూ.47,కేరళకు రూ.



63 మాత్రమే. ఉత్తరప్రదేశ్ చెల్లించిన ప్రతి రూ.100 కి సుమారు రూ.273 తిరిగి పొందుతోంది. బీహార్ సుమారు రూ.706 తిరిగి పొందుతోంది.జనాభా ప్రాతిపదికన సీట్లు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయ బలం పెరిగి, భవిష్యత్తులో ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు కూడా వారి వైపునకే ఉంటుందని దక్షిణాది రాష్ట్రాల భయం. అభివృద్ధి చెందిన రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి,జనాభా పెంచిన రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇవ్వడం సమర్థతను సాధించిన రాష్ట్రాలను శిక్షించడమే అని దక్షిణాది రాష్ట్రాలు వాదిస్తున్నాయి. భారతదేశం విభిన్న భాషలు, సంస్కృతులు కలిగిన రాష్ట్రాల సమాఖ్య. కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్విభజిస్తే, జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకే పార్లమెంటులో మెజారిటీ లభిస్తుంది. దీనివల్ల 'బహుళత్వ ప్రజాస్వామ్యం కాస్తా సంఖ్యాబల ప్రజాస్వామ్యం'గా మారిపోయే ప్రమాదం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు జాతీయ లక్ష్యాలను (జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యం) సమర్థవంతంగా అమలు చేసినప్పటికీ, రాజకీయంగా వాటి ప్రాధాన్యత తగ్గడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఒకే ప్రాంతం లేదా కొన్ని రాష్ట్రాలే కేంద్ర నిర్ణయాలను శాసించే పరిస్థితి ఏర్పడితే, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాల గొంతు పార్లమెంటులో వినిపించదు. ఇది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచి, దేశ సమగ్రతకు సవాలుగా మారుతుంది. అందుకే జనాభాతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఉండాలని దక్షిణాది రాష్ట్రాలు కోరుతున్నాయి. సీట్ల సంఖ్యను పెంచడం కేవలం జనాభా ప్రాతిపదికన కాకుండా, అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను ఒకే శాతంలో (ఉదాహరణకు 50లేదా 100 ) పెంచడం. దీనివల్ల లోక్‌సభలో సభ్యుల సంఖ్య పెరుగుతుంది, కానీ రాష్ట్రాల మధ్య ఉన్న ప్రస్తుత రాజకీయ బలాబలాలు మారవు. అమెరికాలోని 'సెనెట్' మాదిరిగా, జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి సమాన సంఖ్యలో రాజ్యసభ సీట్లు కేటాయించడం. చిన్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటానికి రాజ్యసభకు మరిన్ని చట్టపరమైన అధికారాలు ఇవ్వడం ద్వారా సమాఖ్య వ్యవస్థను బలోపేతంచేయవచ్చు. నియోజకవర్గాల కేటాయింపులో కేవలం 2011/2027 జనాభాను మాత్రమే కాకుండా, రాష్ట్రాలు సాధించిన సామాజిక అభివృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని దక్షిణాది రాష్ట్రాలు కోరుతున్నాయి. జనాభాను తగ్గించిన రాష్ట్రాలకు బోనస్ సీట్లు ఇవ్వడం,దేశ జీడీపీలో వాటా,పన్నుల చెల్లింపును ప్రాతిపదికగా తీసుకోవడం అక్షరాస్యత,ఆరోగ్యం లాంటి మానవాభివృద్ధి సూచీలో మెరుగ్గా ఉన్న రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం గణాంకాల మార్పు మాత్రమేకాదు, అది భారత సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల మధ్య ఉన్న సమతుల్యతకు సంబంధించిన అంశం. జాతీయ లక్ష్యాలైన జనాభా నియంత్రణ, విద్య, ఆరోగ్యంతో పాటు సామాజికాభివృద్ధిలో అద్భుతమైన ప్రతిభ కనబరిచినందుకు దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయప్రాముఖ్యత తగ్గడం ఖచ్చితంగా సమర్థవంతంగా పనిచేసిన రాష్ట్రాలను శిక్షించినట్లుగానే భావించాలి.అభివృద్ధిచెందిన రాష్ట్రాలగొంతు పార్లమెంటులో బలహీనపడితే,అది భవిష్యత్తులో ప్రాంతీయ అసమానతలకు,అసంతృప్తికి దారితీస్తుంది. కాబట్టి కేంద్రం కేవలం జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసు కోకుండా, అన్నిరాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేలా ఒక నూతన శాస్త్రీయ ఫార్ములాను రూపొందించాలి. అప్పుడే "సబ్ కా సాత్ సబ్ కా వికాస్" అనే నినాదం సాకారమవుతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# చాణక్యుడే బతికుంటే అమిత్‌జీని చూసి కంగుతినేవాడు..

## ప్రియాంక వ్యాఖ్యలకు లోక్‌సభలో నవ్వుల జల్లు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** ప్రియాంకా గాంధీ నవ్వించారు. లోక్‌సభలో చాలా స్మూత్‌గా ఆమె మాట్లాడారు. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై ఆమె లోక్‌సభలో గురువారం ప్రసంగించారు. ఆ సమయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై ఆమె జోకులు వేసారు. బిల్లులు రూపొందించిన విధానం గురించి ప్రస్తావిస్తూ అమిత్ షాపై ప్రియాంకా గాంధీ కామెంట్ చేశారు. హోంమంత్రి నవ్వుతున్నారని, ఆయనే మొత్తం ప్లాన్ చేశారని, ఒకవేళ చాణక్యుడే బ్రతికి ఉంటే, మీ రాజనీతికి ఆయన కూడా ఖంగుతినేవాడని ఆమె అన్నారు. చాలా సింపుల్‌గా ప్రియాంకా వ్యాఖ్యలు చేయడంతో అమిత్ షా నిజంగానే నవ్వేశారు.ఆ వ్యాఖ్యలపై ఆయన ఎటువంటి అభ్యంతరాన్ని వ్యక్తం చేయలేదు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకువచ్చిన వైనాన్ని ప్రస్తావిస్తూ ప్రియాంకా ఆ వ్యాఖ్యలు చేశారు. అంతా ప్లాన్ చేసి ఇప్పుడు నవ్వుతున్నారని, అంటే ఆయన తనతో ఏకీభవిస్తున్నారని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. చాణక్యుడు అనడంతో అమిత్ షా నవ్వుతూ కనిపించారు. ప్రస్తుతం ఉన్న 543 సీట్లపై ఎందుకు మహిళా రిజర్వేషన్ ఇవ్వడం లేదని ఆమె అడిగారు.

# దేశంకోసం మోడీ కృషి భేష్

## - అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కితాబు - అణునిల్వల అప్పగింతకు ఇరాన్ అంగీకారం - ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కూ ట్రంప్ ప్రశంసలు



**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందనడానికి అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోడీ తనకు అత్యంత ఆప్తమిత్రుడని, ఆయన దేశం కోసం అద్భుతంగా పనిచేస్తున్నారని ట్రంప్ కొనియాడారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, "నేను ఆయనతో చాలా బాగా మాట్లాడాను. ఆయన భారత్ నుంచి నా స్నేహితుడు, చాలా గొప్పగా పనిచేస్తున్నారు" అని పేర్కొన్నారు. 40 నిమిషాల సుదీర్ఘ ఫోన్ సంభాషణలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి పునరుద్ధరణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయని చెప్పుకొచ్చారు. అణు కార్యక్రమానికి కీలకమైన శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరడానికి చాలా మంచి అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. కొనసాగుతున్న చర్చల్లో ఇదొక కీలక ముందడుగు అని ట్రంప్ అభివర్ణించారు. "వారు శుద్ధి చేసిన యురేనియంను మాకు తిరిగి ఇవ్వడానికి అంగీకరించారు" అని ఆయన తెలిపారు. ఈ వారాంతంలోనే తదుపరి చర్చలు జరగవచ్చని, ప్రస్తుత కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం కూడా రాకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "నాలుగు వారాల బాంబు దాడులు, శక్తిమంతమైన దిగ్బంధనం వల్లే ఇరాన్ ఇప్పుడు మెత్తబడింది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ చర్చల్లో మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌లను ట్రంప్ ప్రశంసించారు. ఒప్పందం ఇస్లామాబాద్‌లో జరిగితే తాను కూడా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ విషయంలో పోప్ లియో శ్రీజు వైఖరిపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ చేతిలో అణ్వాయుధం ఉండకూడదని పోప్ అర్థం చేసుకోవాలి. ఆయన ఏమైనా చెప్పవచ్చు, కానీ నేను దానితో ఏకీభవించను" అని ట్రంప్ అన్నారు. వచ్చే వారంతో కాల్పుల విరమణ గడువు ముగియనుండగా, ఒకవేళ ఒప్పందం కుదరకపోతే మళ్లీ దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు.

**ఢిల్లీ ఎల్‌జిపై ట్రంప్ ప్రశంసలు:** ఇదే క్రమంలో ఢిల్లీ నూతన లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జీత్ సింగ్ సంధుపై కూడా ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికాలో భారత రాయబారిగా సంధు అందించిన సేవలు ఇరుదేశాల బంధాన్ని బలోపేతం చేశాయని, ఆయన నేతృత్వంలో ఢిల్లీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేశారు.

# ఇరాన్‌పై సైనిక చర్యలకు మేం సిద్ధమే

## సత్వరమే నిర్ణయానికి రావాలి లేకుంటే దిగ్బంధమే..

### అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్

**వాషింగ్టన్, ఏప్రిల్ 17:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌పై కఠినమైన నావికాదళ దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నామని, తెలివిగా నిర్ణయం తీసుకోవాలని అమెరికా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అవసరమైతే సైనిక చర్యను మరింత తీవ్రతరం చేయడానికి తమ బలగాలు లాక్ అండ్ లోడ్‌తో సిద్ధంగా ఉన్నాయని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టం చేశారు. పెంటగాన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కెయిన్, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) కమాండర్ అడ్మిరల్ బ్రాడ్లీ కూపర్ కూడా పాల్గొన్నారు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీగా పిలుస్తున్న సైనిక చర్య తర్వాత ఇరు దేశాల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే అమెరికా ఈ హెచ్చరికలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ ఓడరేవులు, తీరప్రాంతంపై దిగ్బంధనం ఇప్పటికే అమల్లో ఉందని, దీన్ని నిరవధికంగా కొనసాగించగలమని హెగ్సెత్ తెలిపారు. మీ ఇంధనం కదలడం లేదు, ఇకపై కదలదు కూడా. ఇది మర్యాదపూర్వకంగా జరిగే విధానమని ఆయన అన్నారు. ఏ దేశానికి చెందిన నౌక అయినా ఇరాన్ ఓడరేవుల నుంచి రాకపోకలు సాగించకుండా ఈ దిగ్బంధనం వర్తిస్తుందని, ఇప్పటికే 13 నౌకలను వెనక్కి పంపినట్లు అధికారులు వెల్లడించారు. దౌత్యపరమైన పరిష్కారాన్నే తాము కోరుకుంటున్నామని, చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెగ్సెత్ హెచ్చరించారు. మేం మంచి మార్గాన్నే ఇష్టపడతాం కానీ మీరు చెడు మార్గాన్ని ఎంచుకుంటే, మీ ఇంధన పరిశ్రమతో పాటు కీలకమైన మౌలిక సదుపాయాలే మా లక్ష్యం. మా అధ్యక్షుడి ఆదేశాలతో, ఒక్క బటన్ నొక్కితే చాలు మేము దాడికి సిద్ధమని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తమ సైన్యం పూర్తి సంసిద్ధతతో ఉందని, క్షణాల్లో భారీ సైనిక చర్యలను పునఃప్రారంభించగలమని జనరల్ కెయిన్ అన్నారు. ఈ విరామ సమయాన్ని ఆయుధాలు సమకూర్చుకోవడానికి, వ్యూహాలను సర్దుబాటు చేసుకోవడానికి వినియోగించుకుంటున్నామని అడ్మిరల్ కూపర్ తెలిపారు. బహ్రెయిన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి ప్రాంతీయ భాగస్వాములు తమకు అసాధారణ సహచరులుగా అండగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవలి ఆపరేషన్లలో ఇరాన్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వారి కమ్యూనికేషన్ వ్యవస్థ మునుపెన్నడూ లేనంత బలహీనంగా మారిందని హెగ్సెత్ పేర్కొన్నారు. మరోవైపు, గల్ఫ్ దేశాల నుంచి ఇంధన సరఫరాలపై ఆధారపడిన భారత్, ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. సంక్లిష్టమైన జలాల్లో దిగ్బంధనాన్ని అమలు చేయడం సూపర్‌మార్కెట్ పార్కింగ్ లాట్‌లో స్పోర్ట్స్ కార్ నడపడం.



## రాజ్యసభ డిప్యూటీగా హరివంశ్ హ్యాట్రిక్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** హరివంశ్ హ్యాట్రిక్ కొట్టారు. మూడోసారి ఆయన రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. సభాపక్ష నేత జేపీ నడ్డా తీర్మానం పాస్ చేయగా హరివంశ్ ఎన్నిక ప్రక్రియ లాంఛనంగా పూర్తి అయ్యింది. మోజువాణీ ఓటు ద్వారా డిప్యూటీ ఛైర్మన్ నియామకం జరిగింది. హరివంశ్‌ను ఎన్నుకునేందుకు అయిదు తీర్మానాలను పాస్ చేశారు. ఈనెల9వ తేదీన రాజ్యసభ సభ్యుడిగా హరివంశ్ రెండో టర్మ్ ముగిసింది.దీంతో డిప్యూటీ ఛైర్మెన్ పోస్టు ఖాళీ ఏర్పడింది. రాజ్యసభ్య వ్యవహారాల ప్రకారం రూల్ 7 కింద ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ డిప్యూటీ ఛైర్మెన్ కోసం ఎన్నిక నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు హరివంశ్‌ను నామినేట్ చేశారు. మూడోసారి డిప్యూటీ ఛైర్మెన్‌గా గెలిచిన హరివంశ్‌కు ప్రధాని మోదీ, విపక్షనేత ఖర్గేలు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ చరిత్రలో ఓ నామినేటెడ్ సభ్యుడు డిప్యూటీ ఛైర్మెన్‌గా ఎన్నిక కావడం ఇదే తొలిసారి. గతంలో హరివంశ్ జర్నలిస్టుగా చేశారు.

# డీలిమిటేషన్‌పై రాష్ట్రాల సిఎంలను సంప్రదించని కేంద్రం

## లోక్‌సభలో డిఎంకె ఎంపి కనిమొళి ధ్వజం



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును డీఎంకే వ్యతిరేకించింది. ఇవాళ ఆ పార్టీ ఎంపీ కనిమొళి మాట్లాడారు. ఒకవేళ డీలిమిటేషన్ బిల్లు సరైన దశలోనే ఉండి ఉంటే, అప్పుడు ఆ బిల్లును ఎందుకు తమిళనాడు అసెంబ్లీలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ఆమె ప్రశ్నించారు. డీలిమిటేషన్ అంశంపై ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రితోనూ కేంద్రం సంప్రదించలేదని ఆమె ఆరోపించారు. 2021లో జనాభా లెక్కలను ప్రభుత్వం వాయిదా వేసిందని, ఇప్పుడు వాటి స్థానంలో పాత జనాభా లెక్కలను తీసుకుంటున్నారని, అయిదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. 2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రిజర్వేషన్ బిల్లును పాస్ చేయాలని విపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయని, ఓ రెండు వారాల పాటు ఆగే ఆలోచనలో బీజేపీ లేదని, ఎన్నికల రెస్క్యూ వ్యూహం తరహాలో మహిళలను బీజేపీ వాడుకుంటున్నదని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. లోక్‌సభలో ఎందుకు 2023 నాటి మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నోటిఫై చేశారని ఎంపీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్‌ను తప్పుదోవ పట్టించే రీతిలో బిల్లు ఉన్నదని, ఇది భారత ఫెడరల్ విధానాన్ని దెబ్బతీస్తున్నట్లుగా ఉందని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రామిస్‌లు చేసిందని కానీ అవన్నీ ఢిల్లీ గాలిలో కలిసిపోయినట్లు ఆమె చెప్పారు. బిల్లులను ప్రవేశపెట్టి, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే పాస్ చేయాలని కోరడం గుణాత్మక రాజకీయమేనన్నారు. మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం ఓ ట్రాప్ అని, మహిళలను బీజేపీ ఓ కవచంలా వాడుకుంటోందని కనిమొళి అన్నారు. ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లో ఎందుకు రిజర్వేషన్ ఇవ్వలేకపోతున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఆమె అడిగారు. ఈ దేశ మహిళలు రాజకీయ అధికారం కోసం ఎన్నాళ్లుగా పడిగాపులు కాస్తున్నట్లు ఆమె చెప్పారు.

# డీలిమిటేషన్ రాజకీయ డిమానిటైజేషన్!: లోక్‌సభలో ఎంపి శశిథరూర్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** డీలిమిటేషన్ అనేది పొలిటికల్ డీమానిటైజేషన్ లాంటిదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూం అన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల లోక్‌సభ, రాజ్యసభ మధ్య బ్యాలెన్స్ తప్పుతుందని, ఇక డీలిమిటేషన్ బిల్లు వల్ల మహిళా రిజర్వేషన్ బిల్లు బందీ అవుతుందని అన్నారు. శుక్రవారం లోక్‌సభలో ఎంపీ శశిథరూర్ బిల్లులపై చర్చ సందర్భంగా మాట్లాడారు. డీలిమిటేషన్ ప్రక్రియతో మహిళా రిజర్వేషన్‌ను లింకు చేయవద్దు అని అన్నారు. డీలిమిటేషన్ బిల్లులో మూడు లోపాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. డీలిమిటేషన్‌పై చాలా విస్తృత స్థాయిలో చర్చలు జరగాలన్నారు. చిన్న, పెద్ద రాష్ట్రాల మధ్య అంతరాన్ని చూడాలన్నారు. ఇక జనాభాను నియంత్రించిన రాష్ట్రాల గురించి ఆలోచించాలన్నారు. డీలిమిటేషన్ బిల్లును ఆగమాగం పాస్ చేయాల్సిన అవసరం లేదన్నారు. డీమానిటైజేషన్(నోట్ల రద్దు) సమయంలో ప్రభుత్వం గాబరాపడిందని, ఇప్పుడు డీలిమిటేషన్ పేరుతో ఆగమేఘాల మీద రాజకీయ డిమానిటైజేషన్‌కు పాల్పడుతోందని ఆరోపించారు.

హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన 50 శాతం ఫార్ములా అంశాన్ని ఎంపీ శశిథరూర్ విమర్శించారు. మంత్రి ప్రకటన ప్రమాదకర రాజకీయ ప్రకటనగా ఉందని, అదేమీ శాసనపరమైన గ్యారెంటీలా లేదన్నారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 850 సీట్లకు పెంచడం జరిగేపనిలా లేదని, దానికి తగినట్లు రాజ్యసభ సామర్థ్యాన్ని కూడా పెంచాలన్నారు. తమ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇస్తుందని, కానీ డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

# రసగుల్లాలు తిన్నాడని బాలుణ్ణి తందూర్‌లోకి విసిరేసిన చెఫ్!

**లక్నో, ఏప్రిల్ 17:** పెళ్లి వేడుకకు వెళ్లిన బాలుడు విందు సందర్భంగా పలుమార్లు రసగుల్లాలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో క్యాటరింగ్ సిబ్బంది ఆగ్రహించి ఆ బాలుడ్ని ఎత్తి తందూర్ మంటలోకి విసిరేశాడు. తీవ్రంగా కాలిన గాయాలైన ఆ బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 11 ఏళ్ల చమన్ తల్లి మరణించడంతో అమ్మమ్మ ఇంట్లో నివసిస్తున్నాడు. ఆ బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. ఈనెల 15న చమన్ తన అమ్మమ్మతో కలిసి గ్రామంలో జరిగిన బంధువుల పెళ్లి వేడుకకు వెళ్లాడు. విందు సందర్భంగా ఆ బాలుడు పలుమార్లు రసగుల్లాలు తీసుకున్నాడు. గమనించిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ అతడిపై ఆగ్రహించాడు. తొలుత చమన్‌ను పట్టుకుని బెదిరించాడు. ఆ తర్వాత అతడ్ని పైకి ఎత్తి తందూర్ పొయ్యి వద్దకు తీసుకెళ్లాడు. అదుపు తప్పిన ఆ బాలుడు తందూర్ మంటలో పడిపోయాడు. ఇది చూసి క్యాటరింగ్ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. మరోవైపు అక్కడున్న పెళ్లి అతిథులు షాక్ అయ్యారు. తందూర్ పొయ్యిలో పడిపోయిన ఆ బాలుడ్ని బయటకు తీశారు. ముఖం నుంచి నడుము వరకు తీవ్ర కాలిన గాయాలైన చమన్‌ను వెంటనే అయోధ్య మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స తర్వాత ఆ బాలుడ్ని లక్నో మెడికల్ కాలేజీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న చమన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడు చమన్ మేనమామ ఫిర్యాదు ఆధారంగా క్యాటరింగ్ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పారిపోయిన నిందితుడి అరెస్ట్ కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# అత్యంత ప్రజాదరణ నేతగా ప్రధానిమోడీ

## నంబర్‌టూ స్థానంలో దక్షిణకొరియా లీజే మ్యూంగ్



**న్యూయార్కు, ఏప్రిల్ 17:** అంతర్జాతీయ వేదికపై భారత ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి అరుదైన రికార్డు సాధించారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన తాజా ప్రజాభిప్రాయ సర్వేలో మోదీ అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా ప్రథమ స్థానంలో నిలిచారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఒపీనియన్ రీసెర్చ్ సంస్థ మార్నింగ్ కన్సల్ట్ 24 ప్రజాస్వామ్య దేశాల్లో, వారం రోజుల పాటు నిర్వహించిన సర్వేలో మోడీ నెంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఈ సర్వే ప్రకారం ప్రధాని నరేంద్ర మోడీ 70 శాతం అప్రూవల్ రేటింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి తన తిరుగులేని పాపులారిటీని చాటుకున్నారు. ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల ఫాలోవర్లు, ప్రపంచంలోనే తొలి రాజకీయ నేతగా రికార్డు సాధించారు.అలాగే యూట్యూబ్‌లో కూడా మూడుకోట్ల మందికిపైగా ఫాలోవర్లను సాధించారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ లేని నాయకుడిగా ఈ జాబితాలో నిలిచారు. దాదాపు 76 శాతం మంది ప్రతివాదులు మెర్జ్ పని తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గత ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ కంటే కూడా మెర్జ్ రేటింగ్స్ దారుణంగా పడిపోయాయి. ఇప్పుడు ఎన్నికలు జరిగితే మెర్జ్ పరిస్థితి అంతే గతేడాది పదవి చేపట్టి నప్పటి నుంచి జర్మనీని గాడిలో పెట్టేందుకు మెర్జ్ సంస్కరణల శరద్రుతువు పేరుతో అనేక వాగ్దానాలు చేశారు. అవి కార్యరూపం దాల్చకపోవడంతో జర్మన్ ఓటర్లలో ఆయనపై నమ్మకం సడలింది. ఇటీవల ఫోర్సా, డ్యూచ్‌ల్యాండ్‌ట్రెండ్ నిర్వహించిన సర్వేల్లో కూడా మెర్జ్ పని తీరుపై 84 శాతం మంది ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే అధికార కూటమి మెజారిటీ సాధించడం కష్టమని ఈ సర్వేలు హెచ్చరిస్తున్నాయి. ఈ జాబితాలో మోడీ తర్వాత దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ 63 శాతంతో రెండో స్థానంలో నిలవగా చెక్ రిపబ్లిక్ ప్రధాని ఆంద్రెజ్ బాబిస్ 55 శాతంతో మూడో స్థానంలో నిలిచారు. మరోవైపు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ 75 శాతం వ్యతిరేకతతో అత్యంత ప్రజాదరణ లేని రెండో నాయకుడిగా నిలిచారు. ఇరాన్‌తో యుద్ధం వంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అట్టడుగు నుంచి 10వ స్థానంలో నిలిచి మెర్జ్ కంటే మెరుగైన స్థితిలో ఉండటం గమనార్హం. సుమారు 38 శాతం మంది అమెరికన్లు ట్రంప్ పని తీరును తాము ఆమోదిస్తున్నట్లు తెలిపారు.

# రాహుల్ ద్వంద్వ పౌరసత్వంపై విచారణ జరపాలి

## యుపి అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఉత్తర్వులు



**లక్నో,ఏప్రిల్ 17:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ద్వంద్వ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి, విచారణ జరపాలని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని సూచించింది. లేదంటే ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్న తన అభ్యర్థనను లక్నోలోని ప్రత్యేక ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు ఈ సంవత్సరం జనవరి 28న తిరస్కరించడంతో, బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ అప్పీలు చేశారు. దీంతో అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ ఈ ఉత్తర్వులు ఇచ్చింది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి, కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేష్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్‌గా, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్యస్వామి చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలోనూ తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని, లేదంటే చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ అంశంపై సుబ్రహ్మణ్యస్వామి గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.

# అప్రూవర్‌గా మారిపోతా.. ఢిల్లీ కోర్టుకు జాక్వెలిన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** మనీలాండరింగ్ కేసులో అరెస్టై జైలులో ఉన్న సుకేష్ చంద్రశేఖర్ కేసు కీలక మలుపు తిరిగింది. మరో నిందితురాలిగా ఉన్న నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ అప్రూవర్‌గా మారిపోతానని ఆమె ఢిల్లీ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. దీనిపై స్పందించిన కోర్టు తను అప్రూవర్‌గా మారాలనుకుంటున్న విషయాన్ని ఈ కేసును విచారిస్తున్న ఈడీకి చెప్పాలని సూచించింది. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రకారం అప్రూవర్‌గా మారాలనుకుంటున్న విషయాన్ని జాక్వెలిన్ ముందుగా విచారణ సంస్థకు తెలియజేయాలి. ఆ తర్వాత వారు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేస్తారు. ఈ వాంగ్మూలం ఆధారంగా ఆమెను అప్రూవర్‌గా మార్చి, ఈ అంశాన్ని కోర్టు ముందుకు తీసుకురావాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. మనీలాండరింగ్ కేసులో జాక్వెలిన్ ప్రస్తుతం బెయిల్‌పై ఉంది. ఈ అంశంలో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తనపై నమోదైన క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని కోరుతూ గతంలో జాక్వెలిన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే కోర్టు నిరాకరించింది. దీంతో జాక్వెలిన్ అప్రూవర్‌గా మారేందుకు ప్రయత్నిస్తోంది.



ప్రధాన నిందితుడైన సుకేష్ చంద్రశేఖరన్‌పై అనేక కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసుల్లో అతడికి బెయిల్ లభించింది. అతడు ప్రస్తుతం ఢిల్లీ జైలులో ఉన్నాడు. సుకేష్, జాక్వెలిన్ కొంతకాలం క్రితం రిలేషన్‌లో ఉన్నారు. ఇదే సమయంలో సుకేష్ పలు ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడు. ఆ డబ్బులో చాలా వరకు జాక్వెలిన్‌కు అతడు ఖరీదైన గిఫ్ట్‌ల రూపంలో ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. కార్లు, నగలు, బ్రాండెడ్ దుస్తులు వంటివి కలిపి రూ.7 కోట్ల విలువైన గిఫ్టులను సుకేష్ జాక్వెలిన్‌కు ఇచ్చాడు. అప్పటికే అతడిపై అనేక ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడనే ఆరోపణలున్నప్పటికీ, జాక్వెలిన్ వాటిని స్వీకరించింది.

# భారత్, పాక్ పోటాపోటీగా ఆయుధ పరీక్షలు: నోటమ్‌లు జారీ

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 17:** క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్–పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరు దేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 20, తెల్లవారుజామున 3.00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3.00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9.30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది.

సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీటెస్ టు ఎయిర్‌మెన్' (నోటమ్). 'మారిటైమ్ అడ్వైజరీస్' వంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూను ఉంటుంది. అయితే ఇరు దేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది.



# మామధ్య ఉన్నది స్నేహం మాత్రమే!

## తేల్చి చెప్పేన ఎంపి కంగనా రనౌత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:** కంగనా రనౌత్, చిరాగ్ పాశ్వాన్ ఆ ఇద్దరూ ఇప్పుడు ఫుల్ బిజీ అయ్యారు. పబ్లిక్ ఈవెంట్స్‌లో తరచూ కనిపిస్తున్నారు. దీంతో కొందరు డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఆ ఎంపీలు ఇద్దరూ రొమాంటిక్ రిలేషన్‌లో ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫిల్మ్ స్టార్ , ఎంపీ కంగనా రనౌత్ క్లారిటీ ఇచ్చారు. ఆ రూమర్స్‌కు ఆమె చెక్ పెట్టారు. చిరాగ్ పాశ్వాన్ కేవలం ఫ్రెండ్ మాత్రమే అని ఆమె చెప్పారు. తమ మధ్య రొమాన్స్ లేదని కంగనా పేర్కొన్నది. చిరాగ్ కేవలం స్నేహితుడు మాత్రమే అని, అతన్ని చూసినప్పుడు ఫ్రెండ్‌గా భావిస్తానని, మా మధ్య రొమాన్స్ లేదని, తమ మధ్య చాన్నాళ్ల పరియం ఉందని, పదేళ్ల క్రితం ఇద్దరం కలిసి సినిమా తీశామని, ఒకవేళ తమ మధ్య ప్రేమాయణం సాగి ఉంటే, మాకు పిల్లలు పుట్టేవారని కంగనా రనౌత్ పేర్కొన్నది.

# సోంగ్‌క్రాన్ పండుగ వేళ థాయిలాండ్‌లో విషాదం

## 191 మంది మృతి, 951పైగా ప్రమాదాలు



**బ్యాంకాక్, ఏప్రిల్ 17:** ప్రపంచంలోనే అతిపెద్ద వాటర్ ఫైట్‌గా ప్రసిద్ధి చెందిన థాయ్‌లాండ్ నూతన సంవత్సర వేడుక సోంగ్‌క్రాన్ ఈసారి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పంట కోతల అనంతరం ఏప్రిల్ మధ్యలో జరుపుకునే ఈ పండుగ సంతోషం బదులు ఆందోళన నింపింది. వారం రోజులుగా జరుగుతున్న వేడుకల్లో ఇప్పటివరకు 191 మంది మరణించగా, 951కి పైగా రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రతి ఏటా సోంగ్‌క్రాన్ వేడుకలు బ్యాంకాక్ వంటి ప్రధాన నగరాల్లోని లక్షలాది మంది ప్రజలు తమ సొంత గ్రామాలకు కుటుంబసభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవడానికి వెళతారు. ఈ క్రమంలో భారీగా పెరిగే ట్రాఫిక్ కారణంగా ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఈ ఏడు రోజుల కాలాన్ని ఏడు ప్రమాదకరమైన రోజులుగా స్థానికులు పిలుస్తారు. ఈ ప్రమాదాల్లో 42 శాతం అతివేగం వల్ల జరగగా, 27.4 శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల సంభవించాయి. హెల్మెట్లు ధరించక పోవడం వంటి నిర్లక్ష్య పూరిత ప్రవర్తనలు మరణాలకు కారణమవుతున్నాయి. డిజాస్టర్ ప్రివెన్షన్ అండ్ మిటిగేషన్ విభాగం డేటా ప్రకారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్టు తేలింది. ప్రభుత్వం ఏటా భద్రతా ప్రచార కార్యక్రమాలు, కఠినమైన చట్టాలు అమలు చేస్తున్నప్పటికీ, ఈ మారణహోమం ఆగడం లేదు. అయితే, ఈ వేడుకల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఆదాయం సమకూరుతుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది అంతర్జాతీయ పర్యాటకులు వస్తారని, దీని ద్వారా ప్రభుత్వానికి దాదాపు 940 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుంది.

# ఇండొనేసియాలో కుప్పకూలిన హెలికాప్టర్.. 8 మంది దుర్మరణం

**జకార్తా, ఏప్రిల్ 17:** హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది దుర్మరణం చెందారు. ఈ ఘటన ఇండొనేసియాలోని పశ్చిమ కాళీమంతన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. దాని శకలాల గుర్తింపు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 'ఎయిర్ బస్ హెచ్–130 గురువారం మెల్వాయ్‌లో టేకాఫ్ అయిన కొంత సమయానికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌రూంతో సంబంధాలు తెగిపోయాయి. ఓ కొండపై దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ సిగ్నల్ మిస్ అయింది. టేకాఫ్ అయిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెస్క్యూ బృందం హెలికాప్టర్ తోక భాగాన్ని గుర్తించింది.

ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది' అని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. సైనిక, సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతం ఇండొనేసియాలోని పామాయిల్ కంపెనీదని, హెలికాప్టర్ మాథ్యూ ఎయిర్ నుసంతారాకు చెందిందని అధికారులు తెలిపారు.

# సోనియాగాంధీని రేవంత్‌రెడ్డి బలిదేవత అనలేదా?

### కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారులను దేశభక్తులతో పోలుస్తూ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య దేశ విభజన అంశాన్ని ప్రస్తావిస్తే కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు వివాదం చేయడమేంటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఆనాడు సోనియాగాంధీని బలిదేవత అంటూ తూలనాడిన విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు. సోనియాగాంధీ చేసిన నీచమైన పనులవల్లే ఆనాడు వెయ్యిమందికిపైగా తెలంగాణ యువకులు చనిపోయారని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉంటే... ఆ కేబినెట్ లో మీరెలా మంత్రులుగా ఉన్నారు?అని నిలదీశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై దేశమంతా ఎదురు చూస్తోందని, బిజెపికి ఎక్కడ క్రెడిట్ వస్తుందనే భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు తెరదీశారని విమర్శించారు. బిజెపి ఎంపి తేజస్వీ సూర్య గురువారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలవల్లే వందలాది మంది తెలంగాణ యువకులు బలిదానం చేశారని చెబుతూ దేశ విభజన అంశాన్ని ప్రస్తావించారే తప్ప ఆయన తెలంగాణను అవమానించలేదన్నారు. రాష్ట్రంలో కొందరు మంత్రులు నిన్న ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వాళ్లను నేనడుగుతున్నా, అసలు మీరు ఎవరి కేబినెట్‌లో ఉన్నారు? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ లోనే కదా? ఆ రేవంత్ రెడ్డే సోనియాగాంధీని బలిదేవత అనలేదా? ఎంపి తేజస్వీని పట్టుకుని మీరంతా వెధవ, మూర్ఖుడు, లంగా, దొంగ, ద్రోహి అంటూ మాట్లాడారు కదా? ఎంపి పదవికి రాజీనామా చేయాలని అన్నారు కదా? మరి ఇప్పుడు మీ ముఖ్యమంత్రిని ఏమంటారు? కాంగ్రెస్ నాయకులు ఏమని సమాధానం చెబుతారు? సోనియాను నీచురాలని తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టిన రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో మీరు మంత్రులుగా ఎలా ఉన్నారు? అసలు మీ నిజాయితీ ఏమిటి? తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన నాయకుడి కేబినెట్‌లో మీరు పనిచేస్తున్నారు. ఆనాడు తెలంగాణ రణభేరి నిర్వహిస్తుంటే అందుకు వ్యతిరేకంగా తుపాకీ పట్టుకుని నిలబడ్డ నాయకుడు రేవంత్‌రెడ్డి అన్నారు.

# పూలు, పళ్ల మార్కెట్లు, రైతు బజార్లలో ప్లాస్టిక్ పూల విక్రయాలపై నిషేధం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టిక్ పూల విక్రయాలను నిషేధించింది. ప్రభుత్వ మార్కెట్లు, పూలు, పండ్ల మార్కెట్లు, రైతు బజార్లలో ప్లాస్టిక్ పూల విక్రయాలను నిషేధిస్తూ మార్కెటింగ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే జరిమానాల విధింపుతోపాటు లైసెన్స్ రద్దు చేయాలని సూచించింది. సహజ పూలను, వాటి ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని అన్ని జిల్లాల అధికారులకు నిర్దేశించింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల రైతు మేళాకు హాజరైన సమయంలో ప్లాస్టిక్ పూల విక్రయాల వల్ల సహజ పూల విక్రయాలు జరగడం లేదని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి తుమ్మల స్పందిస్తూ మార్కెట్లలో ప్లాస్టిక్ పూల అమ్మకాలకు అనుమతిలేదని, వాటి విక్రయాలు అనుమతించొద్దని ఆదేశించారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు మరికొన్ని రాష్ట్రాలు కూడా గతంలోనే ప్లాస్టిక్ పూల అమ్మకాలపై నిషేధం విధించాయి. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటిల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించింది. ప్లాస్టిక్ కవర్ల వాడకం బదులు పేపర్, క్లాత్, జనపనారతో తయారు చేసే సంచులను ప్రజలు ఉపయోగించేలా ప్రోత్సాహించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు చర్యలు చేపట్టింది.



# దక్షిణాది రాష్ట్రాలపై కుట్ర అనడం దివాళాకోరుతనానికి సంకేతం

### బిజెపి జాతీయ మండలి సభ్యుడు మర్రి శశిధర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఇది ఒక కుట్ర అనడం, రాజకీయ ప్రేరేపిత చర్యగా ముద్రవేసి బిజెపిని నిందించడం పూర్తిగా అసంబద్ధం దివాలా కోరుతనంకు సంకేతం అని బిజెపి జాతీయ మండలి సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయలంలో మీడియాతో మాట్లాడారు. ఒక దక్షిణాది భారతీయుడిగా, లోక్‌సభ సీట్ల కేటాయింపు సంఖ్యను యథాతథంగా ఉంచి, మహిళలకు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న 33శాతం రిజర్వేషన్‌ను కల్పించడానికి అన్ని రాష్ట్రాల్లో 50శాతం సీట్లను మాత్రమే అదనంగా చేర్చాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను దక్షిణాది ప్రజలు స్వాగతించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రదర్శించిన రాజనీతిజ్ఞతకు, పరిణతికి మనమంతా ధన్యవాదాలు తెలపాలన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి ముందు రోజు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై నిరసనగా దాని ప్రతిని దహనం చేశారు. తమిళనాడు, దక్షిణ రాష్ట్రాల గొంతును నొక్కేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్న నిరాధారమైన భయాలను రెచ్చగొట్టడానికి చేస్తున్న ఒక నిస్సహాయ ప్రయత్నం తప్ప ఇది మరొకటి కాదు. వచ్చే వారం జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బిల్లును దహనం చేయడం, నిన్న శుక్రవారం తమిళనాడులో నల్లజెండాలతో ప్రదర్శనలు జరిగడం దారుణం అన్నారు. తమిళనాడు, తెలంగాణ అన్ని దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో శాతాల ఆధారంగా యథాతథ ప్రాతినిధ్యాన్ని కొనసాగిస్తాయి. ఇది ఈ వివాదాన్ని నివృత్తి చేస్తుందని, బాబాసాహెబ్ అంబేడ్కర్ నాయకత్వంలో రూపొందించిన భారత రాజ్యాంగం, ప్రతి పదేళ్ల జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజనకు, అలాగే రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యకు కూడా వీలు కల్పిస్తుందనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులతో సహా ప్రతి ఒక్కరూ

# ఐపిహెచ్ఎస్ అనుగుణంగా ఆస్పత్రులను తీర్చిదిద్దాలి

### అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం




**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపిహెచ్ఎస్)కు అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొం దించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ డీసీహెచ్ఎస్) బలోపేతం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన సెక్రటేరియట్‌లో శుక్రవారం జరిగింది. సమావేశంలో జీఏడీ ముఖ్య కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఫౌండర్ ఛైర్మన్, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. టీవీవీపీని ఇటీవలే సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. పేషెంట్లకు వారి నివాసాలకు సమీపంలోనే, వారి సొంత జిల్లాలోనే ట్రీట్‌మెంట్ అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అందుకనుగుణంగా సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను బలోపేతం చేయాల్సి ఉందన్నారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్ఎస్) అనుగుణంగా అన్ని హాస్పిటల్స్‌లో హెచ్ఆర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్విప్‌మెంట్, డయాగ్నస్టిక్స్, డ్రగ్స్ స్టాండర్డ్‌గా ఉండాలని మంత్రి సూచించారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొం దించాలన్నారు. టీవీవీపీ పోస్టులు, వైద్య సిబ్బందిని రీడిప్లాయ్ మెంట్ చేసేటప్పుడు ఐపీహెచ్ఎస్ నిబంధనలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో తనిఖీలు చేసి.. అవసరమైన చర్యలు చేపట్టేందుకు నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. కమిటీల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎండాకాలం నేపథ్యంలో హాస్పిటళ్లలో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవలు, ఫ్యాన్లు, ఏసీలు, మంచి నీటి వసతి, ఫైర్ అలార్మింగ్ సిస్టమ్ వంటి వాటిని పరిశీలించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

# రాజకీయ అవకాశాల కల్పనతో ఆర్థిక అసమానతలకు అడ్డుకట్ట

### నిపుణుల కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌ల ఇంటికి వెళ్లిన మంత్రి పొన్నం, పార్టీ నాయకులు మీనాక్షి, మహేష్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాజకీయ అవకాశాల కల్పనతో ఆర్థిక సామాజిక అసమానతలకు అడ్డుకట్ట వేయడానికి వీలవుతోందని కాంగ్రెస్ పార్టీ ఆదిశగా నిబద్దతతో కృషిచేస్తోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, అభిప్రాయపడ్డారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక కుల ఘనన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటి సరిగా సర్వే నిర్వ హించిన సందర్భంగా ప్రభుత్వం నియమించిన ఎక్స్‌పర్ట్ కమిటీ ఛైర్మన్ మాజీ సుప్రీం కోర్ట్ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని, వైస్ ఛైర్మన్ ప్రో. కంచ అయిలయను వారీ నివాసానికి శుక్రవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపి వారిని ఘనంగా సన్మానించారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసిఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆదిశగా రాజ్యాంగపరమైన సవరణ కోసం కూడా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నదని వివరించారు. పారదర్శకంగా, శాస్త్రీయంగా, పకడ్బందీగా నివేదిక తయారు చేసారని ఈ సందర్భంగా వారు అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సామాజిక, రాజకీయ అసమానతలను తొలగించేందుకు కమిటీ చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.





సుదర్శన్‌రెడ్డి. కంచె ఐలయ్యలను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు మీనాక్షి, మహేష్‌కుమార్

# దేశభక్తి ముసుగులో విచ్ఛిన్న, విభజనలకు బిజెపి కుట్ర

### సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశభక్తి ముసుగులో దేశ విచ్ఛిన్న, విభజన రాజకీయాలకు కుట్ర చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని రిజర్వేషన్ల పరంగా బిసిలకు, రాజకీయ ప్రాధాన్యతపరంగా దక్షణాది రాష్ట్రాలకు తీవ్రఅన్యాయం చేస్తోందని విమర్శించారు. చట్టసభల స్థానాల పునర్విభజనకు సంబంధించి అన్ని పార్టీలతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయడంతోపాటు రాజ్యాంగ నిపుణులతో కమిటీ ఏర్పాటుచేసి అన్ని అంశాలను కులంకుషంగా పరిశీలించి అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాధాన్యతతో కూడిన నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. చట్టసభల స్థానాల పునర్విభజన అంశంలో బిజెపి సర్కార్ పూర్తిగా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే ఉత్తరాది, దక్షణాది రాష్ట్రాల మధ్య ఉన్న స్థానాల వత్యాసం కారణంగా వివక్ష కొనసాగుతోందని, మళ్లీ 50 శాతం స్థానాలు పెంచితే మరింత వత్యాసం పెరిగి ఈ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోను న్నాయ న్నారు. ప్రస్తుతం ఉన్న543 స్థానాలు ఒక్కసారిగా 850కి పెరిగితే పార్లమెంట్ అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించే అవకాశం ఉండదని, మందబలంతో అధికారంలో ఉన్న పార్టీలు ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం ఉంటుందన్నారు. సిపిఐ కృషి వల్లే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆచరణ సాధ్యంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ ఏర్పాటుతో పోల్చిన బిజెపి ఎంపి తేజస్వీ సూర్య పార్లమెంట్ సభ్యుడిగా అనర్హులని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# డిమాండ్ల సాధనకు ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త నిరసన

### మండల స్థాయి నుంచి సచివాలయం వరకు కొనసాగిన ఆందోళనలు

### భోజనవిరామ సమయంలో సెక్రటేరియట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన




**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, గెటిజెట్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనబాట పట్టారు. తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజేఏసీ) పిలుపులో భాగంగా మండలస్థాయి నుంచి రాష్ట్ర సచివాలయం వరకు నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అన్ని మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలోని అన్ని హెచ్‌ఓడి కార్యాలయాలు, సెక్రెటేరియేట్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. 2వ పిఆర్‌సి కమిటీ వేసి 30 నెలలు గడుస్తున్నా నివేదిక రాకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ, వెంటనే నివేదికను తెప్పించి 51 శాతం ఫిట్‌మెంట్‌తో జూన్ 2వ తేదీలోపు 2వ పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నెలవారీ ఇచ్చే అరకొర నిధులు ఉద్యోగులు, పెన్షనర్ల అవసరాలకు సరిపోవడం లేదని జేఏసీ నాయకులు మండిపడ్డారు. కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని. వెంటనే అమల్లోకి తీసుకురావాలని, ఉద్యో గులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం నగదు రహిత చికిత్సను తక్షణమే అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించాలన్నారు.

ప్రధానంగా సెప్టెంబర్ 1, 2004 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. టిజిఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గ నేతలు మధ్యాహన్న భోజన విరామ సమయంలో సెక్రటేరియట్‌లో, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, హైదరాబాద్ సిటి(హెచ్‌వోడి) సంబంధించి భీమా భవన్(పీవోడీ) ఆఫీసులో పాల్గొన్నారు. ఉద్యోగుల, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రధానమైన 4 డిమాండ్లతోపాటు 64 డిమాండ్లలోని పెండింగ్ అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టిజిఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించలేని పక్షంలో తదుపరి కార్యా చరణ కొనసాగుతుందని టిజిఈజేఏసీ ప్రకటించింది. శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమాల్లో జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావుతోపాటు కోఛైర్మన్స్ చావా రవి, వంగా రవీందర్ రెడ్డి, జి. సదానందంగౌడ్, దాస్యా నాయక్, జి.శ్రీనివాస్ రెడ్డి, కె.లక్ష్మయ్య, డా.జి. సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

### 6వ తరగతిలో ప్రవేశాలకు 208 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న 194 మోడల్ స్కూల్స్ లో 6వ తరగతిలో ప్రవేశాలతోపాటు, 7 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో సీట్లను భర్తీ చేయడం కోసం నిర్వహించే తెలంగాణ స్టేట్ మెడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్‌ను రేపు(ఆదివారం) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 208 పరీక్షా కేంద్రాలను, 7 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల కోసం నిర్వహించే పరీక్షకు 204 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరక్టర్ శ్రీనివాసాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు గడువు ముగిసేనాటికి 37,216 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం 23,958 మంది, 7వ తరగతిలో ప్రవేశాలకు 5117, 8వ తరగతిలో చేరడానికి 4709 మంది, 9వ తరగతిలో చేరడానికి 2820 మంది, 10వ తరగతిలో చేరడానికి 612 మంది దరఖాస్తు చేసుకున్నారు. 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షను నిర్వహించనుండగా.. ఇందుకోసం 208 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షను నిర్వహించనుండగా.. అందుకోసం 204 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 10 నుంచే హాల్ టికెట్లను అందుబాటులో ఉంచారు. మోడల్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# తెలంగాణ బిజెపి భిక్ష కాదు.. సోనియాగాంధీ చల్లనిచూపు

### తేజస్విసూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేసిన తెలంగాణ యువజన కాంగ్రెస్

**హైదరాబాద్, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** తెలంగాణ బిజెపి బిక్షతో ఏర్పడలేదని తల్లి సోనియాగాంధీ చల్లని చూపుతో ఇక్కడి యువత ఆత్మబలిదానం నివారించడానికి రాజకీయంగా నష్టం జరిగినా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ భవన్‌లో బిజెపి ఎంపి తేజస్వీ సూర్య చిత్రపటంతో రూపొందించిన దిష్టిబొమ్మకు చెప్పుల దండవేసి దగ్దంచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటును 1947 నాటి ఇండియా పాకిస్థాన్ దేశాల విభజనతో పోల్చటం సిగ్గుచేటు అని అన్నారు. తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత దారుణమని త ఆయన వ్యాఖ్యలను తెలంగాణ జాతి యావత్తు ముక్తకంఠంతో ఖండించాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు.

# బిసి కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలి

### కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలి: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** బీసీ సంక్షేమ శాఖలో ఎటువంటి పెండింగ్ అంశాలు లేకుండా చూసుకోవాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టేలా చూడాలన్నారు. సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ పై మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండీ మల్లయ్య బట్టు, అడిషనల్ డైరక్టర్ అలోక్ కుమార్ పాల్గొన్నారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై సమీక్షా సమావేశంలో చర్చించారు. విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై సమావేశంలో చర్చించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బీసీ గురుకులాల విద్యార్థులకు సత్కారం చేయాలని నిర్ణయించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ఉద్యోగులకు శాపం.. ఆర్‌టిసి కార్మికులకు ద్రోహం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణలో పాలన గాలికి కాంగ్రెస్ అరాచకంలో సామాన్య ప్రజలు, కార్మికులు, చివరకు ప్రభుత్వ ఉద్యోగులు కూడా రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు ఆవేదన కలిగిస్తున్నాయి. ప్రజా సమస్యలు పరిష్కరించే నిలయం సెక్రటేరియట్‌లోనే శుక్రవారం ఉద్యోగులు భోజన విరామ నిరసన చేస్తున్నారంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అసమర్థంగా ఉందో అర్థమవుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులకే దిక్కులేకపోతే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి?రాష్ట్రంలో న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్లెక్కిన తెలంగాణ సచివాలయ ఉద్యోగుల బోజన విరామ నిరసనకు, అలాగే ఈ నెల 22 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్‌టిసి కార్మికులకు భారతీయ జనతా పార్టీ తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తోంది. ఒకవైపు తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే.. ముఖ్యమంత్రి మాత్రం ఢిల్లీ పర్యటనలు, రాజకీయ వక్రీకరణలు, ప్రాంతీయ విద్వేషాలు రచ్చగొట్టడంలో మునిగిపోయారు.



# ముదిరాజ్‌ల జనాభాను చాలా తక్కువగా చూపించిన సర్కారు

### రీసర్వే చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రక టించిన కులాలవారి జనాభా లెక్కలలో ముదిరాజుల జనాభాను 26.36 లక్షలుగా చూపించడాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గం తీవ్రమైన అభ్యంతాన్ని వ్యక్తం చేసింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పేరిట సేకరించిన కులాల వారి జనాభ ప్రకారం ముదిరాజ్‌ల జనాభా 40 లక్షలుగా నమోదుకాగా, గడిచిన పదేళ్ళ కాలంలో జనాభా మరింతగా పెరగవలిసి ఉండగా సుమారు 13 లక్షల మేరకు ఎలా తగ్గుతుందని మహాసభ ప్రతినిధులు ప్రశ్నించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటనర్సయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్‌ముదిరాజ్, మ హిళా విభాగం అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రీ సర్వే చేసి ముదిరాజ్‌ల జనాభాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహాసభ ప్రతినిధులు నీల రాములు, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అమరుల స్వప్నం సాకారం చేసిన సోనియా

### బిజెపి తెలంగాణకు శని.. ఓ శాపం: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ అమరవీరుల స్వప్నం సోనియా గాంధీ సాకారం చేశారని ఒక ఓటు రెండు రాష్ట్రాలంటూ కాకినాడ తీర్మానంతో ఓట్లు చేసుకొని మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజలను వంచించిన పార్టీ ఇప్పటికి తెలంగాణపై ద్వేషం కక్కే పార్టీ బిజెపి అని ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం వేముల వీరేశం మాట్లాడుతూ బిజెపి ఎంపి తేజస్వీసూర్య లోక్‌సభలో తెలంగాణ పట్ల కాలకూట విషాన్ని చిమ్మాడని దుయ్యబట్టారు. తేజస్వీసూర్య అమానించి, అవహేళన చేస్తున్నప్పుడు బిజెపి మంత్రులు, ఎంపీలు పార్లమెంటులో ఎందుకు మౌనంగా ఉన్నారనీ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు ఓట్లు వేసి ఎనిమిది మందిని గెలిపిస్తే వారినే అవమానపరుస్తున్నారని ఆవేదన చెందారు. తెలంగాణను అమానిస్తున్న బిజెపికి ప్రజలు పుట్టగతులు లేకుండా చేయాలనీ పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఆనాడు లోక్‌సభలో సుష్మాస్వరాజ్ మాట్లాడింది కూడా తప్పేనా, ఆమె మాట్లాడింది తప్పని బిజెపి నాయకులు చెప్పగలుగుతారా అని ఆయన సవాల్ చేశారు. రాజ్యసభలో వెంకయ్య నాయుడు తెలంగాణకు వ్యిరేకంగా పార్లమెంటు లో మాట్లాడాడు అదే నేడు తేజస్వీసూర్య మాట్లాడినారు ఇదీ బిజెపి సిద్దాంతామా..? అని ఆయన ప్రశ్నించారు.

ఎంపి తేజస్వీ సూర్య తక్షణమే క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. బిజెపి కేంద్ర, రాష్ట్రనాయకత్వం క్షమాపణలు చెప్పుతూ ఆ ఎంపితో కూడా క్షమాపణ చెప్పించాలనీ ఆయన కోరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బిజెపిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ ఏర్పాటైందనీ తెలంగాణ ను అవమనించడం ద్వారా రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ను బిజెపి నాయకులు అవమానిస్తున్నారని అన్నారు. మోడీ, అమిత్‌షా తెలంగాణ పైన చూపిస్తున్న కుపట బుద్ధి, కుట్ర నే బిజెపి నాయకులకు వచ్చిందనీ, తెలంగాణ కు బిజెపి శని, ఒక శాపం తయారైంది. తెలంగాణకు చెందిన కొంత మంది ఆత్మాభిమానంలేని బిజెపి నాయకులు చెప్పులు మోయడ ంతో తెలంగాణ ప్రజలను చులకనగా చూస్తున్నారని అన్నారు.

# బీహార్ కొత్త సిఎంకు హత్య బెదిరింపులు



**పాట్నా, ఏప్రిల్ 17:** బీహార్ నూతన ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి ఫోన్ ద్వారా హత్యా బెదిరింపులు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఈ పరిణామం ఎదురుకావడంతో పోలీసు యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిందితుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన ముంగేర్ పోలీసుల ప్రత్యేక బృందం, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఫోన్ నెంబర్‌ను ట్రేస్ చేసి అతడు గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించారు. గుజరాత్‌లోని సనంద్ ప్రాంతంలో తలదాచుకున్న శేఖర్ యాదవ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై బీహార్‌కు తరలిస్తున్నారు. అసలు ఒక ముఖ్యమంత్రిని చంపేస్తానని బెదిరించడానికి గల కారణాలేంటి దీని వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. మరోవైపు, బీహార్ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. సుదీర్ఘ కాలం తర్వాత బీహార్‌లో తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటం గమనార్హం. నితీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ సామ్రాట్ చౌదరి ముఖ్యమంత్రిగా పీఠం అధిష్ఠించారు. ఈ కొత్త ప్రభుత్వంలో అధికార విభజన కూడా ఆసక్తికరంగా ఉంది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి ఏకంగా 29 శాఖలను తన వద్దే ఉంచుకోగా, మిత్రపక్షం జేడీయూ నుంచి ఇద్దరు నేతలు ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. జేడీయూకు మొత్తం 18 శాఖలను కేటాయించారు.

# కాళేశ్వరం బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేస్తాం

## ఎన్‌డిఎస్‌ఎ మార్గదర్శకాలకు అనుగుణంగానే మరమ్మతులు

## వానకాలం నాటికి అన్ని పరీక్షలు పూర్తి చేస్తాం

## ఢిల్లీలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ పునరుద్ధరణ పనులను పూర్తిగా శాస్త్రీయ విధానంలో, పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం నెషనల్ డ్యామ్ సెఫ్టిఅథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్‌తో భేటి అయ్యారు. బ్యారేజీల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్‌డిఎస్‌ఎ ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే స్వయంగా బ్యారేజీలను సందర్శన కు వస్తానని చెప్పారు. బ్యారేజీల పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిపుణుల సంస్థలను ప్రభుత్వం నియమించింది. డిజైనింగ్, టెస్టింగ్ సంస్థలు రంగంలోకి దిగాయి. డిజైన్‌కు ముందు అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను సిడబ్ల్యూపిఆర్‌ఎస్ సంస్థ చేస్తుంది. బ్యారేజీల పునరుద్ధరణ కోసం జిపిఆర్ (గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్) స్కానింగ్ , డ్రోన్ సర్వేలు, బోర్‌హోల్స్, జియోటెక్నికల్ , జియోఫిజికల్ పరీక్షలతో భూమి, అక్కడ నిర్మాణాల సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోనున్నారు. వివిధ సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రభుత్వం సెంట్రల్ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఇరిగేషన్ శాఖ అధికారులు, సీడబ్ల్యూపీఆర్‌ఎస్ ప్రతినిధులు, డిజైనింగ్ సంస్థ ప్రతినిధులు, ఇతర టెక్నికల్ ఏజెన్సీలు సభ్యులుగా ఉన్నారు. పరీక్షలు సకాలంలో జరిగేలా చూడడం, అవసరమైన డేటా సమయానికి అందించడం, అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ చూసుకుంటుంది. ఈ ప్రక్రియ అంతా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగేందుకు, కేంద్ర స్థాయి నిపుణుల పర్యవేక్షణ కూడా ఉండే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అవసరమైతే ప్రత్యేక సాంకేతిక నిపుణుల బృందాన్ని కూడా ఇందులో చేర్చే అవకాశముంది. అన్ని కోణాల్లో విశ్లేషించి ప్రస్తుతం బ్యారేజీల ఫౌండేషన్, కట్ ఆఫ్ వాల్ పరిస్థితులు ఎలా ఉన్నాయో అంచనా వేయనున్నారు. అన్ని రకాల పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత, ఇప్పుడున్న నిర్మాణ లోపాలు గుర్తించి పూర్తి సమాచారం విశ్లేషణల ఆధారంగా వాటికనుగుణంగా పునరుద్ధరణ పనులకు డిజైనింగ్ సంస్థ కొత్త డిజైన్లు సిద్ధం చేస్తారు. ఈ డిజైన్‌ను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి పంపించి, వాళ్ళు ఇచ్చే



సూచనలు మార్గదర్శకాలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ దేశంలో ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతను నిరంతరం పర్యవేక్షించే బాధ్యత కలిగిన చట్టబద్ధమైన సంస్థ. రానున్న మూడు నాలుగు నెలల్లో (వర్షాకాలం ముందు) అన్ని పరీక్షలు పూర్తి చేసి, డిజైన్లు సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వర్షాకాలం తరవాత పునరుద్ధరణ పనుల ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

# శంషాబాద్ విమానాశ్రయంలో థాయ్‌లాండ్ మహిళ అరెస్టు

## మూడు కిలోల హైబ్రిడ్ గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ఆగడం లేదు. ఈ నెలలో మూడుసార్లు ముగ్గురు వ్యక్తులు విదేశాల నుంచి ఖరీదైన హైబ్రీడ్ గంజాయిని హైదరాబాద్‌కు స్మగ్లింగ్ చేస్తూ దొరికిపోగా శుక్రవారం ఉద యం థాయ్‌లాండ్‌కు చెందిన ఓ మహిళ ఇదే రకం గంజాయి మూడు కిలోలను తరలిస్తూ కస్టమ్స్ అధికారులకు దొరికిపోయింది. వివరాలు ఇలా వున్నాయి. థాయ్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు రాగా అందులో వచ్చిన ఓ మహిళ తన లగేజిని తనిఖీ కోసం కస్టమ్స్ అధికారులకు ఇచ్చింది. ఈ క్రమంలో ఆ మహిళ ప్రవర్తన వింతగా, అనుమానాస్పదంగా వుండడంతో అధికారులు ఆమెను నిలదీయడంతో పాటు లగేజి బ్యాగ్‌ను క్షుణ్ణంగా సోదా చేయగా అందులో మూడు కిలోల హైబ్రీడ్ గంజాయి కనిపించడంతో దానిని జప్తు చేశారు. అనంతరం ఆ మహిళను విచారించగా తాను థాయ్‌లాండ్ నుంచి హైదరాబాద్‌లోని గంజాయి స్మగ్లర్లకు ఇచ్చేందుకు వచ్చినట్లు చెప్పింది. గంజాయి తరలించిన మ హిళపై కేసు నమోదు చేసిన కస్టమ్స్ అధికారులు ఆమెను శంషాబాద్ ఆర్‌జిఐఎ పోలీసులకు అప్పగించారు. గంజాయి విలువ కోటి రూపాయల వరకు వుంటుందని పోలీసులు తెలిపారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా తేజస్విసూర్య వ్యాఖ్యలు

## ప్రొఫెసర్ కోదండరాం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను కించపరిచేలా బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేశారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏమాత్రం సందర్భం లేకుండా, కనీస అవగాహన లేకుండా తెలంగాణ ఏర్పాటును బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులతో ముడిపెట్టడం శోచనీయమని మండిపడ్డారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్3 ప్రకారం, అత్యున్నత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఏర్పాటైన రాష్ట్రాన్ని కించపరచడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను నాటి బీజేపీ అగ్రనేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ గౌరవించి, మద్దతు తెలిపిన విషయాన్ని కోదండరాం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత పార్టీ సీనియర్ నేతలు తీసుకున్న నిర్ణయాలను కూడా అర్థం చేసుకోకుండా తేజస్వి సూర్య మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు, ఎంపీ అంత బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతుంటే పక్కనే ఉన్న కేంద్ర మంత్రులు ఆయన్ని నిలువరించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడాన్ని బట్టి చూస్తే, వారికి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని అర్థమవుతోందని విమర్శించారు. తేజస్వి వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని, ఆయనపై బీజేపీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రోహిత్ వేముల బిల్లుపై కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** తెలంగాణలోని ఉన్నత విద్యాసంస్థల్లో సామాజిక గుర్తింపు ఆధారిత వివక్షను నిరోధించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై 'రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026' రూపకల్పన కోసం ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై అధ్యయనం చేసి, చట్ట రూపకల్పనకు అవసరమైన సిఫార్సులు, సూచనలను సబ్ కమిటీ ప్రభుత్వానికి అందిస్తుంది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జీవో ఆర్టీ నెం.490ని జారీ చేశారు. వీలైనంత త్వరగా తమ నివేదికను సమర్పించాలని కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు.

# ప్రపంచంలోనే తొలి ఎయిర్‌టాక్సీ స్టేషన్ రెడీ

**దుబాయ్, ఏప్రిల్ 17:** ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఎయిర్ టాక్సీలు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక దేశాలు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. త్వరలో తమ పౌరులకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి దుబాయ్ ప్రకటించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రపంచంలోనే తొలి ఎయిర్‌టాక్సీ స్టేషన్‌ను నిర్మించింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో నిర్మించిన స్టేషన్ ఈ యేడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.

**ప్రత్యేకతలివే..**

3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్‌ట్యాక్సీ స్టేషన్ నిర్మాణం. యేటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాల కల్పన. కార్లలో సుమారు 45 నిమిషాలు పట్టే సమయంతో పోలిస్తే ఎయిర్ ట్యాక్సీల్లో కేవలం 10 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరే అవకాశం. రెండు ల్యాండింగ్ ప్యాడ్‌లు.. ఎలక్ట్రిక్ విమానాల కోసం చార్జింగ్ పాయింట్లు, రెండు-స్థాయుల కార్ పార్కింగన వంటి సౌకర్యాలు అందు బాటులో. అర్బన్ ఎయిర్ ట్యాక్సీ సేవలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, మెడికల్ , ఎమర్జెన్సీ సేవల కల్పనకు అవకాశం.



నాలుగు స్టేషన్ల నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ఎయిర్ స్టేషన్‌ను నిర్మించచినట్లు అధికారులు వెల్లడించారు. 2026 చివరికి డౌన్‌టౌన్ దుబాయ్, పామ్ జుమేరా, దుబాయ్ మెరీనాలలోనూ ఎయిర్ స్టేషన్‌ల నిర్మాణం పూర్తి చేసి, అందుబాబులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నూతన, స్థిరమైన రవాణా విధానాలన అవలంబించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్టును స్కైపోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నగరాల మధ్య ప్రయాణ సమయాలను గణనీయంగా తగ్గించడానికి ఎయిర్ టాక్సీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

**ఎయిర్ ట్యాక్సీలు అంటే..**

ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగపడుతున్న డ్రోన్ల కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే క్వాడ్ కాప్టర్ వంటి వాటిని ఎయిర్ టాక్సీలు అంటారు. ఇవి ఆకాశమార్గంలో ఇద్దరి నుంచి ఆరుగురిని స్వల్పదూరాలకు తీసుకెళ్లగలవు. తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకోవడానికి ఈ సేవలు ఉపయోగపడతాయి.

# మహిళా రిజర్వేషన్ల విషయంలో బిజెపిది కపట నీతి

## రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో సాధారణ మెజారిటితోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, కావాలని డి లిమిటేషన్ అంశాన్ని జోడించి బిల్లును మోది ప్రభుత్వం సంక్లిష్టం చేసిందని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క దుయ్యబట్టారు. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు అంశం విషయంలో పార్లమెంట్‌లో జరిగిన పరిణామాలు బిజెపి కపట నీతిని బహిర్గతం చేశాయని మండిపడ్డారు. ఇది మహిళల హక్కులను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కాదని, రాజకీయ లాభాల కోసం తీసుకున్న నిర్ణయమని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఈ బిల్లును ఉపయోగించుకోవాలన్న ఉద్దేశం బిజెపిలో కనిపిస్తోందన్నారు. వాస్తవానికి బిజెపి భావజాలమే మహిళా వ్యతిరేకమైందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్లపై బిజెపికి నిజమైన నిబద్ధత లేదనే విషయం లోక్‌సభ సాక్షిగా నిరూపితమైందని వ్యాఖ్యానించారు. ఇది ప్రజాస్వామ్యానికి, మహిళల హక్కులకు మద్దతుగా నిలిచిన విజయమన్నారు. దేశానికి మహిళా ప్రధానిని, మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్లను ఎలాంటి షరతులు లేకుండా, తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బొగ్గు గనుల వేలం

## పెరుగుతున్న ఇంధన అవసరాలకు మద్దతు

## వృద్ధి, సామర్థ్యం, స్వావలంబనపై దృష్టి

## కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమదేవ్‌దత్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన అవసరాలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి విక్రమ్‌దేవ్ దత్ అన్నారు. భారత్‌లో ఆత్మనిర్భర దేశం అనే దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి మంత్రిత్వ శాఖ యొక్క నిరంతర నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుందని చెప్పారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ముంబైలో 15వ విడత వాణిజ్య బొగ్గు గనుల వేలంపాటను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంధన భద్రత కోసం బొగ్గు అనే అంశంపై వాటాదారుల సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వృద్ధి, సామర్థం మరియు స్వావలంబనపై నూతనంగా దృష్టి సారించి భారతదేశ ఇంధన రంగాన్ని బలోపేతం చేస్తూనే ఉందన్నారు. 2020లో వాణిజ్య బొగ్గు తవ్వకాలను ప్రారంభించినప్పటి నుండి, ఈ చొరవ దేశీయ బొగ్గు లభ్యతను గణనీయం గా పెంచి, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసిందని వెల్లడించారు.

# ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలి

## విస్తృత ఛార్జింగ్ నెట్‌వర్క్ కీలకం

## సుస్థిరత లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు

## మౌలిక సదుపాయాలపై సమగ్ర ప్రణాళిక

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల మౌలిక సదుపాయాలను విస్తరించే వ్యూహాలపై దృష్టి సారించాలన్నారు. సుస్థిరత లక్ష్యాలకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని వేగవంతం చేయడం, ఇదే సమయంలో స్వచ్ఛమైన ఇంధనం వైపు పరివర్తన చెందాల్సిన తక్షణ అవసరం ఉందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల పట్ల వినియోగదారులలో విశ్వాసాన్ని పెంపొందించడానికి, ఎలక్ట్రిక్ మొబిలిటీకి పెరుగుతున్న డిమాండ్‌కు మద్దతు ఇవ్వడానికి బలమైన, విస్తృతమైన ఛార్జింగ్ నెట్‌వర్క్ చాలా కీలకమని ఆయన ఉద్ఘాటించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం రెండింటినీ ఉపయోగించుకుని, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి సమగ్రమైన, దూరదృష్టితో కూడిన ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సమన్వయ ప్రయత్నాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో ఛార్జింగ్ సౌకర్యాల లభ్యత, విశ్వసనీయత మరియు సామర్థ్యాన్ని నిర్ధారించే ఒక సజావైన వ్యవస్థను సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను మ్యాప్ చేయడానికి మరియు పర్యవేక్షి ంచడానికి ఒక కేంద్రీకృత, రియల్‌టైమ్ డాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ డాష్‌బోర్డ్, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో ప్రణాళిక, పురోగతిని పర్య వేక్షి ంచడం, పారదర్శకతను నిర్ధారించడానికి ఒక కీలక సాధనంగా ఉపయోగ పడుతుందన్నారు. అపార్ట్‌మెంట్ భవనాల బేస్‌మెంట్‌లలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను తప్పనిసరి చేసేందుకు ఇంధన శాఖ ఒక విధానాన్ని రూపొందించే ప్రక్రియలో ఉందని విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ సమావేశానికి రవాణా, రోడ్లు, భవనాల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రణాళికా కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీజీఆర్‌టీసీ ఎండీ నాగి రెడ్డి, రవాణా కమిషనర్ ఇళంబరితి, టీజీఐఐసీ వీసీ ఎండీ శశాంక, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినులకు లాప్‌టాప్‌లు పంపిణీ చేసిన మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 17:** పేద విద్యార్థినుల విద్యా సాధికారత లక్ష్యంగా పనిచేస్తున్న 'టచ్ ఎ లైఫ్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేద విద్యార్థులకు లాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. శుక్రవారం నందినగర్‌లోని నివాసంలో మాజీ కార్పొరేటర్ సామల హేమ సారథ్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు విభూతి జైన్, రీనా హిందోచా విద్యార్థినులతో కలిసి కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. స్వయం సమృద్ధి సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమపై తాము నమ్మకం ఉంచుకుని, ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడాలని సూచించారు. ఈ సందర్భంగా కెటిఆర్ పంపిణీ చేసిన లాప్‌టాప్‌లను అందుకున్న పేద విద్యార్థినులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫౌండేషన్ చేస్తున్న కృషిని కెటిఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

# మహిళా బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదు

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనీ మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్‌విమర్శించారు. దాని ఫలితమే ఈరోజు పార్లమెంట్ లో మహిళా బిల్లు విగిపోవడమనీ తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఒబిసి రిజర్వేషన్ అమలు చేయాలని మా పార్టీ డిమాండ్ చేసిందనీ, సంపన్నులే కాదు సామాన్య మహిళలు కూడా రాజకీయాల్లో రావాలని కాంగ్రెస్ పార్టీ ఉద్దేశ్యమనీ అన్నారు. అందుకే సబ్ కోటా ఒబిసి నిర్ణయం చేసిందనీ తెలిపారు. మా డిమాండ్స్ ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

ఏకపక్షంగా మొండిగా వ్యవహరించిందిఅందుకే మహిళా రిజర్వేషన్ బిల్లు ఓడిపోయిందని భాష్యచెప్పారు. మీకు చిత్తశుద్ధి ఉంటే బిల్లు ఆమోదింపజేసేవాళ్లే కావాలని దీనిని సంక్లిష్టమైనది గా క్రియేట్ చేశారనీ తెలిపారు. ఆ ఫలితమే ఈ బిల్లు లోకసభ లో వేగిపోవడంఅత్యంత కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లును డిలిమిటేషన్ తో లింక్ పెట్టీ నాలుగు రోజుల్లోనే ముగించేయాలని చూసిందనీతెలిపారు. బిజెపిలో తొందరపాటు కనిపించింది తప్ప మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని తపన కనిపించలేదుఅందుకే లోకసభ వేదికగా మోదీ ప్రభుత్వం పరాభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని వివరించారు.

# మహిళపై ఎస్సై లైంగిక దాడి

## కేసు నమోదు చేసిన పోలీసులు

**జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా కొద్ది రోజుల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చిన ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌పై వరంగల్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి అత్యాచారం కేసు నమోదైన సంఘటన హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలో దావ నంలా వ్యాపించింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌కు వరంగల్ ప్రాంతానికి చెందిన 28సంవత్సరాల వయస్సు గల మహిళతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం దినదిన ప్రవర్తనమానం అవుతూ ఇరువురి స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలో నిత్యం సామాజిక మాధ్యమాలలో ఇరువురు చాటింగ్ చేస్తూ గంటలు, రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి. ఈ మధ్యకాలంలోనే పరిచయమైన మహిళ వ్యక్తిగత విషయాలను లోతుగా తెలుసుకున్న జమ్మికుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆమె ఒంటరిగా నివసిస్తుందన్న విషయాన్ని తెలుసుకున్నాడు. ఆమె బలహీనతలను ఆసరగా చేసుకుని ఎలాగైన ఆ మహిళను లొంగదీసుకోవాలని పన్నాగం పొందిన ఎస్సై శ్రీకాంత్ పక్కా ప్లాన్ ప్రకారం ఇటీవల శ్రీకాంత్ వరంగల్‌కు వెళ్లి సంబంధిత మహిళకు ఫోన్ చేసారు. తనను కలవాలని, ముఖ్యమైన విషయాలు మాట్లాడాలని, ఎన్నో కల్లబొల్లి కబుర్లు చెప్పి, ఆ మహిళ ద్వారా లొకేషన్ అడిగి తెలుసుకున్నట్లు సదరు మహిళ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆమె ఇంటికి వెళ్లిన ఎస్సై శ్రీకాంత్ అక్కడ ఆమెపై అత్యాచారం చేశాడని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు జరిగిన అన్యాయాన్ని తనకు తెలిసిన మహిళ పెద్దలకు చెప్పుకుని ధైర్యం కూడగట్టుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాధిత మహిళనుండి సుబేదారి పోలీసులు నిర్దిష్టమైన వాగ్మూలం తీసుకుని ఎస్సై శ్రీకాంత్‌పై పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.



నిందితుడు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్

# భార్యను హత్యచేసి వర్జీనియా మాజీ గవర్నర్ ఆత్మహత్య!

**వర్జీనియా, ఏప్రిల్ 17:** అమెరికాలోని వర్జీనియా మాజీ లెఫ్టినెంట్ గవర్నర్, డెమొక్రటిక్ పార్టీలో ఒకప్పుడు ఉద్యమ నేతగా వెలిగిన జస్టిన్ ఫెయిర్‌ఫ్యాక్స్ (47) దారుణానికి పాల్పడ్డారు. తన భార్య, డెంటిస్ట్ అయిన డాక్టర్ సెరినా ఫెయిర్‌ఫ్యాక్స్‌ను (49) కాల్చి చంపి, ఆ తర్వాత తాను కూడా తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వాషింగ్టన్ శివారులోని అన్నేన్‌డేల్‌లో ఉన్న వారి నివాసంలో గురువారం ఉదయం ఈ ఘోరం చోటుచేసుకుంది. ఇంట్లోని బేస్‌మెంట్‌లో జస్టిన్ తన భార్యను కాల్చి చంపారు. అనంతరం పై అంతస్తులోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తన ప్రాణాలు తీసుకున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో వారి ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. వారి కుమారుడు 911కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కొంతకాలంగా ఈ దంపతుల మధ్య విబేధాలు నడుస్తున్నాయి. సెరినా గతేడాది విడాకులకు దరఖాస్తు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా ఏప్రిల్ నెలాఖరులోగా ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని జస్టిన్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఈ గడువుకు కొన్ని వారాల ముందే ఆయన ఈ దారుణానికి ఒడిగట్టారు. 2019లో ఇద్దరు మహిళలు చేసిన లైంగిక ఆరోపణలతో జస్టిన్ ఫెయిర్‌ఫ్యాక్స్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా నాశనమైంది. ఆ ఘటన తర్వాత ఆయన తీవ్ర నిరాశ, నిస్పృహల్లోకి జారుకున్నారని, మద్యానికి బానిసయ్యారని కోర్టు పత్రాలు, స్నేహితుల కథనం ద్వారా తెలుస్తోంది. ఆర్థిక సమస్యలు కూడా ఆయన్ను చుట్టుముట్టాయి. ఈ ఘటనపై వర్జీనియా రాజకీయ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# డిజిటల్ అరెస్టు పేరిట వృద్ధుడిని బెదిరించి రూ.42 లక్షల దోపిడీ

## సైబర్ నేరగాడి అరెస్టు.. నిందితుడి

## ఖాతా నుంచి రూ.12 లక్షల జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** డిజిటల్ అరెస్టుకు సంబంధించి సైబరాబాద్ పోలీసులు మరో బడా సైబర్ నేరగాడిని అరెస్టు చేశారు. నగరం లోని బాలానగర్‌లో ఓ వృద్ధుడిని గత ఫిబ్రవరి నెలలో 15 రోజుల పాటు డిజిటల్ అరెస్టు పేరిట ఇంట్లోనే బంధించి 42 లక్షల రూపాయలు కాజేసి న ఘటనలో ఈ నేరగాడు పట్టుబడ్డాడు. పట్టుబడ్డ నేరగాడు జగిత్యాల జిల్లా మేడిపల్లి కట్లకుంటకు చెందిన వాడుగా ఇతను సొంతంగా ఒక ముఠా ను నిర్వహిస్తున్నట్లు తేలింది. వృద్ధుడి నుంచి కొట్టేసిన 42 లక్షల రూపాయల నగదులో 12 లక్షల రూపాయలు నేరగాడి బ్యాంకు ఖాతా నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి సాయి మనోహర్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు.



డిజిటల్ అరెస్టు ఘటనకు సంబంధించి నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సైబర్ క్రైం డిసిపి సాయి మనోహర్.

జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంటకు చెందిన గాజర్ల అవినాష్ (26) కొంతకాలం క్రితం డాటా ఎంట్రీ ఉద్యోగం కోసం కాంబోడియా దేశానికి వెళ్లి అంత ర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాలతో కలిసి పనిచేశాడు. ఈ క్రమంలో భారత్‌లో వెలుగు చూసిన అనేక సైబర్ నేరాలలో ఇతను పాల్గొన్నాడు. అయితే అక్కడి నుంచి బయటకు వచ్చాక అవినాష్ జగిత్యాల కేంద్రంగా సొంతంగా ఒక ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ముఠాలో మరో నలుగురు వుండగా వీరంతా కొన్ని రోజుల క్రితం మరో కేసులో అరెస్టయ్యారు.

ఆ కేసులో అవినాష్ కూడా నింది తుడుగా వున్నాడు. కాగా అవినాష్ తన ముఠాతో కలిసి గత ఫిబ్రవరి నెలలో బాలానగర్‌లో ఓ వృద్ధుడిని టార్గెట్ చేశాడు. మీపై 17 కేసులున్నాయి. ఇందులో సైబర్ క్రైంతో పాటు అనేక తీవ్రమైన కేసులున్నాయని బెదిరించి 15 రోజుల పాటు ఇంట్లోనే డిజిటల్ అరెస్టు పేరిట బంధించాడు. ఈ క్రమంలో వృద్ధుడి బ్యాంకు ఖాతా నుంచి 42 లక్షల రూపాయలను తాను సూచించిన బ్యాంకుల ఖాతాలకు మళ్లించుకున్నాడు. దీని తరువాత వృద్ధుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా నిందితుడు అవినాష్ గురించి వెలుగు చూసింది. నిందితుడి కోసం దాదాపు రెండు నెలల ను ంచి గాలించగా గురువారం రాత్రి పట్టుబడ్డాడు. ఇతని బ్యాంకు ఖాతాలో వృద్ధుడి నుంచి కాజేసిన నగదులో 12 లక్షల రూపాయలుండగా దానిని పోలీసులు జప్తు చేశారు.

నిందితుడు అనేక సైబర్ నేరాలలో పాల్గొన్నట్లు తేలింది. అవినాష్‌తో పాటు అతని ముఠాపై వున్న కేసుల గురించి పోలీ సులు ఆరా తీస్తున్నారు. సైబర్ నేరాలతో పాటు డిజిటల్ అరెస్టుపై అందరు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం డిసిపి సాయి మనోహర్ కోరారు.

## హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాస్‌కు ఘనసన్మానం



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. శ్రీనివాస్ వీడ్కోలు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

విజయవాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరాజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికారు. హైకోర్టు న్యాయమూర్తి వి.జస్టిస్ శ్రీనివాస్ పదవీ విరమణ చేయనున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ వి. శ్రీనివాస్ నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ వి.శ్రీనివాస్ కృష్ణా జిల్లా తిరువూరులో లక్ష్మణరావు, సుశీలాకుమారి దంపతులకు ఏప్రిల్ 18, 1964లో జన్మించారని, 1988వ సంవత్సరంలో నూజివీడు బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. ఆగస్టు 4, 2022న హై కోర్టు న్యాయమూర్తిగా నియమకం అయ్యారని తెలిపారు.జస్టిస్ వి. శ్రీనివాస్ తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని, న్యాయ వ్యవస్థకు విశేష సేవలు అందించారని కొనియాడారు. జస్టిస్ వి.శ్రీనివాస్ జిల్లా సెషన్స్ జడ్జీగా, రిజిస్ట్రార్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు.

అనంతరం అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి జస్టిస్ వి.శ్రీనివాస్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు. పదవీ విరమణ చేస్తున్న జస్టిస్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ ్మనారాయణ, న్యాయవాదులు జస్టిస్ వి. శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

## దేశరాజకీయాల్లో టిడిపి క్రియాశీలక పాత్ర



గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 17 ప్రభాతవార్త: భారతదేశ రాజకీయాల్లో తెలుగుదేవంపార్టీ ఆవిర్భావమే సంచలనమని, దేశ రాజకీయాల్లో టిడిపి క్రియాశీలకపాత్ర పోషించిందని అంతటి ఘన చరిత్ర కలిగిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేస్ నియమితులవటం పార్టీ శ్రేణులకు సంతోషకరమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పేర్కొన్నారు. టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయిన సందర్భంగా శుక్రవారం ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందించి అబినందనలు తెలిపారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ద్వారా పార్టీశ్రేణుల్లో నూతన ఉత్సాహం తీసుకురావటంలో లోకేష్ సఫలీకృతులయ్యారని తెలిపారు. పార్టీని ముందుకు నడపటంలో లోకేష్ తనదైన శైలిలో దూసుకుపోతారన్న ఆశాభావం వ్యక్తం చేసారు.

### తేజస్వి సూర్య చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు

## కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి

**- సిపిఐ నారాయణ**

విజయవాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: తేజస్వి సూర్య చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలకు వెంకయ్య నాయుడు, కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని సిపిఐ జాతీయ క్రమశిక్షణా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె. నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ బిజెపి ఎంపి తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై కె. నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్ సాక్షి గా జరిగిన ఈ పరిణామంపై ఆయన నిప్పులు చెరిగారు. ఆనాడు విభజన బిల్లు ఆమోదం పొందినప్పుడు బిజెపి తరపున సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు వంటి అగ్రనేతలు మద్దతు తెలిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అసలు ఆనాడు బిజెపి నేతలు తీసుకున్న నిర్ణయం తప్పని తేజస్వి భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇదే క్రమంలో ప్రధాని మోడీ అనుసరిస్తున్న రాజకీయాలపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. మోడీ సర్కార్ 'నీతి లేని రాజకీయాలు' చేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది 'పాయసంలో విషం కలిపి తాగమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు.

## గ్రంధాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు

విజయవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త : గ్రంధాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలను విజయవంతం చేసేందుకు గ్రంధాలయ అధికారులు కృషిచేయాలని కృష్ణా జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ యంఎస్.బేగ్ కోరారు. ఠాగూర్ గ్రంధాలయంలో శుక్రవారం జరిగిన గ్రంధాలయ ఉద్యోగుల సమావేశంలో బేగ్ మాట్లాడుతూ ఈనెల 28వతేదీ నుండి జూన్ 6 వరకు జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంధాయాలన్నిటిలోనూ విద్యార్ధులకు వేసవిశిక్షణా శిబిరాలు నిర్వహించాలన్నారు. శిబిరాలకు సంబందించి బ్రోచర్లు, పోస్టర్లు ముద్రించి ప్రధాన కూడళ్ళలో ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాని ్న జయప్రధం చేయాలన్నారు.

వేసవి శిక్షణకు వచ్చే విద్యార్ధులకు దాతల సహకారంతో చల్లని తాగునీరు, స్నాక్ ్స, మరుగుదొడ్ల సౌకర్యాలు కలి ్పంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### తేనె పట్టు మైనం ఆధారిత ఉత్పత్తులు తయారీలో

# ఉద్యాన వర్సిటీ కాలేజీకి 3 పేటెంట్స్

**- కేంద్ర ప్రభుత్వం నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకున్న డీన్**

ఏలూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తేనె పట్టు మైనం ఆధారిత ఉత్పత్తులు చేయడానికి డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకట్రామన్న గూడెం ఉద్యాన కళాశాలకు కేంద్రం మూడు పేటెంట్లను జారీ చేసినట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ధనుంజయ రావు తెలిపారు. ఈ మేరకు పేటెంట్ ధ్రువీకరణ పత్రాలను కళాశాల అసోసియేట్ డీన్ ఎన్‌బివి చలపతిరావుకు అందించారు. హార్టికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు రూపొందించిన మూడు వినూత్న ఉత్పత్తులకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం పరిధిలోని ఇండియన్ పేటెంట్ కార్యాలయం నుంచి మూడు పేటెంట్లను జారీ చేశారు. కేంద్రం జారీ చేసిన పేటెంట్ వివరణ ధనుంజయరావు విడుదల చేశారు మొదటిది తేనె పట్టు మైనం పెయిన్ బామ్, రెండవది తేనె పట్టు మైనం దోమల నివారణ క్రీమ్, మూడవది తేనె పట్టు మైనం మాయిశ్చరైజింగ్ క్రీమ్. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కె ధనుంజయరావు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ మాట్లాడారు కేవలం ఉద్యోగుల కోసం చదవకుండా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారాలని అనేక మందికి ఉపాధి కల్పించే స్థాయిలో ఉండాలని ఆకాంక్షి ంచారు. ఉద్యాన రంగంలో అనేక విలువైన ఉత్పత్తులు రూపొందించడానికి వ్యాపారం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ ఆవిష్కరణ ద్వారా తేనెపట్టు మైనం వంటి ఉప



ఉత్పత్తికి విలువ పెరగడంతో పాటు తేనెటీగల పెంపకానికి ప్రోత్సాహం అందుతుందని తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఉత్పత్తుల్లో తేనెపట్టు మైనం, కొన్ని మొక్కల నుంచి సేకరించిన నూనెలతో ఔషధ గుణాలున్న ఆల్కహాల్తో కలిపి పూర్తి సహజ ప్రక్రియలో తయారు చేశారని వీటివల్ల తలనొప్పి తగ్గడం, వాపు తగ్గించడం, జీవులను నియంత్రించడం, దోమలను నివారించడం వంటి ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ ఎన్ ఇమ్మానుయేల్, విద్యార్థుల బృందాన్ని హార్టికల్చర్ డీన్ బి ప్రసన్నకుమార్, యూనివర్సిటీ రిజిస్టార్ ఎం మాధవి పరిశోధన సంచాలకులు ఎం రమానందంకు అభినందనలు తెలియజేశారు.

# చెరువుకట్టకు పైపై మెరుగులు

**● నాణ్యతలేని పనులకు బిల్లులు ● ఇరిగేషన్ అధికారుల చేతివాటం**

దొరవారిసత్రం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త : పెంగిల్ తుఫాన్ ప్రభావంతో తుఫానుకు భారీ వర్షాలు కురవడంతో చెరువులు కాలువలు తూములు భారీగా దెబ్బతున్నాయి. ఈ క్రమంలో 2024లో రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతిన్న చెరువులకు మరమ్మత్తుల కోసం ఎఫ్‌డిఆర్ నిధులను మంజూరు చేసింది. అయితే ఈ నిధులు గోల్మాల్ చేశారని తీవ్రంగా ఆరోపణ చేస్తున్నారు ఇరిగేషన్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి నాణ్యతలేని పనులు చేసిన వారికి బిల్లులు చేసి జేబులు నింపుకుంటున్నారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని 17 చెరువులు ఇరిగేషన్ శాఖ కిందకి వస్తాయి. ఈ 17 చెరువుల గాను సుమారు 5 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ఒక్కొక్క చెరువుకి సుమారు ఐదు లక్షలు చొప్పున చెరువు కట్ట మరమ్మతులకు, తూములు, దెబ్బతిన్న కాలవలను పూడికి తీసి బాగు చేయాలి కానీ ఇరిగేషన్ అధికారులు అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై కొందరు నాణ్యతలేని పనులను చేసి మరికొందరు పనులు చేయకుండానే పనులు చేసినట్లు బిల్లులు పెట్టి జేబులు నింపుకుంటున్నారు. అయితే అవినీతి అక్రమాలను అడ్డుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులే చేతులు తడిపి బిల్లులు చేయడంతో పలువురు గ్రామాల్లోని రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపై మెరుగులు చెరువు కట్టకు వేయడంతో భారీ వర్షాలు కురిస్తే మళ్లీ ఈ చెరువులు గండ్లు పడి ప్రమాదం వస్తుందని రైతులు లబోదిబో అని కొట్టుకుంటున్నారు.



### చెరువు ఎక్కడ పనులు అక్కడ

మండలంలోని అక్కరపాక, శ్రీధనమల్లి, తొగరమూడి, నెల్లబల్లి, చెరువుల్లో పైపై మెరుగులు దిద్ది బిల్లును చేసుకున్నారు చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న మట్టిని చెరువు కట్టకు పూత పోసి ఎఫ్‌డిఆర్ నిధులను గోలమల్ చేశారు దీనికి తోడు ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులు కూడా ఎఫ్‌డిఆర్ వర్కులు పెట్టి ఆ బిల్లులు కూడా చేసే పనులు ఇరిగేషన్ అధికారులు బిజీగా ఉన్నారు. అక్కరపాక గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేసిన పనికి చోటా నాయకుడు ఎఫ్‌డిఆర్ వర్క్ బిల్ పెట్టాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఆ గ్రామంలోని మరొక వర్గం పనులు చేయకుండానే బిల్లు ఎలా పెడతారు అంటూ సంబంధిత అధికారులను, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే పనులు ఉన్నారు. దీనిపై సూళ్లూరుపేట ఇరిగేషన్ డిఈ కస్తూరయ్యను ప్రభాతవార్త వివరణ కోరగా అక్కరపాక పీడర్ ఛానల్‌ను గతంలో ఉపాధి కూలీలు చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఆరా తీసి బిల్లును ఆపేసాము. ఎలాంటి అవకతవకలు జరిగిన బిల్లు పెట్టమని తెలిపారు.

## ఏసిబికి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్

**- రూ.13 లక్షలు స్వాధీనం... కేసు నమోదు**



పలమనేరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఎసిబి అధికారులు హటాత్తుగా సోదాలు నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ రజాక్ ఓ రైతు నుండి రూ.13 వేలు లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. పుంగనూరు రూరల్ మండలం మంగళంపల్లెకు చెందిన ఈశ్వరప్ప అనే రైతు 2018లో సమీపంలోని కొత్తచెరువులో నీరు ప్రగతి పథకం కింద రూ.5 లక్షల విలువైన పనులు పూర్తి చేశాడు. ఐతే బిల్లుల కోసం 8 ఏళ్ళుగా పలమనేరు ఇరిగేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పనులు కాలేదు. ఎంత వరకు ప్రాధేయపడినా సీనియర్ అసిస్టెంట్ రూ.15 వేలు లంచం ఇవ్వనిదే పని చేయనని తెగేసి చెప్పాడు. చివరకు ఈశ్వరప్ప రూ.13 వేలు ఇచ్చేందుకు బేరం కుదుర్చుకున్నాడు. దీంతో ఈశ్వరప్ప తిరుపతి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు.

ఇన్‌చార్చి డిఎస్పీగా వున్న కడప ఎసిబి డిఎస్పీ సీతారామారావు తన సిబ్బందితో వచ్చి ఈశ్వరప్పకు తమకు సంబంధించిన నోట్లకట్టలు ఇచ్చారు. ఈ నోట్లను ఈశ్వరప్ప సీనియర్ అసిస్టెంట్ రజాక్‌కు అందజేశాడు. వెంటనే ఎసిబి అధికారులు రజాక్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచంగా ఇచ్చిన నోట్లను స్వాధీనం చేసుకొని రజాక్‌ను అరెస్టు చేశారు. నిందితుని నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరుపరచనున్నట్లు డిఎస్పీ వివరించారు. ఇంకా రజాక్‌పై విచారణ కొనసాగుతోందని అతనిఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తమ పనుల కోసం వెళ్ళినపుడు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఎసిబి అధికారులకు తెలియజేయాలని బాధితులకు తప్పక న్యాయం చేస్తామని డిఎస్పీ తెలిపారు.

## రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

**ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా**

విజయవాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నందిగామలోని యుపిహెచ్‌సి, సిహెచ్‌సిలను ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్భంగా వైద్యశాలలో ఓపి రికార్డులు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, వైద్యశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, చిన్నపిల్లలకు ప్రత్యేక శ్రద్ధతో వైద్యసేవలు అందించాలన్నారు. వేసవి కాలంలో జ్వరాలు, కలుషిత నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్యూఆర్‌కోడ్ ద్వారా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్‌ను అందిస్తున్నారని, వాటిని పరిశీలించి లోటుపాట్లను సరిదిద్దుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. వైద్యసేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**స్వీయగణనతో దోషరహిత డేటా:** స్వీయగణనతో దోషరహిత డేటాతోపాటు సమయం ఆదా అవుతుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా అభిప్రాయపడ్డారు. నగరంలో పిబి.సిద్ధార్ధ కళాశాల్లో సెన్సస్‌పై ఎన్యూమరేటర్‌లు, సూపర్‌వైజర్‌లకు జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగానూ, జవాబుదారీతనంతోనూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని సూచించారు. 30 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని తెలిపారు.



## తిరుపతిలో గంజాయి, డ్రగ్స్‌కు చోటు లేదు

**- పట్టుబడిన రూ.20 కోట్ల విలువ గల 4,100 కేజీల గంజాయి ధ్వంసం**

తిరుపతి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం చట్ట రీత్యా నేరమని, తిరుపతి నగరంలో గంజాయి, మాదక ద్రవ్యాలకు చోటు లేదని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. గత కొంతకాలంగా జిల్లాలో పట్టుబడిన 4,100 కేజీల గంజాయిని కోర్టు అనుమతితో శుక్రవారం మధ్యాహ్నం ధ్వంసం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట మండలం తూక్కివాకం వద్ద ఉన్న సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సమక్షంలో చట్టపరమైన విధానాల ద్వారా నిర్వీర్యం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గంజాయి పండించడం, రవాణా, వినియోగం పై చాలా కఠినంగా వ్యవహరించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈగల్ సంస్థను ఏర్పాటు చేసి ఐజీ ర్యాంక్ అధికారిని నియమించి ప్రతి జిల్లాలో అనుబంధంగా అధికారులను ఏర్పాటు చేసి గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద కఠినంగా వ్యవహరించడం జరుగుతున్నదన్నారు. తిరుపతి జిల్లాలో గడిచిన రెండు నుంచి మూడు సంవత్సరాల్లో సీజ్ అయినటువంటి గంజాయిని తూకివాకంలో ఇన్సినరేషన్ పద్ధతి ద్వారా డిస్పోజ్ చేస్తున్నామని, సుమారు 208 కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.20 కోట్ల విలువ గల 4,100 కేజీల గంజాయిని కోర్టు నుంచి అనుమతి తీసుకుని డిస్పోజ్ చేస్తున్నామన్నారు. దీని ద్వారా గంజాయి రవాణా, వినియోగించే వారికి గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందన్నారు. తిరుపతి పట్టణం బెంగళూరు, చెన్నైకి ఒక ట్రాన్సిట్ పాయింట్‌గా గంజాయి రవాణాలో గుర్తించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాకు ఎక్కువగా అల్లూరిసీతారామరాజు జిల్లా నుంచి వైజాగ్, కాకినాడ మీదుగా బస్సుల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిరుపతికి వచ్చి, ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు మరియు కేరళకు వెళ్లడం గమనించామన్నారు. వాటిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సెర్చ్ పార్టీలను పెట్టి ట్రైన్స్, బస్సులు, లగేజీలను పరిశీలించి చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేయడంతో పాటు లక్ష మంది స్కూల్, కళాశాలల్లో 8, 9, 10 ఇంటర్మీడియట్ విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చి, ఆన్లైన్ ద్వారా గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాల మీద అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఒక వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు పిడి యాక్ట్ కింద కేసులు పెడుతూ గంజాయి వాడకాన్ని నియంత్రిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో సుమారు 15 పిడి కేసులు (ప్రివెంటివ్ డిటెన్షన్) పెట్టడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం అరికట్టడంలో పోలీస్ శాఖ ఎటువంటి అలసత్వం వహించదని, ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా గంజాయి, మత్తు పదార్థాల వాడకం దుష్ప్రభావం, ఆరోగ్య సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారిపై పిడి యాక్ట్ కింద అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. తిరుపతి ఒక ఆధ్యాత్మిక నగరం, ఎటువంటి గంజాయికి స్థానం లేదని ఆ దిశగా ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పని చేయడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లో మరింత పూర్తిగా అవగాహన కల్పించి, న్యాయసలహాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

### అనకాపల్లిలో లిథియం అయాన్ బ్యాటరీ

# తయారీ యూనిట్

**● రూ.8,175కోట్ల పెట్టుబడి ● 3 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ● 2027 జులైకి తొలి దశ పూర్తి**

విజయవాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8 వేల 175 కోట్ల పెట్టుబడితో లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. వేలాది ఉద్యోగాలు, ప్రపంచస్థాయి సాంకేతికతతో ఈ ప్రాజెక్టు భవిష్యత్ అవసరాలకు శక్తివంతమైన ఆధారంగా నిలవనుంది. సెల్ నుంచి ప్యాక్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ వరకు ఒకే చోట సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాజెక్టు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందనుంది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన వినియోగం పెరుగుతున్న సమయంలో ఎనర్జీ స్టోరేజ్ రంగంలో ఈ యూనిట్ కీలక పాత్ర పోషించనుంది. దాదాపు 3వేల మందికి ఉపాధి కల్పించడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, సరఫరా గొలుసు అభివృద్ధికి దోహదం చేస్తుంది. భవిష్యత్తులో 20గిగావాట్ అవర్ సామర్థ్యానికి విస్తరణ లక్ష్యంతో ముందుకెళ్తున్న ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రను గ్లోబల్ క్లీన్ ఎనర్జీ తయారీ కేంద్రంగా నిలబెట్టే దిశగా కీలక అడుగుగా అంచనా వేస్తున్నారు.

ప్రాజెక్టు మొదటి దశ 2027 జులై నాటికి పూర్తి చేసి వాణిజ్య ఉత్పత్తిలోకి తేవాలన్నది లక్ష్యం. ఈ పరిశ్రమకు సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రాబోయే ఇతర ఇంధన నిల్వ సాంకేతికతనూ పరిశీలిస్తోంది. ఈ సంస్థ ఇప్పటికే గుజరాత్‌లోని నోయిడా, టెక్సాస్‌లో 14.9 గిగావాట్ సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌లను నిర్వహిస్తోంది. అమెరికా, కెనడా, ఇటలీ, తుర్కియే, వియత్నాంతో పాటు 30 దేశాలకు ఎగుమతి చేస్తోంది. 545, 700ల వాట్ పీక్ సోలార్ మాడ్యూల్స్‌ను తయారు చేసే తొలి స్వదేశీ సంస్థలలో ఒకటిగా నిలిచింది. మాడ్యూల్స్ తయారీ నుంచి ఇంధన నిల్వ రంగానికి విస్తరించే లక్ష్యంతో పరిశ్రమ



## 'లిడ్‌క్యాప్' భూములను పరిరక్షించాలి

తిరుపతి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి రూరల్ మండలం దామినేడు లెక్క దాఖలాలో లిడ్ క్యాప్ సంస్థ పేరుపై ఉన్న భూములపై దొంగ పట్టాలు సృష్టించి అక్రమంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ చైర్మన్ పి సుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ఆర్డిఒకు చైర్మన్ అధ్యక్షతన పరిరక్షణ కమిటీ సభ్యులు చేరుకొని, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 9వ తేదీన ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసి లిడ్ క్యాప్ భూ సమస్య పై వినతిపత్రం అందజేయగా జిల్లా కలెక్టర్ సూచన మేరకు తిరుపతి ఆర్డిఒను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌడపేరు చిట్టబాబు, ఎస్సీ, ఎస్టీ, వి.ఎం.సి పి.వాలముని, కె.సుధాకర్ బాబు (ఎంఎంజెఎస్), చర్మకారుల సంక్షేమ సంఘం పి.కాటయ్య, మాదిగ సంక్షేమ సంఘం నాయకులు కారుమంచి మునిరామయ్య, ఆది జాంభవ కమిటి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హాజ్ యాత్రకు ఏర్పాట్లు పూర్తి

**నేడు గన్నవరం నుండి సౌదీకి ప్రయాణం**



హాజ్‌యాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఫరూఖ్

గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 17, ప్రభాతవార్త: హాజ్‌యాత్రకు వెళ్ళే యాత్రీకులకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఫరూఖ్ తెలిపారు. శుక్రవారం గన్నవరం ఎస్‌యం కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈనెల 18, 19 తేదీల్లో హాజ్‌యాత్రీకులు ఇక్కడి నుండి నేరుగా సౌదీఅరేబియాకు విమానంలో వెళ్ళనున్నారు. ఈమేరకు గన్నవరం ఎస్‌యం కన్వెన్షన్ సెంటర్‌లో శిబిరం ఏర్పాటు చేసారు. యాత్రీకులు అందరూ శిబిరానికి చేరుకున్న అనంతరం ఇక్కడి నుండి ప్రత్యేక బస్సులో విమానాశ్రయానికి తరలించి విమానంలో సౌదీ పంపించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ శనివారం ఉదయం 9గంటలకు 160మంది యాత్రీకుల ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. పవిత్ర హాజ్‌యాత్రకు మన రాష్ట్రంనుండి ఈఏడాది 2005మంది హాజ్‌యాత్రకు వెళుతున్నట్లు మంత్రి వివరించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి రెండురోజుల్లో మొత్తం 335మంది సౌదీ వెళుతున్నట్లు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చే యాత్రీకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. విమానాశ్రయం నిబంధనలకు అనుగుణంగా లగేజ్‌ప్యాకింగ్ చేసుకునేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించామని, గుర్తింపుకార్డుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈఏడాది 50శాతం మహిళలు హాజ్‌యాత్రకు వెళుతున్నారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సదుపాయాలు కల్పించామన్నారు. యాత్రీకులకు ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసామని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఫరూఖ్ వివరించారు. బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం జిల్లాఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు.

## కల్తీ పాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు




దగదర్తి (నెల్లూరు), ఏప్రిల్ 17 ప్రభాత వార్త: నెల్లూరు జిల్లా దగదర్తి మండలం దామవరం గ్రామంలో కల్తీ పాలు తయారు చేస్తున్న బి.పరిపూర్ణ అనే వ్యక్తి ఫుడ్‌సేఫ్టీ డిపార్టుమెంట్ అధికారులకు దామవరం గ్రామంలో కల్తీ పాలు తయారు చేస్తున్నారని రాబడిన సమాచారం మేరకు ముందు జాగ్రత్తగా పోలీసు ప్రొటెక్షన్‌తో ఓ ఇంట్లో తనిఖీలు చేశారు. తనిఖీ సమయంలో అక్కడ మూడు క్యాన్లలో సుమారు 90 లీటర్ల పాలు ఉన్నట్లు గమనించారు. విచారణలో భాగంగా ఆయిల్, షుగర్, సాల్ట్ వంటి పదార్థాలను మిక్సీలో కలిపి పాలను కల్తీ చేసి, ఆ పాలను చంద్రశేఖరపురంలోని విఘ్నేశ్వర డైరీకి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఉన్న మూడు పాల క్యాన్ల నుండి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రమోగశాలకు పంపించారు. ఆ పరీక్షలో కల్తీ పాలుగా నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాల్సిన వస్తుందని ఫుడ్‌సేఫ్టీ అధికారులు తెలిపారు. వీరితో పాటు ఎస్సై జంపని కుమార్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

# వేసవిలో నయా క్రాప్ టాప్





వేసవిలో ఓ నయా ట్రెండ్‌నీ తెచ్చేసింది. అదే క్రాప్‌టాప్-పలాజో జోడీ! ఆధునికంగా కనిపించాలనుకునే అమ్మాయిలే కాదు. పెళ్లిళ్ల వంటి వేడుకల్లో సంప్రదాయంగా సందడి చేయాలనుకునే వారందరికీ ఇది భలేగా నప్పేస్తుంది. ఇటు సౌకర్యంగానూ, అటు స్టైలిష్‌గానూ ఉండటం వల్ల అమ్మాయిలు మనసు పడుతున్నారు. కాంట్రాస్ట్ డిజైన్లు, ఆడంబరంగా ఆకట్టుకునే ఎంబ్రాయిడరీ సొగసులు.. ఇలా ఒకటేమిటి మీకు నచ్చినట్లుగా వచ్చి మిమ్మల్ని మెప్పించ దానికి సిద్ధమైపోయాయి. మరింకెందుకాలస్యం మీరూ ఒకటి ప్రయాత్నించి చూడండి.వారెవ్వా అనకుండా ఉండలేరు మరి.



ఫ్యాషన్ ఫ్యాషన్

# దేశ రక్షణలో అక్కాచెల్లెళ్లు



ఆ అక్కాచెల్లెళ్లు బీటెక్ పూర్తిచేశారు. ప్రాంగణ నియామకాల్లో మంచి వేతనాలతో కొలువులూ సాధించారు. కానీ అందులో చేరలేదు. తండ్రి నుంచి స్ఫూర్తి పొంది దేశ రక్షణలో భాగమవ్వాలను కున్నారు. అనుకోవడంతోనే ఆగిపోలేదు. లక్ష్యాన్ని చేరుకున్నారు కూడా.

బాపట్ల జిల్లా, పిట్టలవానిపాలెం మండలం, చందోలుకు చెందిన హైదర్‌బోగ్ సైన్యంలో సుబేదార్. హైదర్, రజియా సుల్తానాల కుమార్తెలు నేహ, ఆషికా తబస్సుమ్. ఇద్దరూ చందోలులోనే అయిదో తరగతి వరకూ చదువు కున్నారు. తర్వాత వీరి కుటుంబం బెంగళూరులో స్థిరపడింది. అక్కడే చదువుతూ బీటెక్ పూర్తిచేశారు. ప్రాంగణ నియామకాల్లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మంచి వేతనంతో ఐటీ కొలువులు వచ్చినా చేరలేదు. చిన్నప్పట్నుంచీ నాన్నను ఆర్మీ దుస్తుల్లో చూస్తూ పెరిగిన ఆ అక్కాచెల్లెళ్లు సైన్యంలో చేరాలని కలలు కన్నారు. ఓ పక్క ఇంజినీరింగ్ చదువుతూనే యూపీఎస్సీ నిర్వహించే సీడీఎస్ (కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్) పరీక్షకు సిద్ధమయ్యారు. ఇద్దరూ చదువుల్లో టాపర్లే. అందుకే రాతపరీక్ష పెద్ద సమస్య కాదన్న అవగాహనకు వచ్చారు. శరీరదారుఢ్య పరీక్షలూ, ఇంటర్వ్యూపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలనుకున్నారు.

**సీనియర్, జూనియర్ అయినా..**

చదువులో నేహ కంటే ఆషిక ఏడాది జూనియర్. అయినా, ఇద్దరూ కలిసే సీడీఎస్‌కు సిద్ధమయ్యారు. ఇంజినీరింగ్ తర్వాత ఇద్దరూ అందుకు అవసరమైన రాత పరీక్ష రాసి విజయవంతమయ్యారు. ఆపై శరీరదార్ఢ్య పరీక్ష, ఎస్ఎస్బీ ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపారు. పెద్దమ్మాయి నేహ చెన్నై ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ఏడాది పాటు కఠోర శిక్షణను విజయవంతంగా పూర్తిచేశారు. ఇటీవల నిర్వహించిన ఆఫీసర్స్ పాసింగ్ అవుట్ పరేడ్‌లోనూ ఉంది. భారత సైన్యంలో లెఫ్టినెంట్ అధికారిగా నియమితుల య్యారామె. చిన్నమ్మాయి ఆపి ఇటీవల నావికాదళంలో సబ్ లెఫ్టినెంట్‌గా ఎంపిక య్యారు. ప్రస్తుతం కేరళలోని ఎజిమల భారత నావికా దళ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ తర్వాత నావికా దళంలో సబ్ లెఫ్టినెంట్ అధికారిగా విధుల్లో చేరనున్నారు. ఒకరు ఆర్మీలో, మరొకరు నేవీలో చేరారు ఇద్దరిదీ సమానమైన హోదానే. కుమార్తెలు రక్షణలో ఫ్రంట్‌లో చేరతామని చెప్పగానే వెన్నుతట్టి ప్రోత్స హించిన తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు ఒకరికొకరు సాయపడుతూ, ప్రోత్సహించు కుంటూ లక్ష్యం దిశగా నడిచారు. ఇద్దరూ తమ తొలి ప్రయత్నంలోనే విజేతలుగా నిలవడం విశేషం, ▫

# ఊపిరి పోసిన రామనామం

పరమ భాగవతోత్తముడు తులసీదాసు. రామనామ స్మరణంలో పునీతుడయ్యాడాయన. రామనామ మహిమను తన వాక్కులోనూ, ఆ శ్రీరాముడు తేజాన్ని తన హృదయంలోనూ నింపుకున్న భక్తాగ్రేసరుడు. ఒకసారి ఒకస్త్రీ అమితంగా దుఃఖపడుతూ మహాభక్తుడైన తులసీదాసు దగ్గరకు వచ్చింది. తులసీదాసు ఆమె దుఃఖానికి కారణం అడగకుండానే అప్రయత్నంగా 'దీర్ఘసుమంగళీభవా' అని దీవించాడు. ఆ మాటలవిని ఆమె వాక్కయి పోయింది. ఆమె దుఃఖం మరింతంగా పెరిగింది. రోధిస్తోంది. పరమ భక్తుడైన రామదాసు కూడా తనను అవహేళన చేస్తున్నాడు అనిపించింది. తల్లడిల్లి పోయింది. స్వామి నా భర్తచనిపోయి కొద్దిసేపయింది. మాది ఎంతో అన్యోన్యమైన దాపంత్యం ప్రేమానురాగాలతో పెనవేసుకున్న బంధం మాది. భగవంతుడి నిర్ధయకు అమానుషంగా బలైపోయిన నేను నా దుఃఖాన్ని భరించలేక ఓదార్పు కోసంమీ దగ్గరకు వచ్చాను. మీకు కూడా నేను అంత చులకనైపోయానా? ఎందుకు స్వామి నన్నిలా అప హాస్యం చేస్తున్నారు. నా ఆరాధ్యదైవం శ్రీరామచంద్రమూర్తి. నా నోట పలికించ కుండా వున్నట్లయితే, ఆవాక్కులు వెలువడేవేకావు. అది భగవ ద్వాణి, వృథాకాదు. నిస్సందేహంగా భవిష్య ద్వాంగే. నువ్వు నిశ్చయంగా దీర్ఘ సుమంగళివే కాగలవు. తక్షణం వెళ్ళు నీ భర్త చెవులో రామ నామాన్ని ఉచ్చరించు నా మాట విశ్వసించు అన్న తులసీదాసు మాటల్లో శ్రీ రామచంద్రుని సంకల్ప వినిపించింది. ఆ భక్తునిది దృఢ విశ్వాసం, ఆమెలో నమ్మకాన్నికలిగించింది. వెంటనే పరుగు పరుగున మృత దేహం వద్దకు చేరింది. అప్పటికే భర్త చెవిలో రామనామాన్ని ఉచ్చరించడం మొదలుపెట్టింది. ఆవిడ చర్యలను చూసి బంధు జనం నవ్వ కోవడం ప్రారంభించారు. అంతలోనే అద్భుతం జరిగింది. నిదురలో నుంచి లేచి, మెలకువ వచ్చినట్లుగా లేచి కూర్చున్నాడు. ఆ ప్రాంతమంతా రామనామంతో మారుమ్రోగిపోయింది.

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# మష్రూమ్ టోస్ట్



**కావలసిన పదార్థాలు:** మష్రూమ్స్ (పుట్టగొడుగులు): ఒక కప్పు, బ్రెడ్‌స్లైసెస్: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, క్యాప్సికమ్: ఒకటి, వెన్న: అర కప్పు, క్రీమ్ చీజ్: అర కప్పు, మిరియాల పొడి: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, వెల్లుల్లి రెబ్బలు: నాలుగు.

**తయారీ విధానం:** మష్రూమ్స్‌ను ముక్కలుగా చేసుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ వెన్న వేసి వేడయ్యాక సన్నగా తరిగిన వెల్లుల్లి, మష్రూమ్ ముక్కలు, క్యాప్సికమ్, ఉల్లిగడ్డ ముక్కలు వేసి బాగా వేయించాలి. అన్నీ బాగా వేగాక మిరియాల పొడి, ఉప్పు వేసి మరో రెండు నిమిషాలు వేయించి దించేయాలి. బ్రెడ్ స్లైస్‌పై క్రీమ్ చీజ్ రాసి, మష్రూమ్ మిశ్రమం పరిచి, పైనుంచి మరో స్లైస్ ఉంచాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి, అప్పటికే తయారు చేసి పెట్టుకున్న బ్రెడ్ స్లైసెస్‌ను రెండు వైపులా వెన్న వేసి కాల్చుకుంటే మష్రూమ్ టోస్ట్ రెడీ.

ఆరోగ్య భాగ్యం

# వేసవిలో తాటి ముంజలు

వేసవిలో పిల్లలు మరియు పెద్దలు ఇష్టంగా తినే పండు తాటిముంజలు. దీన్ని ఇంగ్లీష్‌లో ఐస్ ఆపిల్ లేదా పామిరా పామ్ ఫ్రైట్. డబ్‌పామ్, వైన్ పామ్, సీ కొబ్బరి అని తమిళంలో నుంగు, పనమంగు అని, హిందీలో తడ్గోలా, తారి, తద్ఫాలి అనీ కన్నడంలో తాలి హన్ను, తాటి నింగు అనీ మెంగాలీలో లాల్, లాల్ పాటలి, మలయాళంలో పననంగు అనీ, మరాఠీ లని తడోలా తల్‌నారి అనీ, ఒరియాలో తాలా అనీ, తెలులో తాటి ముంజలు, మందారపండు, ముంజలు చల్లని రాణి అనీ పిలుస్తుంటారు. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉండి తియ్యగా, నోటో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలిభాగంలో నీరు ఉంటుంది. ఈ పండు శరీరానికి చలువ చెస్తుంది తియ్యగా నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉండే వీటి లోపలి భాగంలో నీరు ఉంటుంది. ఈ పండు శరీరానికి చలువ చేస్తుంది. దీన్ని 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు. ఇవి తిటిచెట్ల కాయల నుండి వస్తాయి. తాటి చెట్టుని 'ఆంధ్ర కల్పవృక్షం అని అంటారు. దీని మూలాలు దక్షిణ మరియు ఆగ్నేయా సియానికి ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక మరియు థాయిలాండ్‌లకి చెందినది. ఇవి భారత్‌లో ఆంధ్ర, మహారాష్ట్ర తమిళనాడు, వీటి ఒరిస్సా తెలంగాణా పశ్చిమ బెంగాల్ వంటి ఉష్ణమండల ప్రాంతాల్లో దొరుకుతాయి. వీటి నుండి తాటి ముంజలే కాకుండా, తాటి నుండి తాటి తేగలు తాటి బెల్లం మరియు తాటి కల్లు వంటివి దశాబ్దాలుగా స్థానిక ఆహార సంస్కృతిలో భాగమయ్యాయి. తమిళనాడులో తాటి చెట్టు మీద గౌరవంతో దాన్ని అధికారిక వృక్షంగా పరిగణిస్తారు. వేసవిలో లభించే ఈ ప్రకృతి ప్రసాదం చౌకగా అందరికి అందుబాటులో లభిస్తుండడం ఒక విశేషం. ఇవి శరీరాన్ని చల్లబరిచి, దాహాన్ని తగ్గించడంతోపాటు పోషకాలకి నిలయంగా ఉండే సూపర్ ఫుడ్. వీటిని పిల్లలు, పెద్దలు వయసుతో సంబంధం లేకుండా అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. ఇవి వేసవిలో చల్లదనాన్ని తేమని అందించి, కొబ్బరిని పోలిన కొద్దిపాటి తీపి రుచిని కల్గి ఉంటుంది. ఇవి గోధుమ రంగు తొక్కతో కప్పబడి ఉంటుంది. దీని తీసివేస్తే లోపల మృదువైన జెల్లీ లాంటి తెల్లని గింజ కన్పిస్తుంది. ఒక్కో పండుగుత్తిన సుమారు 10–18 సెం.మీ వ్యాసంతో ఉంటుంది. ప్రతి పండులో 1–3 తినదగిన గింజలుంటాయి. ఈ ఐస్ ఆపిల్ ఆకృతిలో లిచీ పండుని పోలి వేసవిలో శరీరానికి అవసరమైన ఖనిజాలు మరియు విటమిన్ల మిశ్రమాన్ని కల్గి ఉండే అద్భుతమైన శీతలీకరిణి అని చెప్పవచ్చు. ఎంతో పురాతనమైన ఈ చెట్టు నుండి వచ్చే ఈపండులోని 3 చిన్న ముంజల్ని గంటలోపు తినాలి. లేకపోతే అది తన రంగుని, రుచిని కోల్పోతాయి. థాయ్ ప్రజలు ఈ పండుని ఉపయోగించి 'ఖానోమ్ టాన్' అని పిలిచే, ఆవిరి మీద ఉడికించిన మెత్తటి తాటి పండు కేక్‌ని తయారు చేయడం విశేషం. తమిళనాడు, పశ్చి బెంగాల్‌లో దీంతో పాయసం చేస్తారు కూడా. ఇది భారతదేశంలో శతాబ్దాలుగా ఆదరణ పొందిన ఒక ప్రసిద్ధ బొనాసస్ ఫ్లాబెల్లిఫర్ అనే చెట్టుకు కాసే వేసవి పండు. ఈ పండు గుండ్రంగా, చిన్న బంతి పరిమాణంలో ఉంటుంది. దీన్ని పచ్చిగా తినవచ్చు. కొంతమంది రుచిని మెరుగుపర్చడానికి చక్కెర లేదా తేనెని కలిపి ఐస్ ఆపిల్ పుడ్డింగ్, ఐస్ ఆపిల్ స్మూతీస్ మరియు ఐస్ ఆపిల్ షర్బత్‌ల వంటి వివిధ రకాల డెజార్ట్‌లు మరియు పానీయా లలో కూడా ఉపయోగి స్తారు. అంతేగాకుండా జామ్‌లు, బర్ఫీ, పేడా వంటి మిఠాయిల తయారీలో ఉపయోగించడం విశేషం. ▫



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# 'మా ఇంటి బంగారం' మే 5న గ్రాండ్ రిలీజ్



ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం'మా ఇంటి బంగార్రం. సమంత హీరోయిన్‌గా నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.'మా ఇంటి బంగార్రం టీజర్ ఇప్పటికే అందరిలోనూ బజ్‌ను క్రియేట్ చేసింది. 'తస్సాదియ్యా అంటూ సాగే ఈ పాటకు రెహమాన్ సాహిత్యాన్ని అందించగా.. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ ఆలపించారు. ఇక సంతోష్ నారాయణన్ బాణీ ఎంతో క్యాచీగా ఉంది. 'ఓ బేబీ' తరువాత నందినీ రెడ్డి, సమంత కలిసి చేస్తున్న చిత్రం కావడంతో సహజంగానే ఆడియెన్స్‌లో అంచనాలు ఏర్పడ తాయి. ఇక రాజ్ నిడిమోరు స్టోరీ, స్క్రీన్ ప్లేని అందిస్తుండటంతో మరింతగా హైప్ ఏర్పడింది చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ఫ్యామిలీ అంతా కలిసి చూసే చిత్రంగా మా ఇంటి బంగారం రాబోతోంది.

ఈ సినిమాని సమ్మర్ కానుకగా మే 15న విడుదల చేయబోతోన్నారు.

# గ్యాంగ్ స్టర్ చిత్రాలకు సరికొత్త చిరునామా 'టాక్సిక్'



లాస్ వేగాస్‌లో నిర్వహించిన సినిమాకాన్ 2026 కార్యక్రమంలో రాకింగ్ స్టార్ యశ్ సందడి చేశారు. టాక్సిక్ : ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్ గురించి వేదికపై యశ్ మాట్లా డిన మాటలు, చెప్పిన విషయాలు అందరినీ ఆకట్టుకుంటు న్నాయి. 'రామాయణ్ణ సహ నిర్మాత నమిత్ మల్హోత్ర, యశ్ ఇద్దరూ కలిసి 'టాక్సిక్' గురించి ఎన్నో విషయాల్ని పంచుకున్నారు. గ్యాంగ్ స్టర్ జానర్ చిత్రాలకు ఇకపై అడ్రస్‌గా, గైడ్‌గా 'టాక్సిక్' ఉంటుందని అభివర్ణించారు. అంతర్జాతీయ వేదికపై.. యశ్ మాట్లాడుతూ.. మొదటిసారిగా ఇంగ్లీష్‌లో మేం సినిమాని చిత్రీకరించాం. 'టాక్సిక్'లో ఎన్నో లేయర్స్ ఉంటాయి. ఇది రెగ్యులర్ యాక్షన్, గ్యాంగ్ స్టర్ చిత్రం కాదు. పైకి చూస్తుంటే.. ఇదొక యాక్షన్, గ్యాంగ్ స్టర్ మూవీలా మాత్రమే కనిపిస్తుంది. కానీ ఇందులో లోతైన సైకాలజీ, మనల్ని మనం చూసుకునేలా, మానవ సంబంధా లకు ప్రతీకగా ఈ చిత్రం ఉంటుంది. ఓ డార్క్ కారెక్టర్‌ను గొప్పగా చూపించారని మాత్రం చెప్పగలను. గొప్ప టెక్నీషియన్, గొప్ప దర్శకురాలు గీతూ మోహన్ దాస్‌తో పని చేయడం నాకెంతో ఆనందంగా ఉంది. ఆమె గ్యాంగ్ స్టర్ చిత్రాలకుకొ ఓ కొత్త దారి వేసినట్టుగా అనిపిస్తుంది. నాకు ఈ ప్రాసెస్ ఎంతో నచ్చింది. నేను ఎంతో ఎంజాయ్ చేశాను. ఇదొక విజువల్ ట్రీట్‌లా ఉంటుంది.

తార

# 'స్వయంభూ' ఫస్ట్ సింగిల్ 'రా రా ధీవర' రిలీజ్



నిఖిల్ సిద్ధార్థ తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'స్వయంభూ'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్‌ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ లో విడుదలైన ఫస్ట్ సింగిల్ 'రా రా ధీవర' అంచనాలను భారీగా పెంచింది. రవి బస్రూర్ సంగీతం అందించడంతో ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, ఆయన ఆ అంచనాలను మించి అదిరిపోయే సంగీతాన్ని అందించారు. ఈ పాటలో నిఖిల్ తన కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రఫ్ అండ్ టఫ్ లుక్, యుద్ధానికి సిద్ధమైన బాడీ లాంగ్వేజ్, ఖడ్గాలతో చేసే యాక్షన్ ఫైట్స్.. కఠిన సాధనను చూపిస్తున్నాయి. సినిమా గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. కేకే సెంథిల్ కుమార్ అద్భుతమైన విజువల్స్‌తో భారీ సెట్లు, యుద్ధభూములు, యోధుల గుంపులను అద్భుతంగా చూపించారు. దర్శకుడు భరత్ కృష్ణమాచారి తన విజన్‌ను భారీ స్థాయిలో ప్రజెంట్ చేశారు.

# 24న 'ఓ అందాల రాక్షసి' రీరిలీజ్



మల్టీ టాలెంటెడ్ షెరాజ్ మెహదీ దర్శకత్వంలో తానే హీరోగా నటించిన చిత్రం'ఓ అందాల రాక్షస్తి. గతంలో విడుదలైన ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. ఇప్పుడు ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఈ చిత్రాన్ని ఏప్రిల్ 24న రీరిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించి, అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా దర్శకుడు షెరాజ్ మెహదీ మాట్లాడుతూ,"అమ్మాయిలకు మోసాలు జరగకూడదనే ఉద్దేశంతో ఈ సబ్జెక్టు ఎంచుకున్నాను. ఈ సినిమా గ్లామర్‌పై ఆధారపడినది కాదు. మంచి కథా వస్తువుతో రూపొందిన వుమెన్ ఓరియెంటెడ్ చిత్రం. సమాజంలో అమాయక మహిళలు ఎలా మోసపోతున్నారో చూపించడంతో పాటు, అలాంటి మోసాలకు పాల్పడేవారికి తగిన శిక్ష తప్పదనే సందేశాన్ని కూడా అందిస్తున్నాం. గతంలో ఈ సినిమాను మిస్ అయిన వారు, మళ్లీ చూడాలనుకునే వారు రీరిలీజ్ సందర్భంగా థియేటర్లకు వచ్చి చూడాలని కోరుతున్నాను" అని తెలిపారు.ఈ చిత్రం కన్నడలో'ఓ సుందర రాక్షస్తి పేరుతో విడుదలై అక్కడ కూడా మంచి ఆదరణ పొందింది. చిత్రంలోవిహాన్షి హెగాడే, కృతి వర్మ, నేహా దేశపాండే, తమ్మారెడ్డి భరద్వాజ్, సుమన్ తల్వార్, షెరాజ్ మెహదీ, నేహా దేశ్‌పాండే, అనంత్ బాబు, ప్రియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి షెరాజ్ మెహదీ సంగీతాన్ని కూడా అందించడం విశేషం.

# 'CASTE' కథ అందరికీ కనెక్ట్ అవుతుంది



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన దర్శ కత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం **'CASTE'**ని. కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటి స్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ కు అద్భుత'మైన రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ.. ఇలా నలుగురితో కలిసి 2007లో హ్యాపీ డేస్ సినిమా చేశాం. 17 ఏళ్లు అయ్యింది. ఇప్పుడు మళ్లీ నలుగురితో కలిసి సినిమా చేశాం. గగన్ బాబు మాట్లాడుతూ. 'పుష్ప' సినిమా నాకు చాలా మందికి చేరువ చేసింది. నాకు అవకాశం ఇచ్చిన అందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను. సత్యం రాజేష్ మాట్లా డుతూ.. ఇప్పటివరకు ఎవరు టచ్ చేయని సెన్సిటివ్ పాయింట్‌తో డైరెక్టర్ ఈ కథను అద్భుతంగా తీర్చి దిద్దారు. రవి మాట్లా డుతూ.. నేను యాంకర్ రవిగా మీ అందరికీ తెలుసు. ఎప్పటినుంచో యాక్టర్ రవిగా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాను .డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ.. మా సినిమా ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసిన వివి వినాయక్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు. మనం చేసే పనిని బట్టి కులాన్ని నిర్ణయించే రోజుల్లో అంత బాగుండేది. కానీ మనిషి పుట్టుకను బట్టి కులాన్ని నిర్ణయించడం మొదలైనప్పటి నుంచి పరిస్థితులు మారి పోయాయి. నిర్మాత కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించిన మా డైరెక్టర్ జంపన్నకి ప్రత్యేక కృతజ్ఞతలు.

# 'లెనిన్' సెకండ్ సాంగ్ 'ఎట్టా ఎట్టా' విడుదల



జూన్ 26న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున సినిమా విడుదల యంగ్ అండ్ డైనమిక్ హీరో అఖిల్ అక్కినేని లేటెస్ట్ మూవీ 'లెనిన్' శరవేగంగా రూపొందు తోంది. ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన తొలి సాంగ్ వారేవా వారేవా..కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది. తమన్ సంగీత సారథ్యంలో విడుద లైన ఈ సాంగ్‌తో మూవీ ప్రమోషన్స్ షురూ అయ్యాయి. ఈ జోష్‌తో నిండిన డాన్స్ మెలోడీ క్యాచీ బీట్స్, ఎనర్జీతో మెప్పి స్తోంది. అఖిల్, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే కెమిస్ట్రీ ఈ పాటకు హైలైట్. అఖిల్ తన మాస్ స్టెప్స్‌తో అదరగొడుతుంటే, భాగ్యశ్రీ తన చార్మ్‌తో స్క్రీన్‌పై మెప్పిస్తోంది. ఈ ఇద్దరి జోడీని స్క్రీన్‌పై చూస్తుంటే చాలా ఎనర్జిటిక్‌గా ఉంది. 'లెనిన్' సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథతో పూర్తి ఎంటర్టైనర్ గా రూపుదిద్దుకుంటోంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో విడుదల కానుంది. ప్రేక్షకులకుమంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా మేకర్స్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు.

# 'పరమపద సోపానం' ట్రైలర్ లాంచ్



వైవిధ్యమైన సినిమాలతో హీరోగా మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు అర్జున్ అంబటి. అతను హీరోగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ పరమపద సోపానం. స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ శిష్యుడు నాగ శివ ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహించారు. గణపర్తి శ్వేత సమర్పణలో స్వయంభూ క్రియేషన్స్ బ్యానర్‌పై గణపర్తి నారాయణరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. తేలప్రోలు ప్రసన్న మరో నిర్మాత కాగా... పుల గం సుప్రియ కూడా సహ నిర్మాతగా వ్యవహరించారు. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ ఈ చిత్రంలో కథా నాయికగా నటించింది. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్ సినిమాతో తన మ్యూజిక్ పవర్‌ను చూపించిన దేవ్ జాండ్, ఈ చిత్రానికి సంగీతం అందించారు. అనంతరం శ్రీవిష్ణు మాట్లాడుతూ.. "ఇప్పుడే పరమపద సోపానం ట్రైలర్ చూశాను. చాలా అ ఇంట్రెస్టింగ్‌గా గ్రిప్పింగ్‌గా ఉంది.

# సింగ్ ఈజ్ కింగ్




**బెంగళూరు**

టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్... ఐపీఎల్‌లో మరోఘనత అందుకున్నాడు. వంద వికెట్ల క్లబ్‌లో చేరాడు. రికల్టన్, సూర్యకుమార్‌లను వరుస బంతుల్లో అవుట్ చేసి ముంబై నడ్డివిరిచిన అర్ష్‌దీప్...స్లాగ్ ఓవర్లలో రూథర్‌ఫోర్డ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. 4 ఓవర్ల కోటాలో 22 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. పంజాబ్ కింగ్స్ విజయాల్లో తన దైన రోల్ పోషిస్తున్నాడు. అయితే ఐపీఎల్‌లో 224 వికెట్లతో అందరికంటే ముందుండగా, భువనేశ్వర్ ఈ ఐపీఎల్ సీజన్‌లోనే 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 205 వికెట్లు ఉన్నాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ యంగ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డాడు. తన రెండో ఓవర్‌లోనే మ్యాజిక్ చేసిన అర్ష్‌దీప్... తొలి బంతికే రికల్టన్‌ను అవుట్ చేసి పెవిలియన్ పంపాడు. ఆ మరుసటి బంతికే సూర్యకుమార్ యాదవ్‌ను డకౌట్ చేసి ముంబైని కోలుకోలేని దెబ్బ తీశాడు. ఐపీఎల్ కెరీర్‌లో 100 వికెట్ల మార్కును అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన ఐదో లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు.

అలాగే పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ తరఫున 100 వికెట్లు పడగొట్టిన తొలి పేసర్‌గా అర్ష్‌దీప్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 2019లో కేవలం 20 లక్షల రూపాయల బేస్ ప్రైస్‌కు పంజాబ్ జట్టులోకి వచ్చిన అర్ష్‌దీప్... ఆ జట్టుకు ప్రధాన ఆయుధంగా మారాడు. కీలక సమయంలో వికెట్లు తీసి పంజాబ్ విజయంలో తన దైన పాత్ర పోషిస్తున్నాడు. ఐపీఎల్ 2026 పర్పుల్ క్యాప్ రేసులోకి అర్షదీప్ సింగ్ దూసుకొచ్చాడు.

# ఉప్పల్‌లో మళ్లీ రైజింగేనా?

**హైదరాబాద్, ఏప్రిల్ 17(వార్త క్రీడా ప్రతినిధి):** రెండు వరుస పరాజయాల తర్వాత సొంతగడ్డపై గెలుపు బాట పట్టిన సన్ రైజర్స్ హైదరాబాద్... నూతనోత్తేజంతో ఉప్పల్ స్టేడియం వేదికగా మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. రాత్రి 7.30 గంటల కు చెన్నై సూ పర్ కింగ్స్‌తో తలపడనుంది. చెన్నై సూపర్ కింగ్స్ వరుస మూడు పరాజయాల తర్వాత వరుస విక్టరీలతో గెలుపు ట్రాక్‌లో ఉంది. రెండు జట్లు కూడా రెండేసి విజయాలతో ఉన్నాయి. ఉప్పల్ స్టేడియంలోనే రాజస్థాన్ రాయల్స్ ఓడించడం ద్వారా సన్ రైజర్స్ హైదరాబాద్... కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ గెలుపు జోష్‌లో ఉన్నాయి. సీఎస్‌కే, సన్‌రైజర్స్ రెండు జట్లు కూడా బ్యాటింగ్, బౌలింగ్‌లో సమవుజ్జీగా ఉండ డంతో మ్యాచ్ ఉత్కంఠ రేపుతోంది.

సన్ రైజర్స్ హైదరాబాద్ సొంతగడ్డపై మరో విజయం సాధించాలని చూస్తోంది. అయితే అభిషేక్ ఫామ్ ఆందోళన పరుస్తోంది. అభిషేక్ క్రీజ్‌లో నిలిస్తే పరుగుల వరద ఖాయం. మరోవైపు ట్రావిస్ హెడ్, కెప్టెన్ ఇషాన్ కిషన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. రాజస్థాన్‌పై కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. ఆ తర్వాత వచ్చే హెన్రిక్ క్లాసెస్, నితీష్ కుమార్ రెడ్డి పరుగులు సాధిస్తుండడం ఎస్ఆర్‌హెచ్‌కు కలిసివచ్చే అంశం. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సలీల్ అరోరా, అంకిత్ వర్మ కూడా బ్యాట్ ఝుళిపించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు సన్‌రైజర్స్ ప్రతి మ్యాచ్‌లో 200 ప్లస్ పరుగులు చేస్తూ వస్తోంది. చెన్నై సూపర్ కింగ్‌పై కూడా అదే ధాటి ప్రదర్శిస్తే గెలుపు అవకాశాలు ఉంటాయి. బౌలింగ్‌లోనూ సన్‌రైజర్స్ పటిష్టంగా మారింది. సీనియర్లు హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కత్ స్థానంలో జట్టులోకి వచ్చిన పేస్ గన్స్ ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్... గత మ్యాచ్‌లో పటిష్ట రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్‌ను పేకమేడలా కూల్చారు. అదే ప్రదర్శన సీఎస్‌కే పైనా చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరికి తోడుగా శివంగ్ కుమార్, నితీష్ రెడ్డి కూడా చక్కగా బౌలింగ్ చేస్తుండడంతో ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కట్టడిచేసే స్థాయిలోనూ ఆరేంజ్ ఆర్మీ ఉంది.

ధోనీ ఇంకా లేకుండానే వరుసగా రెండు విజయాలతో చెన్నై పుంజుకుంది. సంజూ శాంమ్సన్ టీ20ప్రపంచకప్ ఫామ్ తిరిగి పొంద డంతో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ పటిష్టంగా మారింది. సెంచరీతో సహా రెండు మ్యాచ్‌ల్లో టాప్ స్కోరర్‌గా నిలిచి చెన్నైను గెలుపుబాటలో నిలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌పై అజేయ సెంచరీ సాధించడంతో పాటు నైట్ రైడర్స్‌పై 48 రన్స్ చేశాడు. కెప్టెన్ రుతురాజ్ గొక్వాడ్ ఫామ్‌లో లేకపోవడం కాస్త ఇబ్బందికరంగా మారింది. గత నాలుగు ఇన్నింగ్స్‌లలో రెండు అర్ధశతకాలతో ఆకట్టుకున్న యువ ఆటగాడు ఆయుష్ మహాత్రేకు ప్రమోషన్ ఇచ్చే విషయాన్ని సీఎస్‌కే పరిశీలించవచ్చు. ముకుల్ చౌదరీ స్లాగ్ ఓవర్లలో భారీగా పరుగులు సాధిస్తుండడం సీఎస్‌కేకు కలిసివచ్చే అంశం. శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్ కూడా బ్యాట్‌కు పనిచెపితే సీఎస్‌కేకు తిరుగుండదు. ఎడమచేతి వాటం పేసర్ ఖలీల్ అహ్మద్ గాయంతో ఈ సీజన్‌కు దూరమవ్వడంతో సీఎస్‌కే బౌలింగ్ బలహీనంగా మారింది. అన్షుల్ కంబోజ్ చక్కగా వికెట్లు తీస్తూ చెన్నై ఆశాకిరణంగా ఉన్నాడు.

**హెడ్ టు హెడ్:** ఇరు జట్లు 22 మ్యాచ్‌ల్లో తలపడితే ఎస్ఆర్‌హెచ్‌పై సీఎస్‌కేదే పైచేయిగా ఉంది. ఎస్ఆర్‌హెచ్ ఏడు మ్యాచ్‌ల్లో, సీఎస్‌కే 15 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. చివరిసారి ఇరు జట్లు తలపడినపుడు మాత్రం సీఎస్‌కేపై ఆరేంజ్ ఆర్మీ గెలుపొందింది.

**పిచ్ రిపోర్ట్:** ఉప్పల్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. గత మ్యాచ్‌లో బౌలర్లు డామినేట్ చేశారు. చక్కని లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తే వికెట్లు రాబట్టవచ్చు. టాస్ గెలిచిన జట్టు మొదట ఫీల్డింగ్ తీసుకోవడం ఉత్తమం.

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** అభిషేక్, హెడ్, కిషన్(కెప్టెన్), క్లాసెన్, సలీల్(వికెట్ కీపర్), అంకిత్, నితిష్ కుమార్, హర్ష్‌దూబే, శివంగ్, ప్రఫుల్ హింగే, మలింగ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** సాకిబ్ హుస్సేన్

**చెన్నై సూపర్ కింగ్స్:** సంజూ, రుతురాజ్(కెప్టెన్), అయూష్ మాత్రే, సర్ఫరాజ్, శివమ్ దూబే, బ్రేవిస్, ఓవర్టన్, అకీల్, నూర్ అహ్మద్, కంబోజ్, గుర్జాప్‌నీత్ ; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ముకుల్ చౌదరీ.




# వామ్మయ్య... ఎట్టకేలకు న్యాయం చేశాడు



**అహ్మదాబాద్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆటగాడు కామెరున్ గ్రీన్ ఎట్టకేలకు మెరిశాడు. సీజన్‌లో కామెరున్ గ్రీన్ తొలి హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో అర్ధసెంచరీ సాధించిన గ్రీన్ మొత్తంగా 55 బంతుల్లో 79 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. అయినా అతని ఇన్నింగ్స్ కోల్‌కతాను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయింది.

ఇక గతేడాది జరిగిన వేలంలో గ్రీన్‌ం 25 కోట్లు పలికి అత్యంత ఖరీదైన విదేశీ ఆటగాడిగా నిలిచాడు. అయితే గ్రీన్ ఈ సీజన్‌లో మాత్రం ఒక్క మ్యాచ్‌లోనూ చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఈ సీజన్‌లో కామెరూన్ గ్రీన్ ఐదు మ్యాచ్‌ల్లో వరుసగా 18, 2, 4, 32, 0 పరుగులు సాధించాడు. దీంతో అతడిపై విమర్శలు పెరిగిపోయాయి. 25 కోట్లు దండగంటూ అభిమానులు సోషల్ మీడియాలో గ్రీన్‌ను ఏకిపారేశారు.

అభిమానుల మాటలు గ్రీన్ మనుసుకు తగిలాయేమో కానీ గుజరాత్‌తో మ్యాచ్‌లో చివరిదాకా నిలబడి కేకేఆర్ గౌరవప్రదమైన స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో మెరిసినా కామరూన్ గ్రీన్... బౌలింగ్ మాత్రం చేయలేదు.

# గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ విన్




**అహ్మదాబాద్:** సొంతగడ్డపై జోరు చూపిన గుజరాత్ టైటాన్స్ హాట్రిక్ విజయాన్ని అందుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో కామరూన్ గ్రీన్(81) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. మిగతా బాట్స్‌మెన్ విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబడ మూడు వికెట్లు...సిరాజ్, అశోక్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ మరో 2 బంతులు ఉండగానే అయిదు వికెట్ల తేడాతో గెలుపొందింది.

ఈ మ్యాచ్‌లో శుభ్‌మన్ గిల్(50 బంతుల్లో 86) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. సాయి సుదర్శన్‌తో కలిసి అయిదు ఓవర్లలోనే 57 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చాడు. ఈ దశలో సాయి సుదర్శన్(22) అవుటైనా, జాస్ బట్లర్(25)తో కలిసి గిల్ ధాటిగా ఆడాడు. రెండో వికెట్‌కు రన్స్, మూడో వికెట్‌కు వాషింగ్టన్ సుందర్(13)తో కలిసి 46 రన్స్ జోడించడమే గాక గుజరాత్ టైటాన్స్ స్కోరును 150 మార్కు దాటించాడు. ఈ క్రమంలో 27 బంతుల్లోనే 6 ఫోర్లు, రెండు సిక్స్‌లతో హాఫ్ సెంచరీ సాధించిన గిల్...అదే జోరుగా సెంచరీ సాధించే ఊపులో కనిపించాడు. చివరకు గిల్ ఇన్నింగ్స్‌కు అరోరా తెరదించాడు. మిగతా పనిని గ్లెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, షారుక్ పూర్తి చేసి గుజరాత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు.

## రూ.40 వేలకోట్ల సమీకరణకు

# రిలయన్స్ జియో ఐపిఒ




**ముంబయి, ఏప్రిల్ 17:** ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సర్వీసెస్ కంపెనీ జియో ప్లాట్ ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. జియో ఐపీఓకు సంబంధించిన ముసాయిదా పత్రాలను మే నెలలో మార్కెట్ రెగ్యులేటరీ సెబీకి సమర్పించనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. గత మార్చి నెలతో ముగిసిన చివరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లెక్కలతో ఈ డ్రాఫ్ట్ పత్రాలను సమర్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జియో ఐపీఓకు సంబంధించిన పత్రాలను మార్చి నెల ముగిసే నాటికే సమర్పించాలని కంపెనీ తొలుత భావించినట్లు వార్తలు వచ్చాయి. డిసెంబర్ నెలతో ముగిసిన మూడో త్రైమాసిక ఫలితాలతో ఐపీఓ పత్రాలను దాఖలు చేయనున్నట్లు అప్పుడు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఇరాన్ అమెరికా యుద్ధం రూపంలో ఐపీఓ సన్నాహాలకు బ్రేక్ పడింది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఈ ఐపీఓకు ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయని తెలుస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ నుంచి దాదాపు 20 సంవత్సరాల తర్వాత జియో ప్లాట్ ఫామ్స్ రూపంలో తొలిసారి ఒక కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఇది దేశంలోని మెగా పబ్లిక్ ఇష్యూల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. జియో ప్లాట్ ఫామ్స్ కంపెనీ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.15.78 లక్షల కోట్లుగా లెక్కగట్టారు. ఐపీఓ ద్వారా ఇందులో 2.5 శాతం వాటాను జియో విక్రయించినా దాదాపు రూ.40 వేల కోట్లు సమీకరించవచ్చని అంచనా. ఐపీఓను నిర్వహించేందుకు కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, జేఎం ఫైనాన్షియల్ వంటి 19 బ్యాంకులను ఇప్పటికే రిలయన్స్ నియమించుకుంది. మే, 2026లో డీఆర్‌హెచ్‌పీ సమర్పించే అవకాశం ఉంది. రూ.40 వేల కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా దేశంలోని అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ఆకాశ్ అంబానీ నాయకత్వంలో ఈ ప్రక్రియ జరగనుంది. సెబీ నిబంధనల ప్రకారం 2.5 శాతం నుంచి 5 శాతం వరకు వాటాను విక్రయించే అవకాశం ఉంది. ఈ లెక్కన 5 శాతం వాటా విక్రయించినట్లయితే రూ.80 వేల కోట్లతో అతిపెద్ద ఐపీఓగా అవతరించనుంది.

# ఆసియాలో నం.1 బిలియనీర్ అదానీ



**ముంబయి, ఏప్రిల్ 17:** అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా మరోసారి రికార్డు సాధించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని వెనక్కి నెట్టి మొదటిస్థానంలోకి దూసుకెళ్లారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం, గౌతమ్ అదానీ సంపద 92.6 బిలయన్ డాలర్లు ఉంది. ముకేశ్ అంబానీ సంపద 90.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ఓడరేవులనుంచి ఎనర్జీ వరకు విస్తరించిన అదానీ గ్రూప్ షేర్లకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఓడరేవుల నెట్‌వర్క్, పునరుత్పాదక ఇంధనం, విమానాశ్రయాల నిర్వహణలో అదానీ గ్రూప్ దూసుకుపోతోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో అదానీ భారీ పెట్టుబడులు పెడుతోంది. దీంతో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ 200 బిలియన్ డాలర్లు దాటింది. అదానీ గ్రూప్ స్టాక్స్ కూడా ఇటీవల భారీగా పెరిగాయి. అదానీ పవర్ 1 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2 శాతం, అదానీ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌తో పాటు ఇతర కంపెనీల స్టాక్స్ నేటి ట్రేడింగ్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి.

ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతమ్ అదానీ 19వ స్థానంలో ఉన్నారు. ప్రపంచ స్థాయిలో చూస్తే, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఆయన నికర సంపద సుమారు 656 బిలియన్ డాలర్లుగా ఉంది. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ 286 బిలియన్ డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 269 బిలియన్ డాలర్లతో మూడో స్థానంలో ఉన్నారు. ప్రపంచ టాప్ 50 ధనవంతుల జాబితాలో భారత్ నుంచి ఉన్నవారు అదానీ, అంబానీ ఇద్దరే కావడం విశేషం. గత దశాబ్దానికి పైగా అంబానీ భారతదేశంలో అత్యంత ధనవంతుడిగా కొనసాగారు. 2022లో అదానీ గ్రూప్ షేర్ల పెరుగుదలతో మొదటిసారి ఆయన అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. అదాని గ్రూప్ ప్రస్తుతం రవాణా, లాజిస్టిక్స్, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సహజ వనరులు, విమానాశ్రయాలు, రక్షణ, ఏరోస్పేస్, ఆహారం, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, బిజినెస్ ఇంక్యుబేషన్ వంటి రంగాల్లో, డేటా సెంటర్లు, సిమెంట్, మీడియా, రోడ్లు, రైల్వేలు, రియల్ ఎస్టేట్, ఎఫ్ఎంసీజీ వంటి అనేక రంగాల్లో విస్తరించి ఉంది. భారత్ నుంచి చూస్తే, షాపూర్ మిస్త్రీ కుటుంబం, సావిత్రి జిందాల్, లక్ష్మీ మిట్టల్, శివ్ నాడార్, కుమార మంగళం బిర్లా, సునీల్ మిట్టల్ కుటుంబం, రాధాకృష్ణ ధమానీ, అజీమ్ ప్రేమ్‌జీ బిలియనీర్ ఇండెక్స్‌లో కొనసాగుతున్నారు.

## వారాంతంలో మెరిసిన సెన్సెక్స్, నిఫ్టీ

# లాభాల్లో ముగిసిన ఈక్విటీ సూచీలు




**ముంబయి, ఏప్రిల్ 17:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు చల్లారడంతో మార్కెట్లు వారాంతంలో ఒక్కసారిగా కోలుకున్నాయి. నిఫ్టీ తన పాత 24,350 మార్కును ఆందుకోసగా బిఎస్ఇ కూడా అనూహ్యంగా ర్యాలీ తీసింది. సెన్సెక్స్ 504.86 పాయింట్లుపెరిగి 78,493.54 పాయింట్ల వద్ద ట్రేడింగ్‌కు నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 156.80పాయింట్లు పెరిగి 24,353.55 పాయింట్లకు చేరింది. హిందూస్థాన్ యూనిలీవర్ 4.75శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.61శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.55శాతం కొంతమేర సూచీలకు వత్తాసు పలికాయి. బిఎస్ఇలో 150 మిడ్‌క్యాప్‌సూచీ 1.26శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.52శాతం క్షీణించాయి.

మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 3043 కంపెనీలు ర్యాలీ తీస్తే 1284 షేర్లు దిగజారాయి. మరో 180 షేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత్ పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.09శాతంపెరిగి 6.898 శాతానికి పెరిగితే విదేశీకరెన్సీ మార్కెట్‌లో రూపాయి 92.85వద్ద ట్రేడింగ్ ముగించింది. అంతకు ముందురోజు 93.15 వద్దనే ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ జూన్5 నాటి సెటిల్‌మెంట్లు 0.09శాతం క్షీణించి రూ.1,53,012కి చేరింది. అమెరికా డాలర్ సూచీలో డాలర్ 97.92గా కొనసాగింది. అమెరికా పదేళ్ల బాండ్లుకూడా 0.35శాతం క్షీణించి 4.296కి చేరింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లు3.37 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 96.2డాలర్లుగా కొనసాగాయి.

ఇక షేర్లపరంగాచూస్తే అపోలో మైక్రో సిస్టమ్స్ 16.78శాతం పెరిగింది. బజాజ్ కన్స్యూమర్‌కేర్ 9.80శాతం, విఎస్‌టి ఇండస్ట్రీస్ 9.73శాతం, వారీ రెన్యువబుల్ టెక్నాలజీస్ 5.44శాతం, ఏంజెల్‌వన్ 10.58, క్రిసిల్ ర్యాలీడ్ 5.36, కోల్టే పాటిల్ డెవలపర్స్ 5.99 శాతం, రైల్ వికాస్ నిగమ్ 3.22శాతం, కెపిఐ గ్రీన్ ఎనర్జీ 1.71 శాతం పెరిగితే అలోక్ ఇండస్ట్రీస్ 0.83శాతం క్షీణించింది. మద్యభారత్ ఆగ్రో ఉత్పత్తుల సంస్థ 6.95శాతం, కార్బన్‌స్టీల్‌ఇంజినీరింగ్ 2.12శాతం పెరిగాయి. మొత్తంగాచూస్తే యుద్ధవాతావరణం చల్లబడుతున్నదన్న భావనతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఉపక్రమించారు. గ్లోబల్‌మార్కెటు ్లకూడా యుఎస్ డౌజోన్స్ 175 పాయింట్లు పెఇగింది. యూరోపియన్ సూచీలు కూడా వారాంతంలో పెరిగాయి. ఆసియా సూచీలపరంగా ఎక్కువ శాతం దిగువస్థాయిలోనే ముగిసాయి. రాత్రికి రాత్రే వాల్‌స్ట్రీట్ ఎస్అండ్‌పి 500 నాస్‌డాక్ కాంపోజిట్ రికార్డు గరిష్టాలకు పెరిగాయి.




# బిబిసిలో భారీగా ఉద్యోగుల లేఆఫ్

**లండన్, ఏప్రిల్ 17:** బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ బీబీసీలో భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ఖర్చులను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా దాదాపు 2వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది. 15ఏళ్లలో బీబీసీలో ఇదే అతిపెద్ద లేఆఫ్స్ కావడం గమనార్హం. సంస్థ మొత్తం21,500మంది సిబ్బందిలో దాదాపు 10 శాతం మందిపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. ఆల్‌స్టాఫ్ మీటింగ్‌లో ఉద్యోగులకు సందేశాలిచ్చారు. వచ్చే నెలలో మాట్ బ్రిట్టిన్ కొత్త డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టనున్న తరుణంలో ఈ భారీ తొలగింపులు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. 600 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ.7,535 కోట్లు) ఆదా ప్రణాళికలో భాగంగా ఈ ఉద్యోగాల కోతను ప్రకటించారు. మారుతున్న మీడియా రంగానికి అనుగుణంగా సంస్థను పునర్వ్యవస్థీకరించడమే లక్ష్యమని బీబీసీ పేర్కొంది. ప్రస్తుతం బీబీసీ తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. లైసెన్స్ ఫీజు ద్వారా ప్రధానంగా ఆదాయం పొందుతున్న బీబీసీకి నెట్‌ఫ్లిక్స్, డిస్నీ వంటి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది.

# స్వల్పకాలిక డిపాజిట్ల వైపు మొగ్గు




**ముంబయి, ఏప్రిల్ 17:** సీనియర్ సిటిజన్లు తమ భవిష్యత్తు లాభాలకోసం స్థిరమైన రాబడి అందించే పెట్టుబడి పథకాల్లో బ్యాంక్ డిపాజికే ఎక్కువ ఆసక్తిచూపుతారు. ప్రస్తుతం గరిష్ఠంగా 7.9 శాతం వరకు వడ్డీ రేట్లు ఉన్నాయి. పెద్ద బ్యాంకులు 7.5 శాతం వరకే వడ్డీ ఇస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అధిక వడ్డీ రేట్లు ఇస్తుంటే ప్రైవేట్ బ్యాంకులు వడ్డీ రేట్లు ఎక్కువ ఇస్తుండగా ప్రభుత్వబ్యాంకులు మూడో స్థానంలో ఉన్నాయి. 2025 నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 1.25శాతం మేర తగ్గించింది. దీంతో బ్యాంకులు సైతం అదే స్థాయిలో వడ్డీరేట్లను తగ్గించాయి. ప్రభుత్వ బ్యాంకులు 444, 555 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకులు గరిష్ఠంగా 7.10 శాతం వడ్డీ ఆఫర్ చేస్తున్నాయి. ఆ తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 7.05 శాతం వడ్డీ ఇస్తుండగా, బ్యాంక్ ఆఫ్ బరోడా 7 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 7.10 శాతంతో ఒక సీనియర్ సిటిజన్ 555 రోజులకు డిపాజిట్ చేసినట్లయితే మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 5,54,270 వరకు అందుతాయి. 18 నెలల కాలంలో ఈ డబ్బులు చేతికి వస్తాయి. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్లకు గరిష్ఠంగా 7.50 శాతం వడ్డీ లభిస్తోంది. ఇండస్ ఇండ్ బ్యాంక్ ఈ గరిష్ఠ వడ్డీ రేటును ఇస్తోంది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 7.20 శాతం వడ్డీ ,యాక్సిస్ బ్యాంక్ 7.20 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఐసీఐసీఐ బ్యాంక్ 7.10 శాతం వడ్డీ ఇస్తుండగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 7 శాతం మేర వడ్డీ అందిస్తోంది. ఇండస్ ఇండ్ బ్యాంకులో 18 నెలల కాలానికి రూ.5 లక్షలు జమ చేసినట్లయితే 7.50 శాతం వడ్డీ వర్తిస్తే మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 5,57,320 వరకు లభిస్తాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో గరిష్ఠ వడ్డీ రేట్లు లభిస్తున్నాయి. సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.90 శాతం వడ్డీ ఇస్తుంటే జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 7.77 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఇతర బ్యాంకులు 7 శాతం నుంచి 7.25 శాతం వరకు వడ్డీ అందిస్తునావీటిపై ఆసక్తి తక్కువగానే ఉంది.



# బలపడిన రూపాయి

**ముంబయి, ఏప్రిల్ 17:** అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ శుక్రవారం ట్రేడింగ్‌లో బలపడింది. ప్రభుత్వ రంగ చమురు శుద్ధి సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన కీలక ఆదేశం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. డాలర్లను నేరుగా కొనుగోలు చేయడానికి బదులుగా ప్రత్యేక క్రెడిట్ లైన్‌ను ఉపయోగించుకోవాలని ఆర్బీఐ సూచించడంతో డాలర్లకు డిమాండ్ తగ్గి రూపాయిపై ఒత్తిడి తగ్గింది. గత సెషన్‌లో93.20 వద్ద ముగిసిన రూపాయి, ఉదయం ట్రేడింగ్‌లో 25 పైసలు లాభపడి 92.95 వద్ద కొనసాగింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్, ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య కాల్పుల విరమణ వార్తలు, అమెరికాఇరాన్ చర్చలలో పురోగతి అంచనాలు కూడా రూపాయికి మద్దతునిచ్చాయి. ప్రపంచ మార్కెట్లలో డాలర్ బలంగా ఉండటం రూపాయి లాభాలను కొంతమేర పరిమితం చేస్తోంది. మరోవైపు అంతర్జాతీయంగా ముడిచమురుధరలు తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1 పైగా తగ్గి 97.99వద్ద, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 2 శాతం తగ్గి 92.91డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.